# విద్యావతి వెడ్స్ కృష్ణకుమార్

(నవల)

రచయిత్రి : “శ్రద్ధ”

ఉచిత ప్రసరణ

సర్వహక్కులు రచయిత్రివి

Dt : 29-03-2021

Hyderabad

జీవితంలో ఒక్కోసారి కొన్ని తమాషాలు ఎదురవుతుంటాయి.

ఎప్పుడో మన మనస్సులో దాగిన కొన్నిమధుర జ్ఞాపకాలు మన జీవితాంతం తోడుండేట్లు చేస్తాయి.

మనం ఎంత గిరి గీసుకుని ఉన్నా, పద్ధతుల పరిమితుల్లో పరిధుల నతిక్రమించకుండా మనల్ని మనం కాపాడుకుంటున్నా, మనం నమ్ముకున్న విలువల్ని నిరంతరం జాగరూకతతో పాటిస్తున్నా కొన్ని సార్లు విధి తన పని తను చేస్తూ మనం మనసులో అనుకునేవి, మనం కావాలని కోరుకునేవి, ఏ విలువలని అతిక్రమించకుండా, ఎలాంటి మానవ తప్పిదాలు జరగకుండా, తెలిసి మనం తప్పులు చేయకుండా అద్భుతంగా మనకు అనుకూలంగా మన మనసులలో అనుకున్నవి అనుకున్నట్లు చేసి విపరీతమైన ఆశ్చర్యానికి గురిచేస్తుంటుంది.

విధి అప్పుడప్పుడు మన జీవితాలతో సరదాగా ఆడుకుంటూ కొన్ని చిలిపి పనులు చేస్తూ తన ముచ్చట తీర్చుకుంటుంటుంది.

అలాంటి విధి చేసిన ఓ వింత తమాషాకు ఈ కథ ఓ నిజరూప తార్కాణం. ఓ నిస్సందేహ నిదర్శనం. ఓ అల్లరి భాగోతం.

**ఇక కథలోకి వస్తే ..................................**

అదో ప్రాంతీయ చిన్న సైజు జాతీయ బ్యాంకు.

బదిలీ మీద ఆరోజే ఆ జాతీయ బ్యాంకు లో హైదరాబాద్ బ్రాంచ్ కి హెడ్ గా జాయిన్ అయ్యాడు కృష్ణ కుమార్.

తాను కోరుకున్నట్లు హైదరాబాద్ కి ట్రాన్స్ఫర్ అయ్యింది. తన ఫామిలీ ని వదిలి ముంబై కి ప్రమోషన్ మీద వెళ్లి మూడేళ్లయింది. కొడుకు చదువు కోసం ఫామిలీని హైదరాబాద్ లోనే ఉంచి నెల నెలా వస్తూ పోతూ ఉండేవాడు. ఇక హ్యాపీ. అమ్మయ్య హైదరాబాద్ చేరుకున్నాను అనుకున్నాడు. రోజు ఇంటి భోజనం, కుటుంబంతో ఆనందంగా గడపొచ్చు అని ఆనందపడ్డాడు.

బ్రాంచ్ లో అడుగుపెట్టగానే అందరూ సాదరంగా రిసీవ్ చేసుకున్నారు. బ్రాంచ్ లో తనకి తెలిసిన వాళ్ళెవరూ కనపడలేదు. ఏ జి యం బ్రాంచ్ కాబట్టి ముప్పై మంది స్టాఫ్ ఉన్నారు. తన కేబిన్ లోకి వెళ్లి అటెండన్స్ రిజిస్టర్ తెప్పించుకున్నాడు. ఇవాళ ముగ్గురు సెలవులో ఉన్నారు.

సెలవులో ఉన్న వాళ్ళ పేర్లు చూసాడు కృష్ణ కుమార్. విద్యావతి అన్న పేరు అతన్ని ఆకర్షించింది. ఈవిడ ఆవిడ కాదు కదా అనుకున్నాడు. తమ బ్యాంకు లో

విద్యావతి అన్న పేరు ఒక్కరికే ఉందనుకునేవాడు ఎప్పుడూ. పేరుకు తగ్గట్టే ఆమెలో ఎదో వింత ఆకర్షణ, హృదయాన్ని గిలిగింతలు పెట్టే శక్తి ఉంది .

పదేళ్ల క్రితం కృష్ణ కుమార్ హైదరాబాద్ లో అశోక్ నగర్ బ్రాంచ్ ఇన్స్పెక్షన్ కి వెళ్ళినప్పుడు అక్కడ విద్యావతిని మొదటిసారి చూసాడు. అప్పుడు తాను ఇన్స్పెక్టర్ అఫ్ బ్రాంచెస్ గా వర్క్ చేసేవాడు. ఆ బ్రాంచ్ కి పది రోజులు ఇన్స్పెక్షన్ కి వచ్చాడు. విద్యావతిని ఫైల్స్, అకౌంట్స్ చూపించేందుకు తనకు అట్టాచ్ చేశారు బ్రాంచ్ మేనేజర్.

అప్పుడు ఆమె వయసు నలభై ఉండెదనుకుంటా. సౌందర్యాన్నంతా ఒక మూసలో పోస్తే అది విద్యావతిలా ఉంటుందనిపిస్తుంది. తల వెంట్రుకల ముంగురులు ముందుకు జారినప్పుడు మబ్బుల చాటున చంద్రునిలా ఉంటుంది. జుట్టు వెనుకవైపుకు జారినప్పుడు సూర్యుడిలా వెలిగిపోతుంటుంది. రోజూ విద్యావతిని చూస్తే ఎదో ఒక పరిమళం తన మనసు చుట్టూ తిరుగుతుండేది. మంచి పొడవు, పల్చటి శరీరం, అందమైన ముఖం, పచ్చని మేని ఛాయ, అన్నిటికంటే మించి ఆమె జుట్టు ఎంతో అందంగా ఉండేది. రోజూ ఆ జడకు మల్లెలు తురిమేది. ఆ మల్లెల గుబాళింపు కలల

లోకంలో విహరింప చేసేది. విద్యావతి మాట తీరు ఎంతో చక్కగా ఉండేది. నవ్వితే ముత్యాలు రాలెట్లు ఎంతో హుందాగా ముచ్చటగా ఉండేది. జెనెటిక్స్ లో యూనివర్సిటీ ఫస్ట్ ర్యాంకర్ అయినా ఒద్దికగా తన తెలివినంతా బ్యాంకు వర్క్ చెయ్యడంలో ప్రతిబింబించేది. ఎంతో రెస్పెక్టుఫుల్ గా ఉండేది.

ఆమె ఆకర్షణలో అసలు రహస్యం పొడవు జుట్టును చక్కటి జడ వేసుకుని, ఆ జడలో కూడా పైన రెండు వైపుల నుంచి కొన్ని వెంట్రుకలు తీసి ఒక స్మాల్ టెయిల్ వేసి ఆ స్మాల్ టెయిల్ ని పెద్ద జడలో కలిపేది అందంగా. ఆ పొడవాటి వాలుజడ పిరుదులపై అటూ ఇటూ ఊగుతుంటే అది చూసి కృష్ణ కుమార్ గుండె గోడ గడియారంలో పెండ్యులం లా ఊగేది. అలా ఆ బ్రాంచ్ ఇన్స్పెక్షన్ పది రోజులు విద్యావతి ని చూస్తూ రాత్రులు నిద్రపట్టక సతమతమవుతూ ఉండేవాడు. పక్కనే భార్య ఉన్నా, కళ్లెదుటా, కలలో కూడా విద్యావతి, ఆమె స్మాల్ టెయిల్ కనిపిస్తుండేవి. నిద్రలో ఆమె పేరు కలవరిస్తానేమోనని భయంగ ఉండేది కూడా.

ఇన్నిరోజులు తరువాత మళ్ళీ ఆ పేరు అటెండన్స్ లో చూసాడు. అందులోనూ తన బ్రాంచ్ లో స్టాఫ్ విద్యావతి. ఇంకేముంది రోజూ ఆమె స్మాల్ టెయిల్ చూస్తూ

ఉండొచ్చు. ఎలా ఉందో విద్యావతి. అలానే ఉందా లేక తనలో వయసు వల్ల మార్పు ఏమైనా వచ్చిందా. ఆమె గురించి ఎన్నో ఆలోచనలు ఆశగా మనసు చుట్టూ తిరుగుతున్నాయి. ఏదో తెలియని ఆనందం గుండె లోతుల్లో సుళ్ళు తిరుగుతోంది.

సబ్ మేనేజర్ ని పిలిచి అడిగాడు ఇవాళ ముగ్గురు లీవ్ లో ఉన్నట్లు కనపడుతోంది. ఎప్పుడు వస్తారు వాళ్ళు , ఎంతవరకు లీవ్ పెట్టారు అని. విద్యావతి పేరు ఒక్కటే అడగకుండా లీవ్ లో ఉన్న వాళ్ళందరి గురించి జనరల్ గా అడిగినట్లు అడిగాడు అనుమానం రాకుండా.

రాజలక్ష్మి మేడం మెటర్నిటీ లీవ్ సర్. రాజారావు ఈ వీక్ ఎండ్ వరకు లీవ్ అని చెప్పాడు. విద్యావతి మేడం రేపు వస్తుంది సర్.

సబ్ మేనేజర్ ని కూర్చోమని ఒక్కొక్కరి గురించి అడిగాడు. బ్రాంచ్ లో ఎవరు బాగా వర్క్ చేస్తారు. ఎవరు కస్టమర్ సర్వీస్ బాగా చేస్తారు, ఇలా అందరిగురించి చెప్పమన్నాడు.

ఒకరిద్దరు తప్పితే అందరూ బాగా వర్క్ చేసే వాళ్ళే సర్. అందర్లోకి విద్యావతి మేడం చాలా బాగా వర్క్ చేస్తుంది. తన పని తను చూసుకుని

వెళుతుంటుంది అని చెప్పాడు. అందుకే ఆమెకు లోన్స్ మానిటరింగ్ అప్పచేప్పాము. అందరినుంచి బకాయిలు చక్కగా వసూలు చేస్తుంది. మన బ్రాంచ్ కి ఎక్కువ యెస్ పీ ఏ లు లేకుండా చేస్తోంది ఆమె. మన బ్రాంచ్ లో ఉన్న అతి పెద్ద లోన్ విరాజ్ స్పిన్ టెక్స్ మానిటరింగ్ కూడా ఆవిడే చూస్తుంది. లోన్స్ కి సంబంధించి అలెర్ట్ గా ఫాలో అప్ చెయ్యడం, కట్టని వాయిదాలకు నోటీసులు ఇవ్వడం చాలా పర్ఫెక్ట్ గా చేస్తుంది.

మరి ఇంత కష్టపడుతోంది తాను ప్రమోషన్ తీసుకోలేదా అని అడిగాడు ఆశ్చర్యంగా ?

లేదు సర్. తనకు ఇంటరెస్ట్ లేదు. హైదరాబాద్ లోనే ఉండాలి అని తన కోరిక. హస్బెండ్ జాతీయ బాంకు లో చీఫ్ మేనేజర్. చీఫ్ మేనేజర్ ప్రమోషన్ మీద వరంగల్ కి నెల క్రితం ట్రాన్స్ఫర్ అయ్యాడు. ఆమెకి ఇద్దరు పిల్లలు. పిల్లల చదువు కోసం హైదరాబాద్ లోనే ఉంది . ఇద్దరు పిల్లలు ఇంజనీరింగ్ పూర్తి చేశారు. అబ్బాయి ముంబై లో జాబ్ చేస్తున్నాడు. అమ్మాయి పై చదువులకు అమెరికా వెళ్ళింది అంటూ చెపుతున్నాడు. ఇంతలో ఎవరో పిలిస్తే కేబిన్ నుంచి వెళ్ళాడు సబ్ మేనేజర్.

అతని మాటలు విన్నంతనే విద్యావతిని వెంటనే చూడాలనిపించింది. అబ్బా రేపటి వరకు ఆగాలి అని ఫీల్ అయ్యాడు కృష్ణ కుమార్. కృష్ణ కుమార్ వయసు యాభై రెండు ఉంటాయి. కానీ పొడవుగా, అందంగా, స్మార్ట్ గా ఉంటాడు. జుట్టు రాలలేదు. కొంచెం నెరిసింది కాబట్టి వారం వారం కలర్ వేస్తాడు. అతడికి ఒకడే అబ్బాయి. బి టెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు హైద్రాబాద్లో.

***

మొదటి రోజు బ్రాంచ్ లో బిజీ బిజీ గా గడిచింది కృష్ణ కుమార్ కి.

అందులోనూ అది కోటి మెయిన్ బ్రాంచ్. హెవీ బిజినెస్ బ్రాంచ్ అది.

ఎంతో మంది కస్టమర్స్ ఉన్నారు ఆ బ్రాంచ్ కి. వందేళ్ల క్రితం పెట్టిన బ్రాంచ్ కాబట్టి రోజూ చాలా మంది కస్టమర్స్ వస్తుంటారు. లోన్స్ చాలా ఇచ్చారు ఆ బ్రాంచ్ లో. లోన్స్ డిపార్ట్మెంట్ లోనే పది మంది స్టాఫ్ ఉన్నారు. విద్యావతి లోన్ మానిటరింగ్ చూస్తుంది. అంటే వాయిదాలు క్రమం తప్పకుండా కట్టించడం అన్నమాట.

ఈ మధ్య కాలంలో రుణాల బకాయిలు బాగా ఎక్కువయ్యాయి. అందుకే బ్యాంకు స్టాఫ్ లోన్ కస్టమర్స్ వెంటపడుతూ ఉండాలి బకాయిలు వసూలు చేసేందుకు. అప్పుడే వాళ్ళు తప్పించుకోకుండా కడుతుంటారు. చిన్న లోన్ కస్టమర్స్ చాలా

బుద్ధిగా కడుతుంటారు. లోన్ క్లోజ్ కాగానే మళ్ళీ బ్యాంకు వారు లోన్ రెన్యువల్ చేస్తారు కాబట్టి. వారితో ఎప్పుడూ ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఇబ్బందల్లా పెద్ద లోన్ కస్టమర్స్ తోనే. వారితో చాలా జాగ్రత్తగా డీల్ చెయ్యాలి. ఈ మధ్య కాలంలో పెద్ద లోన్స్ లో ఎక్కువ భాగం నిరుపయోగమైనవి గా మారడంవల్ల బ్యాంకు లు చాలా నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. అందుకు అసలు కారణం బ్యాంకు సిబ్బంది లోని పై అధికారులు కొందరు లంచాలకు అలవాటుపడి ఇష్టమొచ్చినట్లు రుణాలు మంజూరు చెయ్యడం వల్లనే. అన్ని జాతీయ బ్యాంకు లకు అది పెద్ద తలనొప్పిగా మారింది. అటువంటి వాళ్ళ వల్ల కొంతమంది బ్రాంచ్ మేనేజర్ లు కూడా డిస్మిస్ అయ్యి ఇళ్లకు వెళ్లారు. కొందరు సి బి ఐ కేసులతో బాధపడుతున్నారు. ఆ అవమానం భరించలేక కొందరు ఆత్మహత్య కూడా చేసుకున్నారు. కొంతమంది బ్రాంచ్ మేనేజర్ లు పై అధికారులు, జోనల్ మేనేజర్ లు చెప్పిన రెకమెండేషన్స్ తో రుణాలు మంజూరు చేస్తారు. అసలు ఆ రుణాలు ఇవ్వొచ్చో ఇవ్వకూడదో కూడా ఆలోచించరు. మేనేజర్స్ చాలా మందికి ప్రమోషన్స్ మీద మోజు ఉంటుంది. అందుకోసం తమ ఉద్యోగాలను, జీవితాలను కూడా పణంగా పెడతారు. వారి బలహీనతను ఆసరాగా చేసుకుని జోనల్

మేనేజర్లు మేనేజర్ల చేత అవకతవక రుణాలను మంజూరు చేయించి వాళ్ళు మాత్రం తప్పించుకుంటారు. జోనల్ మేనేజర్ ల లో ఎక్కువమంది లంచగొండి అధికారులు తయారయ్యారు. కృష్ణకుమార్ లాంటి నీతి నిజాయితీ అధికారులు అటువంటి ప్రలోభాలకు లొంగకుండా తమ ఉద్యోగాలను జాగ్రత్తగా కాపాడుకుంటూ బ్రతుకుతున్నారు.

ఆ రోజు బ్రాంచ్ కి వచ్చిన కొంత మంది పెద్ద కస్టమర్స్ ని కేబిన్ లో కి పిలిచి మాట్లాడాడు. అందరూ ఎంతో మంచి ఒపీనియన్ ఇచ్చారు బ్రాంచ్ గురించి. అందరికి హామీ ఇచ్చాడు. ఇంకా మంచి కస్టమర్ సర్వీస్ అందచేస్తానని. అందరూ హ్యాపీగా ఫీల్ అయ్యారు.

పొద్దున్న జాయిన్ అవుతూనే రెఫ్రెషమెంట్స్ తెప్పించాడు. బ్రాంచ్ స్టాఫ్ కి, కస్టమర్స్ కి ఇచ్చేందుకు. అది ఎంతో మంచిదయింది. అందరికీ నచ్చింది కూడా. జోనల్ మేనేజర్ కి, జోనల్ ఆఫీస్ లో ఎగ్జిక్యూటివ్స్ కి ఫోన్స్ చేసి మాట్లాడాడు రిపోర్ట్ చేసినట్లు. అందరిని పర్సనల్ గా వచ్చి కలుస్తానని చెప్పాడు. అందులో చాలా మంది కృష్ణకుమార్ కి తెలిసిన వాళ్ళే.

కృష్ణకుమార్ బాంకు లో చేరి మూడు దశాబ్దాలయ్యింది. చాలా వరకు స్టాఫ్ పరిచయమే అతనికి . అందులోను కృష్ణ కుమార్ చాలా బ్రాంచెస్ లొను, హెడ్ ఆఫీస్ డిపార్ట్మెంట్స్ లోను వర్క్ చేసాడు. అంతే గాక బాంకు స్టాఫ్ కాలేజీ లో రెండు సార్లు ఫాకల్టీ గా కూడా చేసాడు. ఆ సమయంలో ఎంతో మంది ట్రైనింగ్ కి వచ్చే వాళ్ళు. అలా ఎంతో మంది పరిచయం తనకి.

ఫేస్ బుక్ లో కూడా బాగా యాక్టీవ్ గా ఉంటాడు కృష్ణకుమార్. చాలా వరకు పబ్లిక్ రిలేషన్స్ మెయింటేస్ చేస్తాడు. అది తనకి ఎంతో ఇష్టం కూడా.

కృష్ణకుమార్ భార్య గృహిణి. తను కూడా బాగా చదువుకుంది. తెలుగు సాహిత్యం లో అందెవేసిన చెయ్యి. ఆమె చక్కటి నవలలు, కధలు రాస్తూ ఉంటుంది. ఆమె నవలలు కొన్ని సినిమాలు గా కూడా తీశారు.

ఇక కృష్ణకుమార్ కి ఒక్కడే మగ సంతానం. అబ్బాయి పేరు మోహిత్. మోహిత్ శ్రీనిధి కాలేజీలో బి టెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు.

మొదటి రోజు బిజీ గా గడవడంతో బాగా లేట్ అయ్యింది. ఇంటికెళ్ళేసరికి తొమ్మిది గంటలు. భోజనం చేసి టి వి చూస్తూ కూర్చున్నాడు.

సతీమణి రేణుక తాను రాస్తున్న లేటెస్ట్ నవల ఆఖరి భాగం లాప్టాప్ లో తీసుకొచ్చి చూపించింది. కృష్ణకుమార్ కి కూడా తెలుగు సాహిత్యం అంటే విపరీతమైన ఇష్టం. కవితలు, చిన్న కధలు రాస్తుంటాడు తమ బ్యాంకు మ్యాగజిన్ లో. బ్యాంకు లో చేరినప్పటినుండి ఎదో ఒకటి రాసి పంపిస్తుంటాడు. అవి అందరి ఆదరణ చూరగొన్నాయి.

రేణుక రాసిన 'ఇంటింటి రామాయణం' చివరి భాగం చదివి కొన్ని సలహాలు ఇచ్చాడు. రేణుక తన అభిప్రాయాలు కూడా చెప్పింది. చివరకు కథను కొంత మార్చి కధ సుఖాంతం చేసింది. అమ్మయ్య అనుకున్నాడు.

మోహిత్ రాత్రి ఎక్కువసేపు చదివి పొద్దున్న లేట్ గా లేస్తాడు. వాడి అలవాటు అది.

అప్పటికే పన్నెండయ్యింది. సరే మోహిత్ కి గుడ్ నైట్ చెప్పి కృష్ణకుమార్, రేణుక పడుకునేందుకు ఉపక్రమించారు.

ఆమ్మో ! పొద్దున్నే యూనిట్ ఇన్స్పెక్షన్ కి వెళ్ళాలి. అందులో అది పెద్ద యూనిట్. నాలుగు గంటలు ఈజీ గా పడుతుంది వెరిఫికేషన్ కి. అది చూసుకుని మధ్యాన్నం బ్రాంచ్ కి వెళ్ళాలి అనుకుంటూ పడుకున్నాడు కృష్ణకుమార్.

***

వేకువ ఝామున ఐదు గంటలకే లేవడం అలవాటు కృష్ణకుమార్ కి. ఎంత లేట్ గా పడుకున్నా తెల్లవారి ఐదు గంటలకు లేవడం మానడు. అరగంట యోగ, ప్రాణాయామం, అరగంట ఓంకారం చేస్తాడు.

ఫిట్నెస్ అంటే ప్రాణం కృష్ణకుమార్ కి. బ్యాంకులో కూడా బ్రిస్క్ గా వర్క్ చెయ్యడం అలవాటు తనకి.

తమ బ్యాంకు లో ఎన్నో కొత్త పద్ధతులు కనిపెట్టిన అనుభవం, ఘనత అతనికి ఉంది. బ్యాంకు లోని అన్ని విభాగాల లోనూ పని చేసాడు. సాంకేతిక విభాగం లో ఎక్కువ కాలం పని చేసాడు. విజిలెన్సు విభాగం, క్రెడిట్ కార్డు, ఆడిట్ విభాగం, ఇన్స్పెక్షన్ విభాగం ఇలా అన్ని విభాగాల లోనూ అనుభవం సంపాదించాడు. అందుకే ప్రమోషన్స్ చక్కగా సమయానికి వచ్చాయి. మేనేజిమెంట్ ప్రశంసలు కూడా పొందాడు.

ఇన్ఫర్మేషన్ ఆడిట్ విభాగం లో ఉన్నప్పుడు ఒక కొత్త పద్ధతి అమలు చేసి రెవిన్యూ లీకేజీ కనిపెట్టే ప్రోగ్రాం చేసాడు. దానివలన సంవత్సరానికి కొన్ని కోట్లు రెవిన్యూ లీకేజీ ఎక్కడ ఉందో తెలిసి యాజమాన్యం సరిదిద్దే వాళ్ళు. ఇలా ఎన్నో నూతన ప్రయోగాలు చెయ్యడం, అవి విజయవంతం కావడం, యాజమాన్యం ప్రశంసలు పొందడం జరిగాయి.

ప్రొద్దున ఏడుగంటలయ్యింది. రేణుక ఇచ్చిన కాఫీ తాగుతూ పేపర్ చూస్తున్నాడు కృష్ణకుమార్.

తమ బ్యాంకు విజయవాడ జోనల్ మేనేజర్ ఇంట్లో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ తనిఖీలు అన్న వార్త పెద్దదిగా కనిపించింది పేపర్ లో. ఆ జోనల్ మేనేజర్ బాగా లంచగొండి, స్త్రీలోలుడు అని పేరు. డబ్బులు లంచంగా తీసుకుని కోట్లు కోట్లు లోన్లు ఇస్తాడు. అతని బలహీనతను ఆసరాగా చేసుకుని పెద్ద కస్టమర్లు అతనికి అన్ని ఏర్పాట్లు చేస్తుంటారు. ఏదో ఒకరోజు అతను పట్టుబడతాడని బ్యాంకు లో అందరకి తెలుసు. ఆ రోజు ఇప్పుడు వచ్చింది. అతని వల్ల తమ బ్యాంకు కు చాలా నష్టం వచ్చింది. అతని సొంత ప్రయోజనాలకోసం బ్యాంకు ను పణంగా పెట్టాడు చాలా విషయాల్లో. మూడు వందల కోట్ల లోన్ దర్యాప్తు లో భాగంగా

అతని ఇంట్లో తనిఖీలు చేశారు. అతని బెడ్ రూమ్ సీక్రెట్ లాకర్ లో రెండు కోట్ల కరెన్సీ, కోటి రూపాయల విలువగల జూవెలరీ, ఇంకా ఇల్లు, ప్లాటులకు సంబంధించిన కోట్ల విలువైన డాకుమెంట్లు దొరికాయి. అతనిమీద కేసు బుక్ చేసి రిమాండ్ కు తరలించారు. అయ్యో ఇలాంటి వాళ్ళ వల్ల తమ బ్యాంకు కు ఎంత చెడ్డపేరు అనుకున్నాడు కృష్ణకుమార్. బ్యాంకు ఇచ్చే జీతం చాలక ఇలాంటివాళ్ళు రుణాలు మంజూరు చెయ్యడంలో విపరీతమైన లంచాలు తీసుకుంటున్నారు. ఇంట్లో పెళ్ళాం సరిపోదన్నట్లు బ్యాంకు లో లేడీ స్టాఫ్ ని ఏడిపించడం, వాళ్ళని సెక్సువల్ హెరాస్ చెయ్యడం వంటి చేస్తున్నారు. ఎంత అప్రదిష్ట తన బ్యాంకు కి అని బాధపడ్డాడు.

ఇంతలో సబ్ మేనేజర్ శాంతారాం దగ్గర నుంచి ఫోన్.

చెప్పండి శాంతారాం గారు అన్నాడు.

సర్ మీరు ఎన్ని గంటలకు ఇన్స్పెక్షన్ కు బయలుదేరుతారు అని అడిగాడు .

కొత్త కారు అలాట్ చేసినట్లు నిన్న రాత్రి సర్వీసెస్ డిపార్ట్మెంట్ ఏ జి ఎం చెప్పారు. అది హెడ్ ఆఫీస్ లో ఉందట. డ్రైవర్ దాన్ని తీసుకుని తొమ్మిదింటికి వస్తానన్నాడు. రాగానే బయలు దేరుతాను అని చెప్పాడు కృష్ణకుమార్.

సర్ ఆ యూనిట్ చాలా పెద్ద యూనిట్. అది ఎక్స్‌క్లూసివ్ గా విద్యావతి మేడం మానిటర్ చేస్తోంది. ఆ యూనిట్ ఇన్స్పెక్షన్ కు ఇంతకు ముందు ఏ జి ఎం గారితో పాటు మేడం కూడా వెళ్ళేది ఇన్స్పెక్షన్ కి. ఇప్పుడే మేడం కి ఫోన్ చేసాను. తను కూడా మీతో వస్తానంది. కారు డ్రైవర్ కి తన హౌస్ తెలుసు. మీరు ఆవిడని పిక్ అప్ చేసుకుని వెళ్ళొచ్చు. మీకు ఇన్స్పెక్షన్ ఈజీ అవుతుంది. తన దగ్గర ఆ యూనిట్ తాలూకు వివరాలన్నీ సాఫ్ట్ కాపీ ఉన్నాయి అని వివరించాడు శాంతారాం.

ఓ ! గుడ్ శాంతారాం గారు. మేడం ని పిక్ అప్ చేసుకుని వెళతాను. నాకు చాలా సహాయంగా ఉంటారు ఆవిడ. మీరు మేడం కి చెప్పండి వస్తున్నట్లు అని చెప్పాడు.

ఓకే సర్. ఉంటాను అని ఫోన్ పెట్టేసాడు శాంతారాం.

డాడ్ అంటూ మోహిత్ వచ్చాడు. వాడు ఎక్కువ మాట్లాడడు. పుస్తక పురుగు. ఎప్పుడో సబ్జెక్టు బుక్స్ ఏదో ఒకటి చదువుతూ ఉంటాడు. ఎవరూ చెప్పే పనిలేదు. తన లక్ష్యం తనకు తెలుసు.

చెప్పు మోహిత్ ఏంటి విశేషాలు. ఎలా ఉంది నీ స్టడీస్ ? ఫైనల్ సెమిస్టర్ కదా ఇప్పుడు అన్నాడు.

యస్ డాడ్. ఆన్లైన్ లో జి ఆర్ ఈ, టోఫెల్ మార్క్స్వచ్చాయి అంటూ వివరించి చెప్పాడు.

ఓహ్ చాలా గ్రేట్ రా. చాలా మంచి మార్క్స్. నీ అకడమిక్ రికార్డు తో పాటు ఇవి కూడా బాగా హెల్ప్ చేస్తాయి. మంచి యూనివర్సిటీ లో ఎం ఎస్ సీట్ వస్తుంది. పొద్దున్నే చాలా మంచి న్యూస్ చెప్పావు. హార్టీ కంగ్రాట్స్ రా. కీప్ ఇట్ అప్ అన్నాడు.

థాంక్యూ డాడ్ అని తండ్రి పాదాలకు నమస్కారం చేసాడు.

బ్లెస్స్ యు రా. సో, త్వరలోనే అమెరికా వెళుతున్నావు. గుడ్. నీ ఆశయాలు నెరవేర్చుకో చక్కగా అని భుజం తట్టాడు.

స్నానానికి లేవండి అంటూ వచ్చింది రేణుక మరో కప్పు కాఫీ తో.

విజయవాడ లో సొంత ఇల్లు ఉంది కృష్ణకుమార్ కి. విజయవాడ లో పని చేసేప్పుడు స్థలం కొని రెండు అంతస్తులు వేసాడు బాంకు లోన్ తో. ఇప్పుడు అందులో తన తమ్ముడు, వాడి ఫామిలీ, తల్లితండ్రులు కూడా వాడితోనే

ఉన్నారు. తమ్ముడు విజయవాడలో ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ లో వర్క్ చేస్తున్నాడు. బాంక్ వాళ్ళ రెండో హోసింగ్ లోన్ స్కీం లో హైదరాబాద్ లో ఒక త్రీ బెడ్రూమ్ అపార్ట్మెంట్ కొన్నాడు కృష్ణ కుమార్ . తను ముంబై లో ఉన్నా రేణుక, మోహిత్ అందులోనే ఉండేవాళ్ళు ఇబ్బంది లేకుండా.

కాఫీ తాగేసి స్నానికి లేచాడు.

స్నానం చేసి, ఓ అరగంట పూజ చేసి లేచాడు.

ఇంతలో డ్రైవర్ నుంచి ఫోన్. సర్ ! కారు తీసుకున్నాను. డిపార్ట్మెంట్ వాళ్ళు మీ అపార్ట్మెంట్ అడ్రస్ ఇచ్చారు. ఇంకో ఇరవై నిముషాలలో అక్కడుంటాను అన్నాడు.

సరే రమ్మన్నాడు కృష్ణకుమార్ తనకు రెడీ అయ్యేందుకు ఇంకో అరగంట టైం పడుతుంది.

ఇంతలో వేడి వేడి ఇడ్లీ టేబుల్ పై ప్లేట్ లో ఉంచింది రేణుక. పక్కనే పల్లీ చట్నీ గిన్నెలో ఉంచింది.

చక చక ఇడ్లీ తినేసి రెడీ అయ్యాడు. ఇడ్లీ తనకు ఇష్టమైన టిఫిన్.

ఏంటోయ్ కొత్త నవల మొదలెట్టావా అని అడిగాడు రేణుకని.

ఈ సారి వెరైటీ సబ్జెక్టు మీద రాస్తున్నానండి.  మీరు ఆదివారం తీరికగా ఉంటారు కాబట్టి ఆరోజు డిస్కస్ చేస్తాను అంది.

ఓహ్ నైస్ అన్నాడు.

రేణుక స్ఫురద్రూపి. అన్ని పనులు చక చక చేసుకుంటూ పోతుంది. కొద్ది రోజులు కాలేజీ లో లెక్చరర్ గా చేసి మానేసింది. ఎప్పుడూ ఖాళీగా ఉండదు. అందుకే తన మైండ్ ను ఇలా సాహిత్యం వైపు మళ్లించింది. అందులోనూ మంచి పేరు సంపాదించింది. ఇంట్లో కంప్యూటర్లో ఎప్పుడూ ఏదో ఒకటి చేసుకుంటూ ఉంటుంది. తాను ముంబై లో ఉన్నా ఒక్కతే ఇంటిని మేనేజ్ చేసింది. మోహిత్ చదువు పై తానే ఎక్కువ శ్రద్ధ చూపేది.

కృష్ణకుమార్ కి రేణుక అంటే ప్రాణం. అతనికి భార్య, కొడుకు ఇద్దరు రెండు కళ్ళు.

డ్రైవర్ నుంచి ఫోన్ వచ్చింది కింద వెయిట్ చేస్తున్నట్లు.

రేణుకకు చెప్పేసి లిఫ్ట్ లో కిందకు చేరుకున్నాడు.

డ్రైవర్ రాము ను పరిచయం చేసుకున్నాడు.  కొత్త కారు కదా దారిలో ఎక్కడైనా గుడి దగ్గర పూజ చేయించి తీసుకు వెళదాం అని చెప్పాడు.

సరే సర్ అన్నాడు రాము.

విద్యావతి మేడం ఇల్లు నీకు తెలుసు అని శాంతారాం చెప్పాడు . ముందు మేడం ఇంటికి వెళ్ళు . అక్కడ ఆమెని పిక్ అప్ చేసుకుని గుడి దగ్గర పూజ చేయించి అటునుంచి యూనిట్ ఇన్స్పెక్షన్ కు వెళదామని చెప్పాడు.

ఓకే సర్ అన్నాడు రాము.

దారిలో కృష్ణకుమార్ ని విద్యావతి గురించిన ఆలోచనలు వెంటాడాయి. కాకుంటే నిన్ననే డిసైడ్ అయ్యాడు. తను పరాయి స్త్రీ. ఆమె గురించి ఆలోచించడం అంత మంచిది కాదు అని. అందాన్ని ఆరాధించవచ్చే కానీ ఇంకెటువంటి ఆలోచన రాకుడదు మనసులో అని నిర్ణయించుకున్నాడు. అటువంటి ఆలోచనల వలన చెడుపే కానీ మంచిది కాదు. తను ఇప్పటివరకు స్వచ్ఛంగానే ఉన్నాడు. దేవుడు తనకు అందమైన, ఒద్దికైన చక్కని భార్యను ఇచ్చాడు రేణుక రూపంలో. తనకు ఇంకేం కావాలీ. తానూ, తన కుటుంబం, తమ సంతోష జీవితం, ఈ జన్మకు ఇది చాలు అని అనుకున్నాడు. తను ఇప్పుడు ఎంతో సంతోషంగా ఉన్నాడు. ఇటువంటి సమయంలో వేరే స్త్రీ గురించి ఈ లేనిపోని ఆలోచనలు ఎందుకు తనకు అనుకున్నాడు. తనతో పాటు తెచ్చుకున్న న్యూస్పేపర్స్ చదువుకుంటున్నాడు సీరియస్ గా మనసును మళ్లించే ప్రయత్నంలో.

విద్యావతి ఇంటిముందు కారు ఆపాడు రాము.

కారు చప్పుడు విని విద్యావతి బయటికొచ్చింది. న్యూస్పేపర్ నుంచి తలతిప్పి చూసాడు.

గుండె మళ్ళీ లయ తప్పింది. అదే విద్యావతి. అదే నాజూకు. తనలో ఏమీ మార్పు లేదు.

కారు డోర్ తీసుకుని వెనుక సీట్లో తన పక్కనే కూర్చుని డోర్ వేసింది. అదే బాడీ స్ప్రే. ఓహ్ మళ్ళీ మనసు ఆమె చుట్టే తిరుగుతానంటోంది.

గుడ్ మార్నింగ్ సర్ అంది విద్యావతి.

గుడ్ మార్నింగ్ మేడం. హౌ ఆర్ యూ ? గుర్తు పట్టారా నన్ను. మీరు అశోక్ నగర్ బ్రాంచ్ లో ఉన్నప్పుడు పది రోజులు ఇన్స్పెక్షన్ కి వచ్చాను. మీరే హెల్ప్ చేశారు అప్పుడు అన్నాడు కృష్ణకుమార్.

ఎస్ సర్. తెలుసు. మీరు మా బ్రాంచ్ కి పోస్ట్ అవ్వగానే మీరే అనుకున్నాను. నేను మిమ్మల్ని మర్చిపోలేదు అంది నవ్వుతూ.

కృష్ణకుమార్ మాట్లాడుతూనే ఆమె జడ వైపు చూసాడు. అవును మళ్ళీ అదే స్మాల్ టెయిల్. పెద్ద జడలో చక్కగా పొందికగా ఉంది. అదే తనని ఇంత

పరవశానికి గురి చేస్తోంది. లేకుంటే ఇంత వివశుడయ్యేవాడు కాదు. నల్లని వాలు జడలో తురిమిన మల్లెపూలు మత్తు గా కవ్విస్తున్నాయి. కారు లోపల మల్లెపూల గుబాళింపుతో నిండిపోయింది.

కృష్ణకుమార్ ఆలోచనలు అదుపు తప్పుతున్నాయి. ఏంటి ఈ పరీక్ష నాకు అని మనసులో వాపోతున్నాడు.

అబ్బా ఏంటి ఈమె ఆకర్షణ. ఎందుకు నన్ను ఇలా ఇబ్బంది పెడుతోంది అనుకున్నాడు. మనసు వశం తప్పుతోంది తెలీకుండానే.

నిన్న జాయిన్ అయ్యారు కదా సర్. నిన్న ఇంట్లో పని ఉంటె నేను లీవ్ పెట్టాను అని చెప్తోంది విద్యావతి.

అదే మాట తీరు, అదే ఆకట్టుకునే ఆ గులాబీ రంగు పలుచని పెదాలు. ఏ లిప్స్టిక్ లేకుండా సహజ రంగులో మెరుస్తుంటాయి అవి. అబ్బా కృష్ణ కుమార్ వల్ల కావడం లేదు. ఇక ఈ ఆలోచనలకి ఫుల్ స్టాప్ పెట్టాలి అని నిర్ణయించుకుని మేడం మనం వెళ్లే యూనిట్ గురించి చెప్తారా అన్నాడు. కొంత ఆలోచనలు అటువైపు మళ్లిద్దామని.

విద్యావతి చక చక చెప్తోంది ఆ యూనిట్ గురించి. అన్ని వివరంగా చెప్తుంటే మైండ్ లో వివరాలన్నీ నోట్ చేసుకుంటున్నాడు.

మన బ్రాంచ్ లో ఇదే పెద్ద యూనిట్ సర్. మన లోన్స్ లో అరవై శాతం ఈ యూనిట్ కె ఇచ్చాము. అందుకే దీనిపై ఎక్కువ ఏకాగ్రత చూపించాలి. కస్టమర్స్ మంచి వాళ్ళే. మనం ఇచ్చిన లోన్ అమౌంట్ అంతా యూనిట్ ప్రొడక్షన్ లోనే పెట్టారు. లాభాలు కూడా బాగానే వస్తున్నాయి. లోన్ కి తగ్గ సెక్యూరిటీ ఇచ్చారు. వాయిదాలు తప్పకుండా టైం కు కడతారు. బాగా నమ్మదగిన పార్టీ అని చక్కగా అన్నీ వివరించి చెప్తోంది. విద్యావతి ప్రత్యేకత అదే. తాను చేసే పని మీద టోటల్ కమాండ్ తెచ్చుకుంటుంది. ఇన్స్పెక్షన్ చేసేప్పుడు కూడా అన్నీ సమయానికి అందించినట్లు రికార్డ్స్ ఇచ్చేది. పనిలో ఆవిడ కున్న డెడికేషన్ చాలా ప్రశంసించతగ్గది. బహుశా అదికూడా ఆమె వైపు అట్ట్రాక్ట్ అవడానికి ఒక కారణమేమో.

సర్ . ఆంజనేయస్వామి గుడి దగ్గరకొచ్చాము. కొత్త వాహనాలన్నీ ఇక్కడే పూజ చేయిస్తారు అని చెప్పాడు రాము.

మేడం ! బాంకు వాళ్ళు కొత్త కారు ఇచ్చారు ఇవాళనే. దారిలో గుడి దగ్గర పూజ చేయిద్దామని అంటూ చెప్పాడు కృష్ణకుమార్ విద్యావతి కి.

ఓహ్ ! గుడ్ సర్. నేనూ వస్తాను అంటూ కారు డోర్ తీసుకుని కిందకు దిగింది విద్యావతి.

షూస్, సాక్స్ కారులోనే విప్పి కారులోనుంచి దిగాడు కృష్ణ కుమార్.

గుడి బయట ఉన్న మంచి నీళ్ల టాప్ దగ్గర కాళ్ళు చేతులు కడుక్కుని గుడిలోకెళ్ళారు కృష్ణకుమార్, విద్యావతి.

అప్పటికే పది కావడంతో భక్తులు లేక పల్చగానే ఉంది ఆలయం. పేరుకు ఆంజనేయస్వామి గుడి అయినా, మహాగణపతి, ఒక వైపు పంచ ముఖ గాయత్రి, మరొక వైపు వెంకటేశ్వర స్వామి, అమ్మవార్లు, నవగ్రహాలు కొలువై ఉన్నారు. గుడి పెద్దదిగానే ఉంది. వాహన పూజ కు ఈ గుడి ప్రసిద్ధమని డ్రైవర్ రాము చెప్పాడు.

పూజారి దగ్గరకెళ్ళి నమస్కరించారు ఇద్దరూ.

మామూలు పూజేమో అనుకుని గోత్ర నామాలు అడిగారు పూజారి గారు తన చేతిలో ఉన్న పూల పళ్లెం తాకమంటూ.

రెండు చేతులతో ఆ పళ్లెం తాకుతూ చెప్పాడు కృష్ణకుమార్.

పూజారి భార్యా భర్తలనుకుని ప్రవర పాడడం మొదలు పెట్టాడు.

అయ్యో పూజారి గారు. కొంచెం ఆగండి. మేమిద్దరం బాంకు లో పనిచేస్తున్న సహోద్యోగులం కంగారు పడుతూ చెప్పాడు కృష్ణకుమార్.

పూజారి గారు అపచారం అపచారం అంటూ సరిదిద్దుకుని విద్యావతి పేరు గోత్రం అడిగి పూజ మొదలు పెట్టాడు.

కృష్ణకుమార్ మాటల కంగారు చూసి విద్యావతి నవ్వుకుంది భలేవారే మేనేజర్ గారు అనుకుంటూ.

తీర్థ ప్రసాదాలు తీసుకుని కళ్ళకద్దుకుంటూ పూజారి కి చెప్పాడు కృష్ణకుమార్. కొత్త కారు బాంకు వారు ఇచ్చింది బయట ఉంది. మీరు వాహన పూజ చెయ్యాలి అన్నాడు.

తప్పకుండా అంటూ పూజారి వస్తువులు తీసుకుని బయటకు వచ్చాడు.

చక్కగా పూజ చేసి కారుకు పూల మాల వెయ్యమన్నాడు కృష్ణకుమార్ ని.

దానితో కొత్త అందమొచ్చింది కారుకి. టైర్ల క్రింద నిమ్మకాయలుంచాడు రాము.

పూజారి ఇచ్చిన పూలను జడలో తురిమింది విద్యావతి. అసలే మల్లెపూలు పెట్టుకుంది. దానిపై మరలా చేమంతులు, గులాబీలు తురిమింది.

కృష్ణకుమార్ చూడొద్దనుకుంటూనే చూస్తున్నాడు ఆమె వైపు.

సర్ వెల్దామా అన్నాడు రాము.

పద రాము. ఇక్కడనుంచి ఎంత టైం పడుతుంది అని అడిగాడు.

ఒక గంట పడుతుంది సర్.

అక్కడ కూడా ఎక్కువ టైం పడుతుంది సర్. పెద్ద యూనిట్ కదా. వారితో మాట్లాడి అన్ని చూడాలంటే సాయంత్రం వరకు అవుతుంది అంది విద్యావతి.

ఓహ్ ఒకే. ఫస్ట్ టైం కదా ఇవాళ ఎక్కువ టైం ఈ యూనిట్ మీద స్పెండ్ చేద్దాం అన్నాడు కృష్ణకుమార్.

ముగ్గురు కారులో ఎక్కారు. కారు బయలుదేరింది.

అయ్యో కుంకుమ పెట్టుకోవడం మర్చిపోయాను అంది విద్యావతి.

ఇదిగోండి అంటూ పూజారి గారు ఇచ్చిన కుంకుమ ప్యాకెట్ తీసి ఇచ్చాడు కృష్ణ కుమార్.

ఓహ్ థాంక్యూ సర్ మెచ్చుకోలుగా అంది.

ఓకే అంటూ మళ్ళీ ఆ కుంకుమ ప్యాకెట్ జేబులో పెట్టుకున్నాడు. అబ్బా ఒక గంట కాలక్షేపం చెయ్యాలి అనుకున్నాడు కృష్ణకుమార్. అప్పటికే తనతో తెచ్చుకున్న న్యూస్పేపర్స్ చదవడం పూర్తయ్యింది.

ఎక్కడ సర్ మీరు ఉండేది అడిగింది విద్యావతి.

హిమాయత్  నగర్ మేడం.

ఓహ్ మా అశోక్ నగర్  కు దగ్గరే. బాగా బిజీ ఏరియా కదా మీది.

మా ఏరియా అంత బిజీ గా ఉండదు. మా ఫ్లాట్ కొంచెం లోపలికి ఉంటుంది. ఐదేళ్ల క్రితం కొన్నాను. కంఫర్ట్ గానే ఉంటుంది. మీది ఇండిపెండెంట్ హౌస్ లా ఉంది.

అవును సర్. మేము ముగ్గురు సిస్టర్స్. మా పేరెంట్స్ ప్రాపర్టీ. క్రింద నేనుంటాను. పైన రెండు పోర్షన్స్ లో మా సిస్టర్స్ ఇద్దరూ ఉంటారు.

ఓహ్ చాలా ప్రైమ్ ప్రాపర్టీ. రోడ్ మీదే ఉంది మీ ఇల్లు. గుడ్ అన్నాడు. మీ వారికి ప్రమోషన్ మీద వరంగల్ వెళ్లారని చెప్పారు శాంతారాం.

అవును సర్. చీఫ్ మేనేజర్ ప్రమోషన్ వచ్చింది. లాస్ట్ మంత్ వెళ్లారు. వీక్ ఎండ్స్ వస్తుంటారు తను.

సో, మీరు ట్రాన్స్ఫర్ మీద అక్కడికి వెళ్తారేమో త్వరలో.

నో సర్. నాకు ఇంటరెస్ట్ లేదు. మా పెద్ద సిస్టర్ విడో. ఒక్కతే ఉంటుంది. ఆమెకు హెల్ప్ గా ఉండాలి నేను. ఇంకొక సిస్టర్ కి ట్రాన్స్ఫర్ డ్యూ వుంది హైదరాబాద్ నుంచి. అందుకే నేను వరంగల్ వెళ్లే ప్లాన్ లేదు.

మీ పిల్లలు ఏం చేస్తుంటారు అని అడిగాడు.

పెద్దబ్బాయి శ్రీకాంత్ ఇంజనీరింగ్ పాసై ముంబై లో వర్క్ చేస్తున్నాడు. పాప శ్రీష ఎం ఎస్ చదివేందుకు వెళ్ళింది. తను రెండు నెలల క్రితమే వెళ్ళింది.

ఓహ్ నైస్. మా వాడు కూడా ఎం ఎస్ చదివే ప్లాన్ లో ఉన్నాడు. నిన్ననే జి ఆర్ ఈ, టోఫెల్ మార్క్స్ వచ్చాయి. శ్రీనిధి కాలేజీలో కంప్యూటర్స్ చదువుతున్నాడు. ఇప్పుడు లాస్ట్ సెమిస్టర్ లో ఉన్నాడు.

మా పాప కూడా కంప్యూటర్స్ లో బి టెక్ పూర్తి చేసింది సర్, సి బి ఐ టి లో. తనకి మంచి స్కోర్స్ వచ్చాయి జి ఆర్ ఈ, టోఫెల్ లో. అందుకే మంచి యూనివర్సిటీ లో ఎం ఎస్ సీట్ వచ్చింది.

విద్యావతి మాటలేమోగాని ఆ పూల పరిమళం మాత్రం కృష్ణకుమార్ ని తెగ చుట్టేస్తోంది.

మీ కథలు, కవితలు మన బ్యాంకు హౌస్ మేగజీన్ లో చదువుతుంటాను సర్. చాలా బాగుంటాయి. కంప్లిమెంట్ చేసింది.

థాంక్యూ మేడం.

మీరు మాటి మాటికీ మేడం అనక్కర్లేదు. విద్య అంటే చాలు నొచ్చుకుంటూ అంది విద్యావతి.

నాకు అలా అలవాటు లేదు. న్యూ రిక్రూట్మెంట్ అయిన ఆడపిల్లల్ని కూడా మేడం అనే అంటాను.

సరే మీ ఇష్టం. నేను చెప్పేది చెప్పాను అంది.

సరేనండి. అందరి ముందు మేడం అంటాను. ఎవ్వరూ లేకుంటే విద్య అంటాను. ఓకే నా నవ్వుతూ అన్నాడు కృష్ణకుమార్.

థాంక్యూ అంది నవ్వుతూ విద్యావతి.

ఆ నవ్వేంటిరా బాబు అలా కవ్విస్తోంది. అమ్మ బాబోయ్ అస్సలు టెంప్ట్ కాకూడదు. ఇవి ఎప్పుడూ ఇలానే ఉంటాయి తమాషాగా. ఏ మాత్రం మనసు తూలినా ఎన్నో ఇబ్బందులు తప్పవు, అస్సలు తూలకూడదు, మనసులో గట్టిగా అనుకున్నాడు కృష్ణ కుమార్.

డ్రైవర్ రాము  ఒక చెవిలో ఇయర్ ఫోన్స్ పెట్టి పాటలు వింటున్నాడు ఏకాగ్రతతో రోడ్ ని చూస్తూ.

ఇంకా అరగంట ప్రయాణం ఉంది. కాసేపు ఇద్దరూ మౌనంగా ఉన్నారు.

ఆ మౌనాన్ని చీలుస్తూ ఎలా ఉంది సర్ మీ ముంబై అసైన్మెంట్ అని అడిగింది విద్యావతి.

చాలా బాగుంది. ట్రెజరీ డిపార్ట్మెంట్ కదా. చాలా కొత్త విషయాలు నేర్చుకున్నాను. షేర్స్ , సెక్యూరిటీస్ తో ఎలా డీల్ చెయ్యాలి, బ్యాంకు కు ఎలా లాభాలు తేవాలి ఇలా ఎన్నో తెలీని కొత్త కొత్త విషయాలు చాలా ఆసక్తికరంగా ఉండేది. ప్రమోషన్ మీద ఇక్కడకు వచ్చాను కానీ వర్క్ విషయంలో అక్కడే బాగుంది మేడం అనబోయి విద్యా అన్నాడు రియాక్షన్ చూద్దామని.

విద్యా అన్న పిలుపుకి చాలా హ్యాపీగా నావైపు చూసింది విద్యావతి. ఇలా వన్ టు వన్ ఉన్నపుడు అలానే పిలవండి. ఐ ఫీల్ హ్యాపీ అంది.

ఓకే అన్నాడు కృష్ణకుమార్. అసలే తను ఓల్డ్ ఫ్యాషన్డ్. మధ్యలో ఈ పేరు పెట్టి పిలవడం ఏంటో అతనికి అర్ధం కాలేదు. అదీ పరాయివాళ్ళని అలా పేరుతో పిలవడం అతని సిద్ధాంతాలకు విరుద్ధం.

తన హ్యాండ్ బాగ్ ఓపెన్ చేసి ఫైవ్ స్టార్ చాక్లెట్ ఇచ్చింది. తీసుకోండి ఇంకా అరగంట ప్రయాణం ఉంది.

తీసుకున్నాడు నవ్వుతూ.

పాటలు వింటారా అంటూ తన మొబైల్ కి ఇయర్ ఫోన్స్ తగిలించి ఒకటి తన చెవిలో పెట్టుకుని రెండోది కృష్ణకుమార్ కి ఇచ్చింది చెవిలో పెట్టుకోమని. వైర్ దూరం సరిపోకుంటే విద్యావతి అతనికి దగ్గరగా జరిగింది. అలా జరగడంలో కారు కుదుపుకు ఆమె ముందుకు పడబోతే ఆమె చేతిని కృష్ణ కుమార్ పట్టుకున్నాడు .

థాంక్యూ అంది నవ్వుతూ.

జాగ్రత్త అన్నాడు తానూ నవ్వుతూ.

పాట సెలెక్ట్ చేసి ఆన్ చేసింది.

మధురాపురి సదన, మృదువదన మధుసూదన...

ఇహ స్వాగతం కృష్ణా... శరణాగతం కృష్ణా

అంటూ హృద్యంగా వస్తోంది పాట

ఈ పాటంటే నాకు చాలా ఇష్టం అన్నాడు కృష్ణకుమార్.

ఓహ్ నాకు చాలా చాలా ఇష్టం. రోజుకు ఒక్కసారైనా ఈ పాట వింటాను. పడుకునేప్పుడు కంపల్సరీ గా విని పడుకుంటాను అంది విద్యావతి తానూ హమ్ చేస్తూ.

మీ వాయిస్ చక్కగా ఉంది. మీరు పాడుతారా అన్నాడు.

జస్ట్ ఇంట్లోనే. నాకు నచ్చిన పాటలు పాడుకుంటుంటాను.

ఓహ్ అయితే మీ పాటలు వినాల్సిందే అన్నాడు.

అయితే సాయంత్రం నన్ను డ్రాప్ చేసినప్పుడు మా ఇంటికి రండి. కాఫీ ఇచ్చి ఒక పాట పాడి వినిపిస్తాను కొంటెగా అంది.

ఓహ్ సరే అన్నాడు అప్రయత్నంగా.

థాంక్స్ అంది.

హడావిడిలో వాటర్ బాటిల్ తీసుకోవడం మర్చిపోయాను. గుడి దగ్గర తీసుకోనుండాల్సింది అంటూ రాముకి చెప్పి కారు ఆపే ప్రయత్నం చేయబోయాడు కృష్ణకుమార్.

ఎందుకు. నా దగ్గర బాటిల్ ఉంది. తీసుకోండి అంటూ ఇచ్చింది.

మీ హ్యాండ్ బాగ్ అక్షయ పాత్ర లా ఉంది. అన్నీ ఉన్నాయి అందులో అన్నాడు వాటర్ బాటిల్ తీసుకుంటూ.

మరి అవసరం కొద్దీ అన్నీ పెట్టుకోవాలిగా. మీ మగవాళ్ల లా చేతులూపుకుంటూ రాలేము గా మా ఆడవాళ్ళం బయటికొచ్చేప్పుడు అంటూ నవ్వింది.

బాగా దాహంగా ఉంది. మెనీ మెనీ థాంక్స్ అన్నాడు నిజాయితీగా.

ఆ దూరంగా కనిపించేదే 'విరాజ్ స్పిన్ టెక్స్' అని చూపించింది విద్యావతి.

ఓహ్ చాలా పెద్ద యూనిట్. అన్ని ఆక్టివిటీస్ ఇక్కడే జరుగుతాయన్నమాట అన్నాడు.

ఎస్ సర్. మనం లోన్ ఇచ్చింది ఆరు వందల కోట్లు. కన్సార్టియం అడ్వాన్స్ లో మిగతా బ్యాంక్స్ ఇంకో నాలుగు వందల కోట్లు ఇచ్చాయి. మనం ఎక్కువ ఇచ్చాం కాబట్టి మనమే లీడ్ తీసుకుని మానిటర్ చేస్తున్నాము. రిపోర్ట్స్ మిగతా బ్యాంక్స్ కు పంపుతాము.

బట్ టెక్నికల్ ఆడిట్ కూడా చేయాలేమో.

అవును సర్. మూడు నెలలకొకసారి టెక్నికల్ ఆడిట్ చేయిస్తాము.

ఈ యూనిట్ పై మీ ఒపీనియన్ ఏంటి ?

బ్యాంకు వాయిదాలు కట్టడం, ప్రొడక్షన్, సేల్స్, ప్రాఫిట్ వరకు ఓకే సర్. హెల్త్ అఫ్ యూనిట్ కూడా బాగానే ఉంది. అంతవరకే నాకు తెలుసు అంది విద్యావతి.

ఓకే అన్నాడు.

కారు పోర్టికోలో ఆగగానే జనరల్ మేనేజర్ వచ్చి రిసీప్ చేసుకున్నాడు.

చైర్మన్ రూంకి వెళ్ళాము. ఆయన ఎదురు వచ్చి రిసీప్ చేసుకున్నారు. చాలా మర్యాదలు చేశారు.

కంపెనీ గురించి అంతా వివరించారు. అన్నీ విన్నాడు కృష్ణకుమార్. కొన్ని కీలక పాయింట్స్ అడిగి వివరాలు తెలుసుకున్నాడు. కంపెనీ ఎక్స్పర్ట్స్ కూడా ఆ ప్రశ్నలు ఊహించలేదు. విద్యావతి కి కూడా ఆశ్చర్యం కలిగింది. చాలా డీప్ గా పరిశీలిస్తున్నారు అనుకుంది. తెలివిగల్లవాడే అని మనసులో మెచ్చుకుంది కూడా.

అంత పెద్ద లోన్ కాబట్టి బ్యాంకు మేనేజర్ కి చాలా భాద్యత ఉంటుంది. ఏమాత్రం తేడా లొచ్చినా కృష్ణకుమార్ కు చాలా ఇబ్బందులొస్తాయి. అందుకే అన్ని అకౌంట్స్ నిశితంగా పరిశీలించాడు. కొన్ని అడిషనల్ రిపోర్ట్స్ అడిగాడు. వాళ్ళు మెయిల్ చేస్తామన్నారు. చాలా పెద్ద ఫ్యాక్టరీ. అందులోనే అన్నీ ప్రాసెస్ లు

జరుగుతాయి. బాటరీ కార్లో తీసుకెళ్లి అన్నీ చూపించి వివరించారు. తను తెచ్చుకున్న స్పైరల్ బుక్ లో అన్నీ నోట్ చేసుకున్నాడు కృష్ణకుమార్. ఇంకొన్ని చూడాల్సినవి మిగిలాయి.

ఇంతలో లంచ్ టైం అయ్యింది. సెపరేట్ రూమ్ లో లంచ్ ఏర్పాటు చేశారు.

విద్యావతి లంచ్ బాక్స్ తీసింది తన బాగ్ లోనుంచి.

అదేంటి అన్నట్లు చూసాడు కృష్ణకుమార్.

మేడం ఇక్కడ తినరు సర్. ఇప్పటికి చాలా సార్లు వచ్చారు కానీ లంచ్ మాత్రం తీసుకోలేదు. కేవలం కాఫీ, టీ మాత్రమే తీసుకుంటారు అన్నాడు ఫ్లోర్ మేనేజర్.

ఓహ్ గుడ్ నాకు తెలీదు లేకుంటే నేనూ తెచ్చుకునేవాడిని అన్నాడు.

మీరు తీసుకోండి. ఎవ్వరూ తీసుకోకుంటే బాగోదు అంది.

సర్ నాన్ వెజ్ తెమ్మంటారా అని అడిగాడు చెఫ్. ఇవాళ స్పెషల్ ఐటమ్స్ చేసాం అన్నాడు.

నో నో . వెజ్ మాత్రమే అన్నాడు కృష్ణకుమార్.

హాట్ డ్రింక్స్ కూడా ఉన్నాయి మీకు అభ్యంతరంలేకపోతే అన్నాడు ఫ్లోర్ మేనేజర్.

నేను అస్సలు ముట్టుకోను. సారీ అన్నాడు కృష్ణకుమార్.

మంచి వెజ్ లంచ్ సర్వ్ చేశారు.

విద్యావతి తన బాక్స్ లోనుంచి ఉప్మా కొంచెం పెట్టింది రుచి చూడండని.

నోట్లో వేసుకుని ఓహ్ టేస్ట్ అదిరింది అన్నాడు.

అయితే మొత్తం తినండి అంటూ కృష్ణకుమార్ పళ్లెంలో బోర్లించింది.

ఏయ్ ఏంటి ఇది. మరి నీకు అన్నాడు.

ఫైవ్ స్టార్ చాక్లెట్ ఉందిగా అంది.

అదేం కుదరదు అని ఇంకో ప్లేట్ తెప్పించి చపాతీ, కూర తనే వడ్డించాడు. తినండి ప్లీజ్ అంటూ.

సరే అంటూ తీసుకుంది. మీరు అస్సలు డ్రింక్స్ తీసుకోరా అని ఆశ్చర్యంగా అడిగింది.

ఊహూ. అస్సలు తీసుకోను.

గ్రేట్ అంది మెచ్చుకోలుగా.

ఇంతలో రేణుక ఫోన్. ఏమండీ లంచ్ చేశారా అంటూ.

ఇప్పుడే తింటున్నానురా. చాలా బాగున్నాయి ఐటమ్స్. ఉప్మా తింటూ లొట్టలేస్తూ చెప్పాడు.

ఎవరు మీ అబ్బాయా అంది.

కాదు మై వైఫ్ అన్నాడు. మా అబ్బాయి మిత భాషి.

ఓ గుడ్. బాగా చదివేవాళ్ళు అలానే ఉంటారు అంది విద్యావతి తన చెవుల జూకాలు ఊపుతూ .

ఇద్దరూ లంచ్ ముగించుకుని చక చక మిగతా ప్రాసెస్ లు చూసారు.

అప్పటికే టైం ఐదు అయ్యింది.

చైర్మన్ గారికి బై చెప్పి కారులో బయలుదేరారు.

ఇప్పుడు బ్యాంకుకు వెళతారా అడిగింది విద్యావతి కృష్ణకుమార్ వైపు చూస్తూ.

ఊహూ ఇటునుంచి ఇంటికే వెళతాను మిమ్మల్ని దింపేసి. బాగా టైర్డ్ గా ఉంది అన్నాడు.

మా ఇంటికి వచ్చి వెళ్ళండి దారిలోనేగా అంది.

టైం చూసాడు ఐదున్నర. ఓకే అన్నాడు.

థాంక్యూ అంది

విద్యావతి ఇల్లు రాగానే రాముకి చెప్పాడు కారు పార్క్ చేసుకోమని. మేడం వాళ్ళింటికెళ్లి ఒక గంటలో వెళదాం అని. నువ్వు టిఫిన్, కాఫీ కావాలంటే తీసుకో అని డబ్బులిచ్చాడు.

వారిని ఇంటిదగ్గర దించేసి రాము వెళ్ళాడు.

రోడ్ మీదే ఉంది ఇల్లు. బస్సులు కూడా వెళుతున్నాయి ఈ రూట్లో అన్నాడు అటూ ఇటూ చూస్తూ.

అవును సర్. ఒక విధంగా బిజీ రోడ్ ఇది. మా ఫాదర్ వాళ్ళు కట్టినప్పుడు అసలు ఏమీ ఉండేది కాదంట ఇక్కడ. మేము ఈ ఇంట్లోనే పుట్టి పెరిగాము. మా చిన్నప్పుడు కూడా మామూలుగా ఉండేది. అంత బిజీ గా ఉండేది కాదు.

గేటు తీసి లోపలివెళ్లే ముందు కుడి పక్కకి చూస్తే పెద్ద మల్లె చెట్టు కనిపించింది. బాగా పొదలా పైకి అల్లుకుని ఉంది. మల్లెలు విరగబూసున్నాయి సువాసనలు వెదజల్లుతూ.

ఓహ్ ఇదన్నమాట మీ జడలో నిత్య పూల రహస్యం. మల్లెపూలు అదృష్టం చేసుకున్నాయి అన్నాడు.

ఎందుకో అంది తలుపు తాళం తీస్తూ వింతగా నవ్వుతూ.

రోజు ఆ నల్లని వాలుజడని అలంకరిస్తున్నాయిగా. అందుకు.

ఫరవాలేదు. మాటల్లో రచయిత గారి రొమాంటిక్ టింజ్ కూడా దాగుంది.

హాల్లో లైట్స్ వేసి లోపలికి రండి అంది.

షూస్ విప్పుతున్న కృష్ణకుమార్ ని వారించింది. ఫరవాలేదు రండి. మళ్ళీ అవన్నీ విప్పడం ఎందుకు అంది.

అప్పటికే షూస్ విప్పేసి లోపలికి వచ్చాడు ఓకే అనుకుంటూ.

ఏ సి వేసి అడిగింది. ఏంతీసుకుంటారు అని.

జస్ట్ కాఫీ చాలు అన్నాడు.

ఉప్మా వద్దా అంది కొంటెగా నవ్వుతూ.

ఉంటె టిఫిన్ బాక్స్ లో పెట్టి ఇవ్వండి . మా రేణు కి తీసుకెళతాను. తను కూడా టేస్ట్ చేస్తుంది మీ ఉప్మా ని అన్నాడు.

లేదు లెండి . అంతా తెచ్చాను వచ్చేప్పుడు . ఈ సారి మీకోసం స్పెషల్ గా చేసి ఇంటికి పంపిస్తాను. సరేనా అంది నొచ్చుకుంటూ.

ఆన్ చేసిన టి వి లోనుంచి భానుమతి గారి మధురమైన పాత పాట వస్తోంది 'నేనే రాధనోయి గోపాల, అందమైన ఈ బృందావనిలో' అని. లిరిక్స్ ఎంజాయ్ చేస్తున్నాడు కృష్ణకుమార్.

కాఫీ తెచ్చేలోపు ఈ ఆల్బమ్ చూడండి అని ఒక స్పైరల్ బుక్ అతని చేతికిచ్చింది.

ఓపెన్ చేసి చూసాడు. అన్నీ రేఖా చిత్రాలు. ఓహ్ గ్రేట్. మీరు వేసారా అన్నాడు ఆమె మొహంలోకి చూస్తూ

అవును అంది కొంచెం గర్వంగా ఇంకొంచెం హ్యాపీ గా మోహంలో రంగులు మారుతుంటే. అది నా హాబీ. చిన్నప్పటినుంచి నాకు  అలవాటు.

చూస్తూ ఉండండి కాఫీ తెస్తాను అని కిచెన్ లోకి వెళ్ళింది.

ఆ పొడవాటి జడ నడుము మీద అటూ ఇటూ ఊగుతుంటే చూడొద్దనుకుంటూనే చూసాడు.

మామూలు అందం కాదు ఈవిడది. ఎంత వద్దనుకున్నా చూడాలనిపిస్తుంది.

ఇదివరకెప్పుడు అదుపు తప్పని మనసు ఈమెను చూస్తే తన కంట్రోల్ లో ఉండటం లేదు. కొంచెం కష్టం మీద మళ్ళీ దాన్ని కంట్రోల్ కి తెచ్చుకుంటున్నాడు కృష్ణకుమార్.

ఒక్కొక్కటిగా రేఖాచిత్రాలు చూస్తూ ఒక షీట్ దగ్గర ఆగాడు. అందులో తన పోలికలు కనిపించాయి. ఎప్పటిది ఇది అని ఆలోచించాడు. పదేళ్ల క్రితం తను అశోక్ నగర్ బ్రాంచ్ ఇన్స్పెక్షన్ కి వచ్చినప్పుడు వేసినట్టుంది. పదేళ్ల క్రితం పోలికలు అందులో ప్రస్ఫుటమవుతున్నాయి. చాలా బాగా గీసి ఉంది. ఎవరైనా చూస్తే టక్కున నేనే అని చెప్పగలరు. అంత శ్రద్ధ తో గీసి ఉంది.

తీసుకోండి కాఫీ అని ట్రే లో ఉన్న కాఫీ అందించింది.

థాంక్యూ అన్నాడు.

తను కూడా కాఫీ కప్పుతో ఎదురుగా సోఫాలో కూర్చుంది వాలు జడ ముందుకు వేసుకుంటూ.

నా రేఖా చిత్రం కూడా చూసాను. చాలా బాగా వేశారు అన్నాడు మెచ్చుకోలుగా.

థాంక్యూ అని నునుసిగ్గుతో అంది. బుగ్గలు కొంచెం ఎరుపెక్కినట్లు కనిపించాయి కృష్ణకుమార్ కి.

అవును. అది మీదే. మీ ఇన్స్పెక్షన్ పదిరోజులూ కొంచెం కొంచెం వేస్తూ మీరు వెళ్లే లోపు పూర్తి చేసాను.

మరి నాకు అప్పుడే ఇవ్వొచ్చుగా అన్నాడు.

అది నాకోసం గీసుకున్నాను. మీకు వేరేది చక్కగా గీసి ఇస్తానులెండి మీరు బ్రాంచ్ నుంచి ట్రాన్స్ఫర్ అయ్యేలోపు అంది నవ్వుతూ.

అయితే రోజు నన్ను చూస్తూ గీస్తారన్నమాట ఇకనుంచి. జాగ్రత్తగా ఉండాలేమో నేను అన్నాడు.

అలా ఏమీ లేదు. ఒక ఫ్రేమ్ మైండ్ లోకి వస్తుంది. అది వేస్తూ ఎక్కడెక్కడ సరిదిద్దాలి అని చూస్తాను. పోలికలు కరెక్ట్ గా మైండ్ లోకి వస్తేనే చిత్రం చక్కగా గీయగలను అని వివరించింది.

ఒకే ఒకే. వెరీ గుడ్. మీ ఇంటికి రావడంవల్ల ఒక కొత్త విషయం మీ గురించి తెలిసింది.

మీరు వచ్చినందుకు నేనే మీకు థాంక్స్ చెప్పాలి. ఈ సారి మేడం, అబ్బాయి ని కూడా తీసుకు రండి. నా చేతి వంట మీ వాళ్లకి కూడా రుచి చూపిస్తాను.

తప్పకుండా. మీరు మీ శ్రీవారు కూడా మా ఇంటికి రండి. మా ఆతిధ్యం కూడా స్వీకరించవచ్చు. ఇంతకీ మీ వారి పేరు చెప్పలేదు.

ఆయన పేరు ఎస్ ఎల్ యెస్ శాస్త్రి. ఆయన అక్క కూడా మన బ్యాంకు లోనే స్టాఫ్ డిపార్ట్మెంట్ లో పనిచేసి రిటైర్ అయ్యారు.

ఓహ్ నైస్. మంచి మిత్రురాలు దొరికారు మీ రూపంలో అన్నాడు. మీ అక్కగారు పైనే ఉంటారన్నారు కదా !

అవును. రాత్రి ఇద్దరం కలిసి కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేస్తాము. తను కూడా కామర్స్ లెక్చరర్ గా చేసి హస్బెండ్ చనిపోయిన తరువాత వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుంది. పిల్లలు లేరు. తనని నేనే ఎంటర్టైన్ చెయ్యాలి. భోజనాల తరువాత కిందకి వచ్చి ఆయనతో , పిల్లలతో ఒకమారు మాట్లాడి, కాసేపు టి వి చూసి నిద్రకు ఉపక్రమించడం అంది.

ఓహ్ నైస్. బ్రిస్క్ రొటీన్  అన్నాడు మెచ్చుకోలుగా. కృష్ణకుమార్ తన కుటుంబం గురించి చెప్పాడు. భార్య రేణుక రచనల గురించి, అబ్బాయి చదువు గురించి మధ్య మధ్య లో జోక్స్ వేస్తూ నవ్విస్తూ చెప్పాడు.

అప్పటికే ఎనిమిదయ్యింది. ఆమ్మో గంట పైనే కూర్చున్నాను అంటూ లేచాడు.

ఎక్కువసేపు కూర్చుంటే ఛార్జ్ చెయ్యనులెండి అంది నవ్వుతూ విద్యావతి.

మీరు ఛార్జ్ చెయ్యరు. కానీ మీ సమ్మోహనం లాంటి నవ్వు, మాట్లాడేప్పుడు ఆ పెదాలు చేసే నాట్యం తీరు భరించే శక్తి నాకు లేదు అని మనసులో అనుకుంటూ ప్లీజ్ టేక్ కేర్, రేపు బ్రాంచ్ లో కలుద్దాం అంటూ బయటికొచ్చాడు.

రాముకి కాల్ చేస్తే కారు తెచ్చాడు వెంటనే.

మరోసారి ఆమెకు బై చెప్పి బయలుదేరాడు.

దారిలో పునశ్చరణం చేసుకుంటే తన చిత్రమే అందులో ఎందుకు ఉందో కృష్ణకుమార్ కి అర్థం కాలేదు. ఆమె గీసిన చిత్రాల్లో మిగతావన్నీ జనరల్ గా ఉన్నాయి. జాతీయ నాయకులు, దేవుడి చిత్రాలు, తన పిల్లల చిత్రాలు అలా ఉన్నాయి. ఓపికగా చాలానే గీసి ఉన్నాయి. అందులో తనదే ఆడ్ మాన్ అవుట్ గా ఉంది.

ఆలోచనలు అటువైపు వెళుతుంటే బలవంతంగా ఆపి మనసు బ్యాంకు వైపు మళ్ళించాడు రేపు టార్గెట్స్ ఏమిటా అనుకుంటూ.

***

ప్రక్క రోజు జోనల్ ఆఫీస్ కి వెళ్లి జోనల్ మేనేజర్ ని కలిసి బ్రాంచ్ గురించి అంతా వివరించాడు కృష్ణకుమార్.

జోనల్ మేనేజర్ స్పెసిఫిక్ గా నిన్న విసిట్ చేసిన విరాజ్ స్పిన్ టెక్స్ యూనిట్ గురించి అడిగాడు.

తనకున్న డౌట్స్ ఆయనకు చెప్పాడు.

యూ ఆర్ రైట్ కృష్ణ. నాకూ అదే అనుమానం. అందులో ఏదో జరుగుతోంది. వాళ్ళు ఇంకా వంద కోట్లు లోన్ కావాలని అడుగుతున్నారు. సరే నువ్వు వచ్చిన తరువాత నీ ఒపీనియన్ తీసుకుని డిసైడ్ చేద్దామని ఆగాను. కొద్దీ రోజులు గమనించు ఆ అకౌంట్ ని. ఏదన్నా ఉంటె నాకు ఇమ్మీడియేటగా రిపోర్ట్ చెయ్యి. చాలా జాగ్రత్త ఆ యూనిట్ తో. పెద్ద వాళ్ళ హస్తం ఉంది దాని వెనుక అని హెచ్చరించాడు ఆయన.

ఓకే సర్. మీ సపోర్ట్ ఉంటె చాలు. ఆ లోన్ గురించి మీకు రెగ్యులర్ గా ఫీడ్ బ్యాక్ ఇస్తాను అన్నాడు.

గుడ్, మిస్టర్ కృష్ణ. బై ది బై మీ బ్రాంచ్ లో ఆ అకౌంట్ ఎవరు మానిటర్ చేస్తున్నారు అని అడిగాడు.

విద్యావతి చూస్తున్నారు సర్. తనని అడిగాను. ఆవిడకి ఇస్ డెప్త్ తెలీదు. మానిటరింగ్ వరకు చూస్తుంది. వాయిదాలు సరిగా కట్టడం అలాంటివి ఓకే. హెల్త్ అఫ్ యూనిట్ కరెక్ట్ గా అస్సెస్స్ చెయ్యాలి అని నా ఐడియా.

కరెక్ట్. మీ ఐడియాస్ ఆవిడకి కూడా చెప్పండి. తను కూడా అదే డైరెక్షన్లో ఫాలో అవుతుంది. అప్పుడు మీకు ఈజీ అవుతుంది అన్నాడు.

ఎస్ సర్. కొంత రైట్ అప్ ప్రిపేర్ చేస్తున్నాను. అది ఒక కాపీ తనకి కూడా ఇస్తాను.

ఏదన్నా కాంఫిడెన్షియాలిటీ మైంటైన్ చెయ్యండి ఆ అకౌంట్ లో. ఎవ్వరికీ అనుమానం రాకూడదు అన్నాడు జోనల్ మేనేజర్.

ఓకే సర్. థాంక్యూ అని చెప్పి లేచాడు కృష్ణకుమార్.

ఎప్పుడు ఏ అవసరమున్నా నాకు చెప్పండి. డోంట్ హెసిటేట్ అన్నాడు.

గ్రేట్ సర్. నైస్ అఫ్ యు అని బయటికొచ్చాడు.

ఈ బ్యాంకింగ్ సెక్టార్ లో ఎప్పుడు ఏమి జరుగుతుందో ఎవరికీ తెలియదు.

పై లెవెల్ లో అన్ని రకాల ఇన్ఫ్లుయెన్స్ తో కోట్లు కోట్లు లోన్స్ ఇస్తారు. వాటి రికవర్ బ్రాంచ్ హెడ్స్ మీద పడుతుంది. వాటిలో ఏవి తేడా వచ్చినా బ్రాంచ్ హెడ్స్

మీద ఎంక్వయిరీ లు , సస్పెన్షన్ లు, డిస్మిస్ లు జరుగుతుంటాయి. ఆ అవమానాలు భరించలేక కొంత మంది సూసైడ్ కూడా చేసుకున్నారు.

కృష్ణకుమార్ ప్రిన్సిపల్ మొదటినుంచి ఒకటే. ముక్కుసూటిగా వెళ్లడం అలవాటు చేసుకున్నాడు. ప్రమోషన్స్ కోసం పెద్ద లోన్స్ ఇచ్చినవాళ్లు చాలా మంది ఇంటికి వెళ్లారు ఊస్టింగ్ తో. అందువల్ల ఆ జోలికి వెళ్ళడు. ప్రమోషన్ కంటే జీవితం ముఖ్యం అన్నది అతని సిద్ధాంతం. తమ బ్యాంకు లో కూడా నిప్పు అని టైటిల్ ఇచ్చారు తనకి. అయితే అన్నారు నాకేంటి అని కేర్ చెయ్యడు ఎవరిని. తన లైఫ్ తనకి హ్యాపీగా ఉంది. అడ్డదారులలో సంపాదించి, పై వాళ్ళ మెప్పు కోసం లేని పోనీ లోన్స్ ఇస్తే జీవితం ఉండదు. అటువంటి అవమానాలు తను ఎదుర్కోలేడు కూడా. ఇప్పుడు హాయి గానే ఉంది. ఇంకొన్నేళ్లు ఇలాగే జాగ్రత్తగా ఉంటె హ్యాపీ గా రిటైర్ అవొచ్చు అని అతని భావన.

బ్రాంచ్ కి వచ్చేప్పటికి లంచ్ టైం అయ్యింది. లంచ్ కాగానే బ్యాంకింగ్ అవర్స్ ఉంటాయి కాబట్టి కొంతమంది కస్టమర్స్ బయట వెయిట్ చేస్తున్నారు. తనని చూసి సెక్యూరిటీ గార్డ్ కొలాప్స్ గెట్ ఓపెన్ చేసాడు.

డ్రైవర్ కారేజ్ తెచ్చి కేబిన్ లో టేబుల్ పై పెట్టాడు.

సబ్ మేనేజర్ టిఫిన్ బాక్స్ ఓపెన్ చెయ్యబోతూ తనని చూసి కేబిన్ లోకి వచ్చాడు.

శాంతారాం గారు టిఫిన్ చేసి రండి అంటూ నొచ్చుకున్నాడు కృష్ణకుమార్.

ఫరవాలేదు సర్ అంటూ పొద్దున్న నుంచి జరిగినవి ఎక్స్ప్లయిన్ చేసాడు.

ఓకే థాంక్యూ అన్నాడు.

ఇవాళ మీరు కొత్తగా కనపడుతున్నారు అన్నాడు శాంతారాం వేసుకున్న కొత్త షర్ట్, ప్యాంటు చూసి.

ఇవాళ నా బర్త్ డే సర్ అన్నాడు. ఇది మా అమ్మాయి పంపింది. తాను అమెరికా లో ఉంటుంది. అమెజాన్ ద్వారా ఆర్డర్ చేసింది.

కృష్ణకుమార్ లేచి శాంతారాం చేయి పట్టుకుని హార్టీ కంగ్రాట్స్ అన్నాడు సంతోషం వెలిబుచ్చుతూ. నాకు ఒక అలవాటు ఉంది శాంతారాం గారు. నేనెక్కడికి వెళ్లినా బర్త్ డేస్ లిస్ట్ మెయింటేన్ చేసి సెలెబ్రేట్ చేస్తాను. అది చాలా ముఖ్యంగా భావిస్తాను. ఆ అలవాటు మీతోనే స్టార్ట్ చేస్తాను. కేక్ ఆర్డర్ చెయ్యండి బ్రాంచ్ తరపున. ఈవెనింగ్ కేక్ కట్ చేద్దురు గాని అన్నాడు.

అయ్యో వద్దు సర్ అంటూ మొహమాటపడ్డాడు శాంతారాం.

ప్లీజ్ సర్. మీరు అలా అనకండి. ఇదొక సరదా మాత్రమే. మీరు ఏమీ ఫీల్ అవ్వకండి. జస్ట్ ఎంజాయ్ చేద్దాం అందరం అని చెప్పాడు. మీరు వెళ్లి మీ శ్రీమతి గారు పంపిన స్పెషల్స్ తినండి ప్లీజ్ అన్నాడు.

థాంక్యూ సర్ అన్నాడు శాంతారాం.

అతను వెళ్ళగానే విద్యావతి వచ్చింది.

రండి మేడం. భోజనం అయ్యిందా అని అడిగాడు.

ఇప్పుడే అయ్యింది. మీరు జోనల్ ఆఫీస్ కి వెళ్లారు అని చెప్పారు.

అవును. నిన్న మనం విజిట్ చేసిన యూనిట్ గురించి జోనల్ మేనేజర్ కొన్ని కీలక విషయాలు చెప్పారు. మీరు కూర్చోండి అవి చెప్తాను అన్నాడు.

మీరు లంచ్ చెయ్యండి. నేను మళ్ళీ వస్తాను అంది.

ఆకలి లేదు. జస్ట్ టెన్ మినిట్స్ అని మొత్తం వివరించి చెప్పాడు. కొంచెం కాషస్ గా ఉండాలి ఆ అకౌంట్ లో అని మరీ మరీ చెప్పారు. నేను ఆల్రెడీ కొంత రాసాను నాకున్న డౌట్స్ గురించి. అవి మీకు ఇస్తాను. మీరు కూడా స్టడీ చెయ్యండి అన్నాడు.

సరే సర్ అంది.

ఏంటి ఇవాళ మీ లంచ్ స్పెషల్స్ అని అడిగాడు.

ఉప్మా కాదు లెండి. ఇవాళ దోశ  తెచ్చుకున్నాను అంది.

ఓహ్ వెరైటీ అన్నమాట. మా ఆవిడ వంటలు కూడా టేస్ట్ చెయ్యండి అని క్యారేజ్ ఓపెన్ చేసాడు.

ఒక స్వీట్, కొంచెం పులిహోర, కొంచెం కర్డు రైస్, దొండకాయ కూర, వడియాలు ఉన్నాయి. అన్నీ కొంచెం కొంచెం పెట్టున్నాయి.

అదేంటి మరీ అంత కొంచెం తింటారా అంది

ఇవే ఎక్కువ. నా ఇష్టానికి తగ్గట్టు కరెక్ట్ గా అమరుస్తుంది మా రేణు అన్నాడు.

ఓహ్ మీ డైటింగ్ ఆవిడ మానిటర్ చేస్తోందన్నమాట అంది నవ్వుతూ.

ఎప్పుడూ కొంటె మాటలే. మామూలుగా ఉండవు మీ మాటలు అన్నాడు నవ్వుతూ. మన బ్రాంచ్ లో ఐ పి మెసెంజర్ ఉందికదా అన్నాడు.

ఎస్ సర్. మీ సిస్టం లో కూడా ఉంది అని ఓపెన్ చేసి చూపించింది.

మీరు కేబిన్ నుంచి బయటకు రాకుండా అన్ని సీట్స్ కి కనెక్ట్ అవ్వొచ్చు. మీ మెసేజ్ చెప్పొచ్చు. అది మీకు చాలా ఈజీ అవుతుంది.

అవును. చాలా అవసరం అది. అట్టాచ్మెంట్స్ కూడా పంపొచ్చు కదా అన్నాడు.

ఎస్ సర్ అంటూ మీరు ప్రశాంతంగా మీ మినీ మీల్స్ తినండి అంటూ లేచింది విద్యావతి.

గబ గబా లంచ్ కంప్లీట్ చేసి ఆ రోజు ఫిగర్స్ చూసాడు కృష్ణకుమార్. డిపాజిట్స్ ఐదు కోట్లు పెరిగాయి. ఎవరో తమ ఎస్ బి అకౌంట్ కి ట్రాన్స్ఫర్ చేయించుకున్నారు నెఫ్ట్ లో.

అన్నీ ట్రాన్సక్షన్స్ వెరిఫై చేస్తుంటే మొబైల్ మోగింది.

ఎవరిదబ్బా కొత్త నెంబర్ అనుకుంటూ ఆన్సర్ చేసాడు.

సర్ నేను ఏ జి ఎం, ఐ బి బ్యాంకు కోటి బ్రాంచ్ నుంచి మాట్లాడుతున్నాను. మీ విరాజ్ స్పేస్ టెక్స్ లో మా కన్సార్టియం కూడా ఉంది. మీరు కొత్తగా జాయిన్ అయ్యారని తెలిసింది. ఆ లోన్ గురించి మీతో డిస్కస్ చెయ్యాలి. ఎప్పుడు రమ్మంటారు అని అడిగాడు.

ఇప్పుడు రాగలరా అని అడిగాడు.

సరే సర్. నాకు మీ బ్రాంచ్ దగ్గరే. అరగంటలో అక్కడ ఉంటాను అన్నాడు.

అనుకున్నట్లే ఐ బి బ్యాంకు కోటి బ్రాంచ్ ఏ జి ఎం అరగంటలోపే వచ్చాడు.

హ్యాపీ టు మీట్ యూ అంటూ పరస్పర కరచాలనాలు అయ్యాయి.

ఒక గంట సేపు ఏకబిగిన డిస్కషన్స్ జరిగాయి. చాలా పాయింట్స్ డిస్కస్ చేశారు.

బిస్కట్స్, టీ వచ్చాయి. అప్పటికే అఫీషయల్ డిస్కషన్ అయ్యి పర్సనల్ డిస్కషన్ లోకి దిగారు ఇద్దరు.

ఐ బి బ్యాంకు ఏ జి ఎం అడిగాడు మీ బ్రాంచ్ లో మా స్టాఫ్ వైఫ్ ఉండాలి అని.

పేరేమిటి అని అడిగాడు కృష్ణకుమార్.

విద్యావతి. నా దగ్గర వర్క్ చేసిన శాస్త్రిగారి భార్య. అతను చీఫ్ మేనేజర్ ప్రమోషన్ మీద లాస్ట్ మంత్ వరంగల్ వెళ్ళాడు.

ఓహ్ ఎస్. విద్యావతి ఈ కన్సార్టియం ప్రాజెక్ట్ లోనే మానిటోరింగ్ సెక్షన్ లో ఉన్నారు అన్నాడు కృష్ణకుమార్.

ఆవిడ చాలా నైస్ లేడీ సర్. అతను చాలా ఇబ్బంది పెడతాడు ఆమెని. శాస్త్రికి అన్నీ వ్యసనాలు ఉన్నాయి. మందు,లేడీస్ ఒకటేమిటి అంటూ చెప్పుకొచ్చాడు అవతలి బ్యాంకు ఏ జి ఎం. చాలా హింసిస్తాడు ఆమెని. పెళ్లయినప్పటినుంచి తిట్టడం, కొట్టడం, చాలా వరస్ట్ గా ప్రవర్తిస్తాడు తనతో . అతనికేమో తన జీతం డబ్బులు చాలవు. ఆవిడ శాలరీ లో కూడా సగం వాడేస్తాడు ప్రతి నెలా. ఆవిడకి

నరకం చూపిస్తాడు. పిల్లల్ని కూడా హింసిస్తాడు. వాళ్ళ చదువులుకు కూడా విద్యావతి అక్క చాలా వరకు డబ్బులు ఇచ్చేది. రాత్రిపూట తప్పతాగి ఇంటిముందు అసహ్యంగా తిడుతూ నానా రభస చేస్తాడు. ఈ భాదలు భరించలేక సంవత్సరం క్రితం విద్యావతి అతనికి విడాకులు నోటీసు పంపింది. ఆ రోజు నాకాళ్ళు పట్టుకుని ఎలాగైనా భార్య చేత అవి వాపస్ తీసుకోమని చెప్పించాడు. ఆవిడకి ఎంతో నచ్చ చెపితే కానీ ఆ నోటీసు వాపసు తీసుకోలేదు. నాకే చాలా బాధ వేసింది. ఈ సారి ప్రమోషన్స్లో నేనే గట్టిగా ప్రయత్నించి ప్రమోషన్ ఇప్పించి వరంగల్ వేయించాను. కొంతవరకన్నా ఆమెకు ఊరట ఉంటుందని. మా బ్రాంచ్ లో కూడా అతను లేడీ స్టాఫ్ తో అసభ్యంగా ప్రవర్తించేవాడు. అతని మీద నాలుగు ఛార్జ్ షీట్ లు కూడా ఉన్నాయి బ్యాంక్లో . ఒక దశలో సస్పెండ్ కూడా చేయిద్దామని ట్రై చేసాను. ఆలా చేసేప్పుడు సిగ్గులేకుండా కాళ్ళు పట్టుకుంటాడు. క్షమించమంటాడు. ఇంకెప్పుడూ చెయ్యనంటాడు. కుక్క తోక వంకర అన్నట్లు మళ్ళీ కొద్దీ రోజులకు మామూలే. నాకు కూడా తలనొప్పి పుట్టి మెల్లగా ఇక్కడ నుంచి తప్పించాను అని పెద్ద స్టోరీ చెప్పాడు అతను.

ఆశ్చర్యపోయాడు కృష్ణకుమార్. అయ్యో ఇంత ఇబ్బంది ఉందా విద్యావతికి అనుకున్నాడు.

అతను లేచేందుకు ఉద్యుక్తుడయి మీరు కన్సార్టియం హెడ్ కాబట్టి మీరు అన్ని బ్యాంకుల తో ఒక మీటింగ్ ప్లాన్ చెయ్యండి సర్ అందరం కలిసి మోడాలిటీస్ డిసైడ్ చేద్దాం అని ఇక నేను వెళతాను అని కృష్ణ కుమార్ కి చెప్పి అతను వెళ్ళిపోయాడు.

క్లర్క్ రంగారావు వచ్చాడు కేక్ తెప్పించాము సర్. అందరూ మీ కోసం వెయిటింగ్. మీరు వస్తే శాంతారాం గారి చేత కేక్ కట్ చేయిద్దాము అన్నాడు.

ఆ బ్రాంచ్ కి గ్రౌండ్ ఫ్లోర్ లో డిపాజిట్స్ , కాష్ డిపార్ట్మెంట్స్ ఉంటాయి. మొదటి అంతస్థులో లోన్స్, మిగతా డిపార్ట్మెంట్స్ ఉంటాయి.

కస్టమర్స్ సౌకర్యం కోసం అని అలా పెట్టారు.

హాల్ లో అందరూ వెయిటింగ్. కృష్ణకుమార్ అందరినీ ఒకమారు విష్ చేసి పేరు పేరునా పలకరించాడు.

శాంతారాం గారిని ముందుకు రమ్మన్నాడు. శాంతారాం గురించి అందరూ సరదాగా మాట్లాడారు. తమ బ్రాంచ్ లో ఫస్ట్ టైం ఇలా అందరూ కలిసి బర్త్ డే

సెలెబ్రేట్ చేస్తున్నాం సర్. ఈ క్రెడిట్ మీదే అన్నారు అందరూ. కృష్ణకుమార్ కూడా శాంతారాం గురించి మాట్లాడాడు. ఈ సెలెబ్రేషన్స్ ఇకనుంచి అందరి పుట్టిన రోజులకు చేద్దాం అని చెప్పాడు. అందరి చప్పట్ల మధ్య శాంతారాం కేక్ కట్ చేసాడు. ఒక ముక్క తీసి కృష్ణ కుమార్ అతనికి తినిపించాడు. ఇంకొక సంవత్సరంలో శాంతారాం రిటైర్ అవుతున్నాడు. అతనికి అందరి మధ్య తన పుట్టిన రోజు జరుపుకోవడం బ్యాంకు లో చేరిన తరువాత అది ఫస్ట్ టైం. ఎంతో సంతోషంగా ఫీల్ అయ్యాడు. తానూ ఒక కేక్ ముక్క కృష్ణకుమార్ కి తినిపించాడు. బ్రాంచ్ తరపు నుంచి ఇది మీకు చిన్న గిఫ్ట్ అని అతనికి ఇచ్చాడు కృష్ణ కుమార్. అందులో ఒక చిన్న ఆర్ట్ పీస్ ఉంది. చాలా అందంగా ఉంది. ఖరీదు తక్కువే అయినా అది అందరి మనసులు దోచింది. ఎందుకంటే ఇప్పటివరకు అలాంటి అలవాట్లు ఆ బ్రాంచ్ లో లేవు. కృష్ణ కుమార్ ఆ మంచి అలవాటుకు నాంది పలికాడు. అందరికి సంతోషం కలిగింది. తమ బ్రాంచ్ మేనేజర్ చక్కగా అందరితో కలవడం చూసి ముచ్చటపడ్డారు. స్వీట్, హాట్, కాఫీ లు సేవించి అందరూ తమ సీట్స్ కి వెళ్లిపోయారు.

సర్ మీరు ఫ్రీ అయితే ఇవాళ్టి రిపోర్ట్ మీకు ఇచ్చి వివరిస్తాను అంది విద్యావతి.

రండి మేడం ఇప్పుడే చూసేద్దాం అని కేబిన్ లోకి దారి తీసాడు.

ఇందాక ఐ బి బ్యాంకు ఏ జి ఎం వచ్చారు. ఈ అకౌంట్ గురించి మాట్లాడి వెళ్లారు అన్నాడు.

ఎందుకో విద్యావతి మొహం మామూలుగా లేదు. పొద్దుటి ఇప్పటికి చాలా తేడా ఉంది. బాగా ఏడ్చి కళ్ళు ఉబ్బి బుగ్గలు ఎరుపెక్కినట్లు కనిపించింది. లంచ్ టైం లో కూడా బాగానే ఉందే. ఈ మూడు గంటల్లోనే ఎందుకు ఇలా అని ఆలోచనలో పడ్డాడు. భర్త నుంచి ఎమన్నా ఇబ్బంది ఫోన్ వచ్చిందేమో ! మరు నిముషంలో మనకెందుకులే అది వాళ్ళ జీవిత సమస్య మనం తలదూర్చకూడదు అనుకున్నాడు.

చెప్పండి మేడం అన్నాడు

అన్నీ చక్కగా వివరించింది. అంతా అయిన తరువాత రేపు నాకు లీవ్ కావాలి సర్ అంది.

తీసుకోండి అన్నాడు.

మళ్ళీ కొంచెం ఆగి తనే చెప్పింది. రేపు స్టేట్ విమెస్ కమిషన్ ని కలవాలి సర్ అంటూ తన భర్త శాస్త్రి కలిగించే ఇబ్బందులు గురించి చెప్పింది. అతని మీద కంప్లైంట్ ఇద్దామనుకుంటున్నాను అంది.

కూర్చోండి అన్నాడు. నా హెల్ప్ ఏమన్నా కావాలా అని అడిగాడు.

ఎవరన్నా తెలిసిన వాళ్ళు చెప్తే కొంచెం సపోర్ట్ ఉంటుందేమో సర్. నాకు అక్కడ ఎవరూ తెలీదు.

తనకు తెలిసిన వాళ్లకు ఫోన్ లు చేసాడు. చివరకు ఒక లింక్ దొరికింది. వాళ్ళు చైర్మన్ కు చెప్తామన్నారు. ఆ విషయం విద్యావతి కి చెప్పాడు. ఏమని కంప్లైంట్ ఇస్తారు అని అడిగాడు.

తను పడుతున్న ఇబ్బందులు, భర్త వేధింపులు గురించి చెప్పింది. వాటిమీదే కంప్లైంట్ ఇస్తాను అంది.

అలా చేస్తే అతని మీద యాక్షన్ తీవ్రంగా ఉంటుందేమో ఆలోచించండి. దానివల్ల అతను మిమ్మల్ని ఇంకా ఇబ్బందిపెడతాడు. అందువల్ల మీకు వచ్చే ప్రయోజనం ఏముంటుంది. ఏదన్నా పెర్మనెంట్ పరిష్కారం ఆలోచించండి.

విడాకులు ఇద్దామంటే ఒప్పుకోవడం లేదు. మెంటల్ క్రూయల్టీ వేద్దామంటే దానికి గట్టి లాయరు కావాలి. అతను లాయర్లని  కూడా మేనేజ్ చేస్తున్నాడు. ఇది ఇప్పటి సమస్య కాదు సర్. పెళ్లయినప్పటినుంచి అతని తీరు ఇలాగే ఉంది. నా జీవితం చాలా నరకమయ్యింది అతని వలన. చాలా సార్లు ఆత్మహత్య కు కూడా ప్రయత్నించాను. పిల్లల వల్ల  ఆగి పోయాను. ఇప్పుడు వాళ్ళ జీవితాలు ఒక దారిలో పడ్డాయి. ఇక నాకు ఏ చింతా లేదు వాళ్ళ గురించి అంటూ కన్నీళ్లు పెట్టుకుంది.

ఏడవకండి మేడం ప్లీజ్ అన్నాడు. మీరు కూడా అలా పిరికిగా ఆలోచిస్తే ఎలా ? ఆత్మహత్య పరిష్కారమా ? ఇంత చదివి, తెలివి తేటలు ఉండి కూడా మీరే అలా అంటే ఎలా ?

మరి నాకు ఎవరు సపోర్ట్ లేరు కదా సర్. పిల్లలని ఇటువంటి విషయాల్లో ఇన్వాల్వ్ చెయ్యడం నాకిష్టం లేదు. మా సిస్టర్స్ కూడా అతనితో చాలా విసిగి పోయున్నారు. పిల్లలకి కూడా నరకం చూపించాడు. వాళ్ళు ఇంత స్టేజి కి వచ్చారంటే మా అక్కల సపోర్ట్ వల్లనే. అలాంటి మా అక్కలతో మళ్ళీ నా సమస్య చూడమంటే అది వాళ్ళని చాలా ఇబ్బందులలో పడేసినట్లు ఉంటుంది.

నా సపోర్ట్ మీకు ఎప్పుడూ ఉంటుంది మేడం. ఇక్కడ పోలీస్ డిపార్ట్మెంట్ టాప్ ఆఫిసియల్స్ చాలా మంది తెలుసు నాకు. ముందు మీకు కలిగిన ఇబ్బందులు ఇక కలుగవు అని మటుకు భరోసా ఇవ్వగలను. మీకు ఎప్పుడు ఏ అవసరమున్నా క్షణాల్లో చేయించగలను. ఇక అతనిమీద కేసు పెట్టడం అది అంటే మీరు కొంచెం అలోచించి నిర్ణయం తీసుకోండి. ఆవేశంలో అతనేమన్నా చేస్తే మీకు సమస్యలొస్తాయి. అందులోనూ మీరు, మీ అక్క ఒంటరిగా ఉంటారు. రెండు మూడు రోజులు సమయం తీసుకోండి. ఒక శాశ్వత పరిష్కారం కోసం వెదకండి అని చెప్పాడు కృష్ణకుమార్. నా ఫ్రెండ్స్ లాయర్లు చాలా మంది ఉన్నారు. మీకు ఎటువంటి లీగల్ సపోర్ట్ కావాలన్నా వాళ్ళు చూసుకుంటారు. ఆ భాద్యత నాది అన్నాడు.

విద్యావతి మోహంలో ధైర్యం కనిపించింది. కర్ఛీఫ్ తో కళ్ళు తుడుచుకుని థాంక్యూ సర్ థాంక్యూ వెరీ మచ్ అంది. గొంతులో జీర వినిపించింది.

లేవబోతుంటే ఒక నిముషం కూర్చోమన్నాడు.

ఇంటర్కం లో రెండు కాఫీలు తెమ్మని చెప్పాడు.

రేపు లీవ్ కావాలంటే తీసుకోండి. రెస్ట్ తీసుకోవచ్చు అన్నాడు.

వద్దు సర్. వర్క్ ఉంటేనే నేను లీప్ పెడతాను. ఇంట్లో బోర్ కొడుతుంది. మీరు భరోసా ఇచ్చారుగా ఇక నాకు భయం లేదు లెండి. ఏ ఇబ్బంది ఉన్నా మీ తలుపు తడతాను అంది జాగ్రత్త అన్న ధోరణిలో నవ్వుతూ.

అమ్మయ్య. మొత్తానికి నవ్వారు. అది చాలు. మీ మొహానికి ఆ నవ్వు, మీ మాటల్లో ఆ కొంటెతనం మీకు సహజ ఆభరణాలు. అవి అలాగే ఉంచుకోండి. మీకు ఏ సమస్య ఉన్నా మా ఇంట్లో ముగ్గురం మీ ముందు వాలిపోతాం అన్నాడు నవ్వుతూ.

చాలా చాలా థాంక్స్ సర్ మీరిచ్చిన ఈ ధైర్యానికి అంది రెండు చేతులు జోడిస్తూ విద్యావతి.

***

రాత్రి తొమ్మిది గంటలైంది. స్నానం చేసి టి వి చూస్తున్నాడు కృష్ణకుమార్.

భోజనానికి లేస్తారా అంటూ అడిగింది రేణుక.

మోహిత్ బిజీ గా ఉన్నాడా. వాడిని కూడా రమ్మను అందరం కలిసే చేద్దాం అన్నాడు.

వాడు మామూలేగా, రూంలో చదువుకుంటున్నాడు . మీరు ఓకే అంటే వాడిని కూడా పిలుస్తాను అంది.

ఇంతలో మొబైల్ మోగింది.

విద్యావతి నుంచి ఫోన్ సర్ 'మీరు అర్జెంటు గా రావాలి. మా హస్బెండ్ ఇంటి బయట న్యూసెన్స్ చేస్తున్నాడు. చేతిలో పెట్రోల్ కెన్ పట్టుకోనున్నాడు. పెట్రోల్ పోసి చంపుతానని బెదిరిస్తున్నాడు అంటూ ఏడుస్తోంది. ఫోన్ లో దబ దబ అంటూ ఇంటి తలుపులు బాదుతున్న చప్పుడు వినిపిస్తోంది.

మేడం నేను పది నిముషాల్లో అక్కడుంటాను. మీరు కంగారు పడకండి అని చెప్పాడు కృష్ణకుమార్.

మోహిత్ ని పిలిచి అర్జెంటు గా డ్రెస్ వేసుకో రా. కారు డ్రైవ్ చెయ్యాలి నువ్వు. డ్రైవింగ్ లైసెన్స్ కూడా పెట్టుకో. మన ఇంటికి దగ్గరే. అశోక్ నగర్ దాకా వెళ్ళాలి అన్నాడు. రేణుక కు బ్రీఫ్ గా వివరాలు చెప్పి బయలుదేరాడు.

మోహిత్ డ్రైవింగ్ చేస్తుంటే కృష్ణకుమార్ తన క్లాసుమేట్ కమీషనర్ అఫ్ పోలీస్ కి ఫోన్ చేసి వివరం చెప్పాడు. అతను అశోక్ నగర్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ని పంపిస్తానని చెప్పాడు.

ప్లీజ్, అర్జెంటు గా పంపరా అని రిక్వెస్ట్ చేసాడు.

విద్యావతి ఇంటి బయట జనాలంతా గుమిగూడి ఉన్నారు. ఆవిడ భర్త తలుపులు బాదుతూ గట్టి గట్టిగా అరుస్తున్నాడు. బాగా తాగి ఉన్నట్టు తెలుస్తోంది.

ట్రాఫిక్ అంత లేదు రోడ్ మీద. కారు పక్కనే ఉంచి కృష్ణకుమార్ మోహిత్ ఇద్దరూ గేట్ దగ్గరికి వచ్చారు. అతన్ని వారించే స్థితి లో లేడు. గట్టి గట్టిగా అరుస్తూ తూలుతున్నాడు.

విద్యావతి కి ఫోన్ చేసాడు. మేడం నేను మీ ఇంటి బయటే ఉన్నాను. మీరేమీ వర్రీ అవకండి. ఐదు నిముషాల్లో పోలీసులొస్తున్నారు. నేను చెప్పేంతవరకు మీ కిటికీ కానీ, తలుపులు కానీ తీకండి అని చెప్పాడు.

థాంక్యూ సర్ అంది. ఆమె కంఠంలో కొంచెం ధైర్యం కనిపించింది.

ఇంతలో పోలీస్ వాన్ వచ్చింది. అందులోనుంచి ఇన్స్పెక్టర్ మరో నలుగురు పోలీసులు దిగారు.

కృష్ణకుమార్ ఇన్స్పెక్టర్ దగ్గరికెళ్లి అన్నీ చెప్పాడు.

నాకు కమీషనర్ గారు ఫోన్ చేశారు. అతన్ని మేము చూసుకుంటాము సర్ అని హామీ ఇచ్చాడు. మీరు ఒక కంప్లైంట్ రాసివ్వండి అన్నాడు.

కృష్ణకుమార్ ఇన్స్పెక్టర్ ని రిక్వెస్ట్ చేసాడు. అతని మీద థర్డ్ డిగ్రీ ఉపయోగించకండి. జస్ట్ లాక్ అప్ లో ఉంచండి. ఎందుకంటే ఎక్కువ అభియోగాలు అరెస్ట్ అంటే అతని ఉద్యోగం పోతుంది. అతని భార్య మా బ్రాంచ్ స్టాఫ్. ఆవిడని మా ఇంట్లో వదిలేసి నేను మీ పోలీస్ స్టేషన్ కి వచ్చి మాట్లాడుతాను అని చెప్పాడు.

ఇన్స్పెక్టర్ ఓకే సర్ అలాగే చేస్తాను అన్నాడు. మాకు కమీషనర్ గారి ఆర్డర్స్. సర్ కూడా జాగ్రత్తగా డీల్ చెయ్యండి అని చెప్పారు నాతో.

పోలీసులు వెళ్లి శాస్త్రి ని కంట్రోల్ లోకి తీసుకున్నారు. వాళ్ళను చూడగానే కంగారు భయం కలిగింది అతనిలో. వాన్ లో కూర్చోపెట్టారు.

నేను స్టేషన్ కు వచ్చి కంప్లైంట్ ఇస్తాను అని చెప్పాను ఇన్స్పెక్టర్ కి.

అతను సరే అన్నాడు. పోలీస్ వాన్ వెళ్ళిపోయింది.

విద్యావతి కి ఫోన్ చేసి సంగతి చెప్పి తలుపు తీయండి అన్నాడు.

కిటికీ తీసి చూసింది. కృష్ణ కుమార్ చెయ్యి ఊపాడు.

ధైర్యంగా తలుపు తీసింది. థాంక్యూ సర్ అంది. ఆమెకు గుండె దడ ఇంకా తగ్గలేదు. ఏమి అఘాయిత్యం జరుగుతుందోనని బెంబేలెత్తిపోయింది. ఇప్పుడు మనసు కాస్త కుదుటపడ్డది.

రండి సర్ లోపలికి  అంది. వెనుకనే నిలుచున్న మోహిత్ ని చూసి మీ అబ్బాయా అంది.

అవును అని చెప్పి మేడం మీరు నాతోపాటు మా ఇంటికి వచ్చేయండి. ఇవాళ అక్కడే ఉందురుగాని. ఇక్కడ వద్దు అన్నాడు.

ఫరవాలేదు సర్. నేను ధైర్యంగా ఉండగలను అంది.

ఈ లోపు మిద్దెపై నుంచి ఆమె పెద్ద అక్క వచ్చింది. చాలా థాంక్స్ సర్ మీకు అంది. సమయానికి మా రెండో సిస్టర్, ఆవిడ హస్బెండ్ లేరు. వాళ్ళు నిన్ననే టూర్ వెళ్లారు. మీకు చాలా శ్రమ ఇవ్వాల్సి వచ్చింది అంది.

కృష్ణకుమార్ మాటలు విన్న ఆవిడ కూడా విద్యా ! సర్ చెప్పినట్లు వాళ్ళింటికి వెళ్ళు . ఇక్కడ ఉంటె అంత మంచిది కాదు. పొద్దున్నే వద్దువుగాని అంది.

కృష్ణకుమార్ ఆవిడని కూడా తమతో రమ్మన్నాడు మీరు ఒంటరిగా ఇక్కడ ఎందుకు అని.

ఆవిడ ఫరవాలేదు. నాకేమీ ఇబ్బంది లేదు. విద్య ని తీసుకెళ్లండి. పోలీస్ స్టేషన్ ఫార్మాలిటీస్ కూడా ఉన్నాయి కదా. తనతో డిస్కస్ చెయ్యొచ్చు అంది.

విద్యావతి కి ఇంక తప్ప లేదు. సరే అని చిన్న బ్యాగ్లో తన బట్టలు, ప్రొద్దుటి కి కావాల్సిన అవసరాలు పెట్టుకుని అక్కకు చెప్పి బయలుదేరింది.

మోహిత్ కారు నడుపుతున్నాడు. దారిలో కృష్ణకుమార్ విద్యావతి కి అన్ని విషయాలు చెప్పాడు. మీరు ఎలా చెప్తే అతన్ని ఆలా మేనేజ్ చేద్దాం అన్నాడు. అతనిపై థర్డ్ డిగ్రీ ఉపయోగించ వద్దని, జస్ట్ లాక్ అప్ లో ఉంచమని చెప్పాను. మీరు కంప్లైంట్ ఎలా రాసివ్వాలని అనుకుంటున్నారో చెప్తే ఇంటికి వెళ్లిన తరువాత టైపు చేసి పట్టుకెళ్లి ఇస్తాను. అప్పుడు ఎఫ్ ఐ ఆర్ లాడ్జి చేస్తారు అన్నాడు. మీ ఉద్దేశ్యం చెప్పండి.

నాది, పిల్లలది ఒకటే అభిప్రాయం సర్. పెళ్లయినప్పటినుంచి అతని అరాచకాలు ఎన్నో భరిస్తున్నాను. అవి రోజు రోజు కు ఎక్కువ అవుతున్నాయి తప్ప మార్పు లేదు. ఇక అతనిలో మార్పు వస్తుందని కూడా నాకు నమ్మకంలేదు. ఇలానే ఉంటె నేను మానసిక స్తైర్యం కోల్పోతాను. దీనికి తుది పరిష్కారం నేను

ఎప్పటినుంచి అనుకుంటున్న విడాకులు ఒక్కటే. నాకు విడాకులు ఇప్పించగలిగితే మీకు చాలా రుణపడిఉంటాను అంది.

అయితే ఒకటి చేద్దాం మేడం. మీకు ఇప్పటివరకు జరిగిన ఇబ్బందులు రాసి కంప్లైంట్ ఇద్దాం. ఆ విధంగా ఎఫ్ ఐ ఆర్ నమోదు అవుతుంది. అతనికి చెప్తాను విడాకులుకు ఒప్పుకుంటే అతనికి ఏ సమస్యా ఉండదని. లేకుంటే అతన్ని అరెస్ట్ చేయించి అట్టెంప్ట్ టు మర్డర్ కేసు పెట్టిస్తానని పోలీస్ వారిచేత చెప్పిస్తాను. నిజానికి అతను మీ మీద చేసిన అఘాయిత్యాలు అన్నీ చెప్తే అతని కి చాలా శిక్షలు పడతాయి. విడాకులు కూడా పరస్పర అంగీకారం తోనే ఒప్పిస్తాను. అవి మీకు సంవత్సరంలోపు మంజూరవుతాయి. నేను ఆ విషయంలో పూర్తి హెల్ప్ చేయగలను. కోర్ట్ పరంగా కూడా మా ఫ్రెండ్ లాయర్లు కి చెప్పి ఏ ఇబ్బంది లేకుండా విడాకులు వచ్చేట్లు చూడగలను అన్నాడు.

మీకు చాలా కృతజ్ఞతలు సర్. మీరు కంప్లైంట్ డ్రాఫ్ట్ చేయండి. నేను సైన్ చేస్తాను. మీరు చెప్పినట్లుగానే ముందుకు వెళదాం అంది.

కారు పార్క్ చేసి లిఫ్ట్ లో పైకి వెళ్లారు.

రేణుక వీళ్ళ కోసం వెయిట్ చేస్తోంది.

విద్యావతి ని రేణుక కి పరిచయం చేసాడు కృష్ణకుమార్.

రేణుక విద్యావతి ని లోపలికి తీసుకెళ్లింది.

మీకు చాలా శ్రమ ఇచ్చాను అంటోంది విద్యావతి.

అలాంటి దేమీ లేదు. మీరు రిలాక్స్ అవ్వండి. చాలా డస్సిపోయున్నారు మీరు అంటూ గెస్ట్ బెడ్ రూమ్ కి తీసుకెళ్లి  మొహం అది కడుక్కుని రిలాక్స్ అవ్వండి. అందరం భోజనం చేద్దాం అంది రేణుక.

ఈలోగా కృష్ణకుమార్ కంప్యూటర్ ఆన్ చేసి కంప్లైంట్ టైపు చేసి ప్రింట్ చేసాడు.

విద్యావతి హాల్ లోకి రాగానే ప్రింట్ చేసిన కంప్లైంట్ పేపర్ చూపించాడు.

సరిపోతుంది సర్. అతను విడాకులకు ఒప్పుకుంటే నాకు అతనిపై ఎటువంటి సమస్యా ఉండదు అంది.

అందరూ ఇక భోజనాలకు రండి, బాగా లేట్ అయ్యింది అంది రేణుక.

ఇన్స్పెక్టర్ కి ఫోన్ చేసి ఒక అరగంటలో వస్తానని చెప్పాడు కృష్ణకుమార్. శాస్త్రి గారికి తినడానికి ఏమి కావాలో అడిగి తెప్పించండి సర్. డబ్బులు నేను వచ్చి ఇస్తాను అని చెప్పాడు.

కృష్ణకుమార్ మాటలు విన్న విద్యావతి అతని మంచితనానికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పింది. అతనిలో ఉన్న ఔన్నత్యానికి ఆమె అబ్బురపడింది.

అందరూ భోజనాలకు కూర్చున్నారు డైనింగ్ టేబుల్ దగ్గర.

రేణుక వడ్డిస్తుంటే విద్యావతి వారించింది. మీరు కూడా కూర్చోండి ప్లీజ్ అంది.

ప్లేట్ లో అన్నం కెలుకుతూ ఉంటె రేణుక చెప్పింది విద్యావతి కి. మీకు ఏ టెన్షన్ వద్దు. అన్నీ ఆయన చూసుకుంటారు. మీరు భోజనం చెయ్యండి అని ఐటమ్స్ ఒక్కొక్కటి చెప్పింది రేణుక.

మీకు చాలా చాలా థాంక్స్ . ఇంతకు ముందు ఇలాంటి సంఘటనలు ఎన్నోనా జీవితంలో జరిగాయి. ఎవరూ ధైర్యం చేసి ముందుకు రాలేదు సహాయానికి. అందరిని అతను బెదిరించేవాడు. అతను ఏదన్నా చేస్తాడేమోనని ఎవ్వరూ హెల్ప్ చేయలేదు. ఈ రోజు మీరు ధైర్యంగా ముందుకు వచ్చి నా సమస్యకు ఒక పరిష్కారం చూపిస్తున్నారు అంది విద్యావతి కృష్ణకుమార్ తో.

మీకు సాయంత్రమే చెప్పానుగా మేడం. లోకల్ గా కమిషనర్ ఆఫ్ పోలీస్ నా చిన్నప్పటి క్లాసుమేట్. చాలా మంచి వ్యక్తి. మీ సమస్య చెప్పగానే వెంటనే స్పందించాడు. నేను నా ఫ్రెండ్ లీగల్ ఎక్స్పర్ట్ తో కూడా మాట్లాడాను. వాడి

సలహా ప్రకారమే కంప్లైంట్ కూడా టైపు చేసాను. వాడి కూడా పోలీస్ స్టేషన్ కు డైరెక్ట్ గా వస్తానన్నాడు ఇప్పుడు. మీ హస్బెండ్ కు అన్నీ ఎక్స్ప్లెయిన్ చేస్తాము. అతని నుంచి మీకు విడాకులు కావాలని చెప్పి ఒప్పిస్తాము. మా లాయర్ ఫ్రెండ్ కూడా పక్కనే ఉంటాడు కాబట్టి వాడే అన్ని లీగల్ విషయాలు చూసుకుంటాడు. మీరు కోరుకున్నట్లు ఎలాగైనా మీకు విడాకులు తెప్పించే పూచీ నాది. ఇకనుంచి శాస్త్రి గారు మీ పై ఎలాంటి అఘాయిత్యము చెయ్యకుండా ఇబ్బంది పెట్టకుండా పోలీస్ పరంగా, న్యాయ పరంగా అన్ని ఏర్పాట్లు నేను చేస్తాను అని చెప్పాడు కృష్ణకుమార్.

రెండు చేతులు జోడించింది విద్యావతి.

రేణుక తో చెప్పి ఆవిడని జాగ్రత్తగా చూసుకోమని తను పోలీస్ స్టేషన్ కు వెళుతున్నట్లు చెప్పాడు. బాగా లేట్ అవ్వచ్చేమో రేణు. మీరు లోపల లాక్ చేసుకుని పడుకోండి అన్నాడు.

నేను తన రూంలోనే పడుకుంటాను ఇవాళ అంది రేణు. కొంత కబుర్లు చెప్తే ఆవిడకి కాస్త హాయిగా ఉంటుంది.

ఓహ్ మంచిది. అలాగే చెయ్యి అన్నాడు.

మోహిత్ అడిగాడు డాడీ నన్ను కూడా మీతో రమ్మంటారా అని .

వద్దురా. నేను వెల్తానులే. ఇబ్బందేమీ లేదు. నువ్వు చదువుకుని పడుకో అని చెప్పి బయలుదేరాడు కృష్ణకుమార్.

పోలీస్ స్టేషన్ కి వెళ్లేసరికి ఇన్స్పెక్టర్ వెయిట్ చేస్తున్నాడు. అప్పటికే పదకొండు అయ్యింది. శాస్త్రి ని లోపల బెంచ్ పై కూర్చో బెట్టున్నారు. మందు కిక్ ఇంకా తగ్గినట్టులేదు అతనిలో . మత్తుగా కళ్ళుమూసుకుని కూర్చోనున్నాడు.

సారీ సర్. లేట్ అయ్యింది అని చెప్పాడు కృష్ణకుమార్ ఇన్స్పెక్టర్ తో . అప్పటికే అతని లాయర్ ఫ్రెండ్ కిరణ్ కూడా వచ్చున్నాడు స్టేషన్ కి . హాయ్ రా కిరణ్ అంటూ అతన్ని పలకరించాడు.

ఇన్స్పెక్టర్ ఎక్స్ప్లయిన్ చేసాడు. మీరు చెప్పినట్లే అతనినేమీ చెయ్యలేదు. అరిచాము, తిట్టాము. దాంతో భయపడ్డాడు. మాట వినకపోతే అరెస్ట్ చేసి బొక్కలో తోస్తామని చెప్పాము. చపాతీ కావాలన్నాడు. తెప్పించాము. ఇప్పుడు ఓకే గానే ఉన్నాడు.

లాయర్ కిరణ్ కృష్ణకుమార్ తెచ్చిన కంప్లైంట్ తీసుకుని చదివాడు.

నువ్వు చెప్పినట్లే రాసానురా అన్నాడు కృష్ణకుమార్.

ఎస్. సరిపోయింది. మనం ఒకమారు శాస్త్రి తో మాట్లాడదాం రా అన్నాడు కిరణ్.

శాస్త్రి తో మాట్లాడి అన్నీ చెప్పారు అతనికి. విడాకులకు ఒప్పుకుంటే ఏ సమస్యా ఉండదు. కాదు కూడదు అని గొడవ చేస్తే అతని మీద ఛార్జ్ షీట్ ఫైల్ చేసి కోర్ట్ లో శిక్ష పడేట్లు చేస్తాము అని చెప్పారు గట్టిగా. అలా చేస్తే ఉద్యోగం కూడా ఊడుతుంది. దాంతో శాస్త్రి మత్తు వదిలింది. భయం తొంగిచూసింది మొహంలో.

మీరు ఎలా చెప్తే అలా చేస్తాను సర్ అని చేతులు జోడించాడు శాస్త్రి. అతనికి సీన్ పూర్తిగా అర్థమైంది. అతని మొహంలో ఆందోళన  కనిపించింది. ఇంతకుముందు ఆడిన నాటకాలలా కాదు ఇకముందు అని డిసైడ్ ఐనట్టున్నాడు. అందుకే పూర్తిగా సరెండర్ అయ్యాడు. అతని లో కనిపించే కనిపించే ఆ భయం విద్యావతి కి విడాకులు వచ్చేంతవరకు ఉండాలి. అందుకే కంప్లైంట్ అనేది ఒకటి ఉండాలి అని కిరణ్ ఆల్రెడీ కృష్ణకుమార్ కి డిస్కషన్ లో చెప్పాడు.

అందుకే శాస్త్రి మీద తను తెచ్చిన  కంప్లైంట్ ఇవ్వడం దాని మీద ఇన్స్పెక్టర్ ఎఫ్ ఐ ఆర్ రాయడం జరిగాయి. దాన్ని కోర్ట్ లో ప్రొడ్యూస్ చెయ్యొద్దు అని చెప్పాడు కృష్ణకుమార్. విడాకులయ్యేంతవరకు అతని మీద కొంత కంట్రోల్ పెట్టాలి

అనుకున్నాడు . అందుకు ఇవన్నీ తప్పనిసరి. లేకుంటే ఎప్పుడైనా జారిపోయి మళ్ళీ మొదటి కొస్తాడు.

అన్ని డిస్కషన్స్, ఫార్మాలిటీస్ పూర్తయ్యేసరికి ఒంటిగంటయ్యింది. శాస్త్రి ని రిలీజ్ చెయ్యమని చెప్పారు. ఎఫ్ ఐ ఆర్ కాపీ చూపించాడు ఇన్స్పెక్టర్. కిరణ్ అంతా చదివి చూసి ఓకే అన్నాడు . ఒక కాపీ కృష్ణకుమార్ కూడా తీసుకున్నాడు.

శాస్త్రి ఇన్స్పెక్టర్ కాళ్ళు పట్టుకున్నంత పని చేసాడు. లెంపలేసుకుని వదిలిపెట్టమన్నాడు. రకరకాలుగా ప్రాధేయపడ్డాడు.

ఇకముందు ఎప్పుడైనా ఇలాంటి వెధవ వేషాలేస్తే కోర్ట్ లో ఛార్జ్ షీట్ ఫైల్ చేసి శిక్ష పడేట్లు చేస్తానని ఇన్స్పెక్టర్ బెదిరించాడు.

ఇన్స్పెక్టర్ కి మరోమారు థాంక్స్ చెప్పి కృష్ణకుమార్, కిరణ్ బయటికొచ్చారు.

కిరణ్ ని అడిగాడు ఏరా ఇంక  ప్రాబ్లెమ్ ఏమీ ఉండదు కదా అని.

ఇక ప్రాబ్లెమ్ ఏమీ ఉండదురా. డివోర్స్ కు సంబంధించిన పరస్పర అంగీకార పిటిషన్ పేపర్స్ తయారు చేస్తాను. రేపు శాస్త్రి ని నా ఆఫీస్ కి రమ్మన్నాను కొన్ని డాకుమెంట్స్ కూడా కావాలని చెప్పాను. తెస్తానన్నాడు. అలాగే మీ బ్రాంచ్ కి కూడా రేపు వస్తాను. మేడం దగ్గర కూడా కొన్ని డాకుమెంట్స్ , సంతకాలు

తీసుకుంటాను. ఇవన్నీ పూర్తయితే రెండు రోజుల్లో కోర్ట్ లో డివోర్స్ పిటిషన్ వేయిస్తాను. వాళ్లిద్దరూ పిటిషన్ ఫైల్ చేసే రోజు ఒక సారి, ఆరునెలల తరువాత ఇంకోసారి కోర్ట్ కి వస్తే సరిపోతుంది. దానికి తగినట్లుగా ఇద్దరికీ ఏ ఇబ్బందీ లేకుండా పిటిషన్ డ్రాఫ్ట్ చేస్తాను. సంవత్సరంలోపు విడాకులు మంజూరు అవుతాయి అన్నాడు.

కిరణ్ కి కూడా థాంక్స్ చెప్పి ఇల్లు చేరాడు కృష్ణకుమార్. టైం రెండైంది. డూప్లికేట్ కీ తో డోర్ లాక్ తీసి ఫ్లాట్ లోకెళ్ళాడు ఎవ్వరినీ డిస్టర్బ్ చేయకూడదన్న ఉద్దేశంతో.

ఆశ్చర్యంగా ఎవరూ నిద్రపోవట్లేదు. అంతా మేలుకోనున్నారు. మోహిత్ వాడి రూమ్ లో చదువుకుంటున్నాడు . వాడికి లేట్ నైట్ చదివి పొద్దున కాలేజీ టైం కి గంట ముందు లేస్తాడు.

రేణు, విద్యావతి ఇద్దరూ డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

ఏంటి మీరు ఇంకా పడుకోలేదా అని ఆశ్చర్యంగా అన్నాడు కృష్ణకుమార్.

లేదండి. నిద్ర రాలేదు. కబుర్లు చెప్పుకుంటున్నాము అంది రేణు.

వాళ్లకి పోలీస్ స్టేషన్ లో జరిగిన తతంగమంతా వివరించి చెప్పాడు. తన లాయర్ ఫ్రెండ్ కిరణ్ కూడా అక్కడికి వచ్చినట్లు చెప్పాడు. విద్యావతి తో రేపు లాయర్ కిరణ్ బ్రాంచ్ కి వస్తున్నట్లు, తను తీసుకురావలసిన డాక్యుమెంట్స్ వాటి గురించి విశదంగా చెప్పాడు. శాస్త్రి డివోర్స్ కి ఒప్పుకున్నట్లు ఇంకేమీ ప్రాబ్లెమ్ చెయ్యనని రాసిచ్చాడని చెప్పాడు. విడాకులు మంజూరయ్యేంతవరకు అతని జుట్టు తమ చేతిలో ఉందని వర్రీ అవ్వాల్సిన అవసరం లేదని మరీ మరీ చెప్పాడు.

ఆ మాటలతో విద్యావతికి కాస్త సంతోషం కలిగింది. ఇన్నాళ్లకు తన జీవితంలో వెలుగు రేఖలు వస్తున్నట్లు హాయిగా అనిపించింది. ఈ ముప్పై ఏళ్లలో తను పడిన కష్టాలు గుర్తుకొచ్చి విపరీతమైన బాధ కలిగింది. ఏ రోజూ తను సుఖపడిందిలేదు. సంసార జీవితమంతా యాంత్రికంగా గడిచింది. ఒక విధంగా దినగండం నూరేళ్లు ఆయుష్షు అన్నట్లు ప్రాణం గుప్పిట్లో పెట్టుకుని బ్రతకాల్సి వచ్చింది. తన భర్త ఏ రోజు ఏం చేస్తాడో అని మానసిక వేదన అనుభవించింది. ఇన్నిరోజులు బ్రతికుందంటే అది కేవలం తన పిల్లల కోసం. వాళ్ళే లేకుంటే తను ఎప్పుడో తనువూ చాలించి ఉండేది. ఎంతో దయనీయమైన బ్రతుకు తనది. ఈ రోజు కృష్ణకుమార్ పూనుకుని ధైర్యం చెయ్యడం వల్ల తన జీవితానికి ఓ

పరిష్కారం లభించబోతోంది. విడాకులు వస్తే తన బ్రతుకు తను బతకొచ్చు. ఇప్పుడు భయం భయం గా కాలం వెళ్లబుచ్చుతోంది. భర్త ఎప్పుడు ఏమి సమస్య తెస్తాడో అని రోజు దిగులు. ఏ రోజు ప్రశాంతంగా నిద్రపోయిన క్షణాలు లేవు. విడాకులు వచ్చి తన జీవితానికి స్వాతంత్ర్యం వస్తే ఇక చేసినన్ని రోజులు బ్యాంకు లో వర్క్ చేసి, అవసరం లేకుంటే వి ఆర్ ఎస్ తీసుకుని కొడుకు దగ్గరికి వెళ్లొచ్చు. ఇలా సాగాయి ఆమె ఆలోచనలు.

రేణూ , అందరం కొంచెం కాఫీ తాగుదామా అన్నాడు కృష్ణకుమార్ భార్యతో . బాగా అలసటగా ఉంది అతనికి. గత నాలుగు గంటల్లో శారీరకంగా, మానసికంగా విపరీతమైన వత్తిడి కలిగింది. బ్యాంకు లో ఇలాంటి టెన్షన్స్ ఎన్నో చూసాడు కాబట్టి అతనికి పెద్ద ఇబ్బందేమీ కలగలేదు. కాకుంటే అలాంటి సమయాలలో తన ప్రియ నేస్తం కాఫీ తాగితే ఎంతో రిలాక్స్ గా ఉంటుంది. ఆ విషయం తన శ్రీమతి రేణుకకు బాగా తెలుసు. మనసెరిగిన అర్ధాంగి నా శ్రీమతి అనుకున్నాడు. ఆ విషయం గమనించి తప్పకుండా అండి అంటూ లేచింది రేణుక కిచెన్ లోకి దారితీస్తూ .

మమ్మీ! నాకు కూడా కాఫీ ప్లీజ్  అన్నాడు మోహిత్ గదిలోనుంచి.

సరేరా అంది.

కృష్ణకుమార్ రిఫ్రెష్ అయ్యి వచ్చే సరికి పొగలు కక్కుతున్న కాఫీ రెడీ గా ఉంది టీపాయ్ మీద.

అందరూ కాఫీ తాగుతూ హాల్లో కూర్చున్నారు.

రేణుక, విద్యావతి సోఫాలో పక్క పక్కనే కూర్చుని మాట్లాడుకుంటున్నారు. వారి కెదురుగా కృష్ణకుమార్ కూర్చున్నాడు.

రేణుక తో మాట్లాడుతూ విద్యావతి ఒకమారు కృష్ణకుమార్ వైపు చూసింది. అతను బాగా అలసిపోయున్నాడు. అతన్ని చూసి మనసులో అయ్యో అనుకుంది. తన కోసం ఇంత కష్టపడుతున్నాడు. ఎంతో రిస్క్ కూడా ఉంది తన విషయంలో. అయినా ఏ మాత్రం లెక్క చేయకుండా కేవలం ఈ కొద్ది రోజుల పరిచయానికి ఇంత సహాయం చేస్తున్నాడు అనుకుంది. తను మొదటినుంచి అతనితో సరదాగా మాట్లాడుతున్నా ఎక్కడ అడ్వాంటేజ్ తీసుకోలేదు. అతని మంచితనం తెలిసే తనుకూడా అతన్ని ఉడికిస్తూ మాట్లాడేది. పదేళ్ల క్రితం అతని తో వర్క్ చేసినప్పుడే ఎంతో సదభిప్రాయం కలిగింది అతని మీద. అలా ఇంప్రెస్స్ అయ్యే అప్పుడు అతని రేఖా చిత్రం వేసింది. నిజానికి అది తన కోసం వేసుకుంది.

తన బాధాతప్త జీవితంలో అతనితో వర్క్ చేసిన ఆ పదిరోజులు తనకు ఎంతో నచ్చిన క్షణాలు. మామూలుగా బ్యాంక్లో కానీ, ఇంకే ఆర్గనైసేషన్ లో కానీ ఆడవారు పొరపాటున కొంచెం గీత దాటి మాట్లాడితే కొంతమంది మగవారు ఛాన్స్ తీసుకునే అవకాశం ఉంది. కానీ కృష్ణకుమార్ గురించి తరువాత కూడా గమనిస్తూ ఉండేది. అతని గురించి తమ బ్యాంకు లో మంచి పేరే గాని ఎక్కడా రిమార్క్స్ లేవు. అతను తమ బ్యాంకు మ్యాగజిన్ లో రాసే రచనలు కూడా ఎంతో స్ఫూర్తిని కలిగించేట్లు ఉండేవి. అలా కృష్ణకుమార్ పై ఒక తెలియని అనురాగం పెంచుకుంది తన మనసులో. అది కేవలం తనలోనే దాచుకుంది. ఎప్పుడూ ఎక్కడా ఎవరితోనూ బయటపెట్టలేదు. ఇన్నాళ్లకు ఆ మంచితనం తనకు తోడుగా నిలబడి తన జీవితాన్ని ఒక నిప్పుల కొలిమిలోనుంచి బయటపడేసే ప్రయత్నం చేస్తోంది. అందుకు అతనిపై తన కున్న ఆ మంచి అభిప్రాయం ఇంకా పెరిగి పెరిగి కొండంతయ్యింది.

కృష్ణకుమార్ అప్రయత్నంగా ఎదురుగా మాట్లాడుతున్న భార్యనీ, విద్యావతినీ పక్క పక్కనే చూస్తే ఒకరిని మించి ఒకరు పోటీ పడుతున్నట్లు కనిపించింది అతనికి. అందం, చదువు, ధైర్యం అన్నీ ఉన్నాయి ఇద్దరిలో

అనుకున్నాడు. కవి గారు అన్నట్లు 'అందం యొక్క విషయం ఎప్పటికీ ఆనందం' అని, ప్రకృతి, ఆడవారు, సృష్టి లోని ప్రతి అంశం అందంగా ఉన్నప్పుడు అది మనసుకు ఎల్లప్పుడూ ఆనందం కలిగిస్తుంది.

చూసేందుకు రేణుక కొంచెం బొద్దుగా ఉంటుంది. విద్యావతి వయసులో రేణుక కంటే పెద్దదైనా సన్నగా రివటలాగా చిన్న వయసుగా కనపడుతుంది. అందులోనూ విపరీతమైన ఆమె చలాకీతనం చూపరులను యిట్టె ఆకట్టుకుంది. ఆమెలో ఏదో తెలియని అందం దాగుంది. అది కేవలం బాహ్య సౌందర్యమే కాదు, ఆ మాట తీరు, ఆ నవ్వు అలా ఒకటేమిటి కవి వర్ణించగలిగితే తనపై చక్కటి కావ్యమే రాయగలడు అనుకున్నాడు. ఆమెపై నుంచి దృష్టి మరల్చాలంటే మనసుకు కూడా పెద్ద సాహసమే. అది మామూలు విషయం కాదు. అలా అనుకున్నపుడల్లా తన మనసును బలవంతంగా బ్యాంకు వైపు కు మరల్చటం కృష్ణకుమార్ కి అలవాటైపోయింది.

అన్నం పెట్టె బ్యాంకు అంటే అతనికి మొదటినుంచి తల్లితో సమానం. అతని దృష్టిలో తన బ్యాంకు చాలా గొప్పది. తన ఫామిలీ ఈ రోజు ఇలా ఉందంటే దానికంతటికీ కారణం తనకు ఉద్యోగమిచ్చిన బ్యాంకు.

రేణు, విద్యావతి ఇంకా కబుర్లు చెప్పుకుంటున్నారు.

రేణూ ! ఆల్రెడీ మూడు గంటలు దాటిందిరా. ఇక అందరం పడుకుందాం అన్నాడు కృష్ణ కుమార్.

సరే అని లేచారు అందరూ.

రేణు, విద్యావతి గెస్ట్ బెడ్ రూమ్ లోకి దారి తీశారు.

ఇక మాటలు ఆపి పడుకోండి అని హెచ్చరించి కృష్ణకుమార్ తన బెడ్ రూమ్ లోకి వెళ్ళాడు.

మోహిత్ రూమ్ లో లైట్ లేదు. అప్పుడే నిద్రలోకి జారుకున్నట్లున్నాడు.

***

పొద్దున్న లెచేప్పటికీ తొమ్మిదయ్యింది. కృష్ణకుమార్ టైం చూసి ఉలిక్కిపడ్డాడు.

ఆమ్మో! తొమ్మిదయ్యింది అంటూ బాత్రూం లోకి పరుగు తీసాడు ఫ్రెష్ అప్ అయ్యి రెడీ అవడానికి.

బ్రష్ చేసుకుని హాల్ లోకి వచ్చాడు. రేణుక కాఫీ ఇచ్చింది.

తను లేచిందా అని అడిగాడు.

విద్యావతి పొద్దున్నే ఏడుగంటలకు తమ ఇంటికి వెళ్ళిందండి. చెప్పాను ఉండమని తను వినలేదు అంది.

ఒకే లే అన్నాడు కృష్ణకుమార్.

వాట్సాప్ లో విద్యావతి కి మెసేజ్ ఇచ్చాడు. లీవ్ పెట్టి రెస్ట్ తీసుకోండి ఇవాళ్టికి. లాయర్ కిరణ్ ని రేపు రమ్మంటాను అని.

ఇమ్మీడియేట్ రిప్లై ఇచ్చింది తన నుంచి . లేదు సర్. నేను ఒకే . బ్యాంకు కు వస్తున్నాను. ఒక గంట లేట్ పర్మిషన్ కావాలి అంది.

రెస్ట్ తీసుకుని మెల్లగా లంచ్ టైం కి రండి అని మెసేజ్ ఇచ్చాడు.

థాంక్యూ అని రిప్లై ఇచ్చింది.

చక చక రెడీ అయ్యి టిఫిన్ చేసి బ్యాంకు కు బయలుదేరాడు. కళ్ళు బాగా మండుతున్నాయి. నిద్ర సరిపోలేదు. అయినా తప్పదు. ఇవాళ కొన్ని ఇంపార్టెంట్ వర్క్స్ ఉన్నాయి అని బయలుదేరాడు. రేణు కు చెప్పాడు లంచ్ అక్కడేదన్నా తింటాను నువ్వు హైరానా పడొద్దు అని.

దారిలోనే కిరణ్ కి మెస్సేజ్ ఇచ్చాడు నాలుగు గంటలకు బ్యాంకు కు రమ్మని.

ఆరోజు శుక్రవారం. బాగా బిజీ గా ఉంది బ్రాంచ్. శనివారం, ఆదివారం సెలవు కాబట్టి జనంతో కిటకిటలాడుతోంది.

తను కేబిన్ లోకి వెళ్ళగానే కొంతమంది కస్టమర్స్ తన వెనకాలే వచ్చారు.

అందరితోనూ మాట్లాడుతూ ఉంటే జోనల్ మేనేజర్ నుంచి ఫోన్ వచ్చింది. సోమవారంనుంచి మూడు రోజులు బెంగళూరు లో కన్సార్టియం మీటింగ్. కృష్ణకుమార్ ని అటెండ్ అవ్వమని చెప్పాడు. అసిస్టెన్స్ కోసం విద్యావతి ని కూడా తీసుకెళ్లమన్నాడు . హెడ్ ఆఫీస్ నుంచి ప్రెషర్ ఉందట ఇంకో వంద కోట్ల లోన్ కోసం.

సరే అన్నాడు. బాగా బిజీ గా ఉండటంతో టైం తెలీలేదు. అప్పుడే లంచ్ టైం అయ్యింది. క్యాబిన్లో కస్టమర్స్ వెళ్లిపోయారు. ఏదైనా టిఫిన్ చెపుదాం అనుకునేంతలో విద్యావతి వచ్చింది కేబిన్ లోకి.

ఏంటి టిఫిన్ ఆర్డర్ చేస్తున్నారా అంది.

అవును మీకు ఎలా తెలుసు అన్నాడు ఆశ్చర్యంగా.

రోజు తెచ్చే మీ కారేజ్ బాగ్ లేదుగా ఇక్కడ అంది ఆమాత్రం కనిపెట్టలేనా అన్నట్లు పోజ్ పెట్టి.

ఓహ్ అదా అవును. మీకు కూడా ఏమన్నా చెప్పమంటారా అన్నాడు.

ఏమీ అక్కరలేదు. ఇద్దరికీ తీసుకొచ్చాను మీ ఫేవరిట్ ఉప్మా, దోస అంది తన బాగ్ టేబుల్ పై పెడుతూ.

థాంక్యూ. కూర్చోండి అంటూ జోనల్ మేనేజర్ ఫోన్ విషయం చెప్పాడు. బెంగళూరు లో మీటింగ్ సంగతి చెప్పాడు. మీకు ఇబ్బంది అయితే వేరే ఎవరినన్నా తీసుకువెళతాను అన్నాడు.

నాకు ఇబ్బంది ఏమీ లేదు. నేను వస్తాను అంది.

మూడు రోజులు మేడం, ఫరవాలేదా అని చెప్పాడు.

ఫరవాలేదు. మీరూ ఉంటారుగా పక్కనే అంది నవ్వుతూ .

సరే అయితే, ట్రావెల్స్ వాళ్లకి చెప్పి సండే ఈవెనింగ్ ఫ్లైట్ బుక్ చెయ్యమంటాను. సోమవారం పొద్దున్నే మీటింగ్ కి అటెండ్ కావొచ్చు. అయినా మూడు రోజులెందుకు మీటింగ్ అంటూ ఆశ్చర్యం వెలిబుచ్చాడు.

సార్ నాకు ఫ్లైట్ ఎలిజిబిలిటీ లేదు అంది విద్యావతి.

నేను జోనల్ ఆఫీస్ పర్మిషన్ తీసుకుంటాను లెండి. అదేం ప్రాబ్లెమ్ కాదు అని జోనల్ ఆఫీస్ కి ఫోన్ చేసాడు పర్మిషన్ కోసం . వాళ్ళు పర్మిట్ చేశారు. ఫైవ్ స్టార్

హోటల్ లో మీటింగ్, అక్కడే వసతి కూడా అని మెయిల్ ఇచ్చారు జోనల్ ఆఫీస్ వాళ్ళు. టు రూమ్స్ బుక్ చేశారు.

ముందు టిఫిన్ తినండి. చల్లారి పోతుంది అంది విద్యావతి.

ఓహ్ అంటూ చేతులు కడుక్కుని వచ్చాడు.

రెండు ప్లేట్స్ లో ఇద్దరికీ వడ్డించింది.

నోట్లో పెట్టుకుని ఓహ్ అమృతం అన్నాడు.

అంతొద్దు లెండి. రేణుక గారి కంటే నేనేమీ ఎక్స్పర్ట్ కాదు అంది.

చాలా బాగున్నాయి. అతిశయోక్తి కాదు అన్నాడు

అయితే థాంక్యూ అంది.

రేణుక కు ఫోన్ చేసాడు. బెంగళూరు ట్రిప్ గురించి చెప్పి మూడు రోజులు వీలవుతుందా తనతో వచ్చేందుకు అని అడిగాడు.

అమ్మో ! మోహిత్ ని వదిలిపెట్టి రాను అని ఖచ్చితంగా చెప్పింది రేణుక.

ట్రావెల్స్ వాడికి ఫోన్ చేసి ఫ్లైట్ టికెట్స్ బుక్ చేయమని చెప్పాడు. తనది, విద్యావతిది వివరాలు చెప్పాడు.

కిరణ్ వస్తున్నాడు. వాడు చెప్పిన డాక్యుమెంట్స్ తెచ్చారా అని అడిగాడు.

ఎస్ సర్ అంటూ బాగ్ లోనుంచి తీసింది. అన్నీ ఒక ఫోల్డర్ లో చక్కగా పెట్టున్నాయి.

ఆ డాక్యుమెంట్స్ తీసుకుని చూసాడు కృష్ణకుమార్. ఒక దాని మీద డేట్ అఫ్ బర్త్ ఉంది. తనకంటే ఒక సంవత్సరం చిన్న విద్యావతి . బర్త్ డేట్ చూసాడు. ఇంకో మూడు రోజులలో ఆమె  బర్త్ డే, అంటే బుధవారం అన్నమాట. ఆ రోజు తాము బెంగళూరు లో ఉంటారు . ఓహ్ అయితే తన బర్త్ డే బెంగళూరు లో సెలెబ్రేట్ చెయ్యాలన్నమాట. అవేమీ అంత చూడనట్లు నటించి టేబుల్ పైన పెట్టాడు.

కిరణ్ వచ్చాడు హాయ్ రా అంటూ.

కిరణ్, విద్యావతి ఇద్దరికీ పరస్పరం పరిచయం చేసాడు కృష్ణకుమార్.

విద్యావతి ఇచ్చిన ఫోల్డర్ కిరణ్ కి ఇచ్చాడు చూడమని.

కిరణ్ అన్నీ వెరిఫై చేసాడు. తను ఇచ్చిన లిస్ట్ ప్రకారం అన్నీ ఉన్నాయి అందులో.

గుడ్ అంటూ తను తెచ్చిన పేపర్స్ బయటికి తీసాడు. వాటిలో కొన్నిటి మీద సంతకం తీసుకున్నాడు.

మెమొరాండం అఫ్ డివోర్స్ డీడ్ కూడా ప్రింట్ చేసి తెచ్చాడు. అందులో శాస్త్రి , విద్యావతి ఇద్దరి సంతకాలు కావాలి. డివోర్స్ మంజూరు అయ్యేంతవరకూ వాళ్ళు ఆ నిబంధనలకు కట్టుబడి ఉండాలి. ఎవ్వరూ వెనక్కి వెళ్ళకూడదు. అందుకోసం ఆ డీడ్. దాని మీద విద్యావతి సంతకం తీసుకున్నాడు. ఎలాగూ శాస్త్రి తన ఆఫీస్ కి వచ్చినప్పుడు అతని సంతకం దానిమీద తీసుకుంటానని చెప్పాడు. విట్నెస్ గా కృష్ణకుమార్ సంతకం తీసుకున్నాడు. ఇంకొక విట్నెస్ తన ఆఫీస్ లో చేయిస్తానన్నాడు.

ఈలోగా వేడి వేడి కాఫీలు, స్నాక్స్ వచ్చాయి.

కృష్ణకుమార్ ని బాగా మెచ్చుకున్నాడు కిరణ్. భలే మేనేజ్ చేసావుట కదరా ఆ రోజు . ఇన్స్పెక్టర్ అన్ని విషయాలు చెప్పాడు నాకు. సార్ ! అక్కడికి మీడియా కూడా వచ్చింది. మీ ఫ్రెండ్ వాళ్ళని చాకచక్యంగా మేనేజ్ చేసి పంపాడు అని చెప్పాడు. ప్రౌడ్ అఫ్ యు రా కృష్ణ అని భుజం తట్టాడు కిరణ్.

విద్యావతి వైపు తిరిగి వీడు చిన్నప్పటినుంచి ఇంతే మేడం. ఎవరికన్నా సహాయం అంటే ముందుంటాడు. దానివల్ల ఎంత రిస్క్ అన్నా భయపడడు. మా స్నేహ బృందంలో వీడు జెమ్ అన్నాడు కిరణ్, కృష్ణకుమార్ ని మెచ్చుకుంటూ .

ఒరేయ్ ఆపరా. ఏదో నాకు తోచింది నేను చేస్తాను. అంతే కదా. దాంట్లో అంత పొగిడేదానికేముంది అన్నాడు సిగ్గుపడుతూ కృష్ణకుమార్.

అన్నీ ఒక మారు వెరిఫై చేసుకుని సరేరా నేను బయలుదేరుతాను. పిటిషన్ వచ్చే వారంలో ఫామిలీ కోర్ట్ లో ఫైల్ చేస్తాను. అప్పుడు మేడం ఒక సారి రావాలి అన్నాడు కిరణ్.

మీరు ఎప్పుడు చెప్తే అప్పుడు కోర్ట్ కి వస్తాను సర్ అంది విద్యావతి.

మీకు ఎక్కువ ఇబ్బంది ఉండదండి. రెండే రెండు సార్లు కోర్ట్ కి అటెండ్ అయితే చాలు అన్నాడు కిరణ్.

తప్పకుండా సర్ అంది.

మేడం ! రేపు, ఎల్లుండి మనకు సెలవు. మీటింగ్ కు సంబంధించి ఇవాళే మీరు స్టేట్మెంట్స్, ఇన్ఫర్మేషన్ రెడీ చేసి నాకు ఫైల్ ఇస్తే ఒకమారు నేను ఇంట్లో స్టడీ చేస్తాను. సండే సాయంత్రం నాలుగు గంటలకు ఫ్లైట్. మీరు రెడీ గా ఉంటె రెండు గంటలకు మీ ఇంటికి వచ్చి పిక్ అప్ చేసుకుంటాను అన్నాడు.

సరే సర్ అంటూ లేచింది విద్యావతి. సార్ మీరు లేచి ఇటు నిలబడతారా అంది.

ఎందుకు అన్నాడు కృష్ణకుమార్.

ఒక్క మారు రండి అంది.

కృష్ణకుమార్ లేచి టేబుల్ పక్కగా నిలుచున్నాడు ఎందుకా అనుకుంటూ.

విద్యావతి పాదాలు తాకబోయింది.

వెనక్కి జరిగాడు కృష్ణకుమార్. ఏంటి మేడం ఇదంతా. నాకు ఇలాంటివి అస్సలు నచ్చదు అన్నాడు. అయినా ఎందుకు ఇంత ఎమోషన్ మీరు అన్నాడు ఇబ్బంది పడుతూ .

ఫస్ట్ టైం నా జీవితంలో ఒక పెద్ద పరిష్కారం మీ వల్ల జరిగింది సర్. అందుకు మీకు ఎంతో రుణపడి ఉంటాను అంది.

అబ్బా ఏంటి మేడం మీరు కూడా. ఇంత చిన్న విషయానికి అంత పెద్ద మాటలు మాట్లాడుతారు.

ఇది మీకు విడమరచి చెప్పలేను సర్. అంత నరకం అనుభవించాను నేను ఇన్నేళ్లు. ఇప్పుడు ఒక్క వారంలో అదీ మీ వల్ల నాకు ఉపశమనం కలగబోతోంది. అది పెద్ద అదృష్టం నాకు అని రెండు చేతులు జోడించింది మర్యాదపూర్వకంగా.

***

నెలలో రెండు, నాలుగు శనివారాలు బ్యాంకులకు సెలవు కావడంతో ఆరోజు శనివారం చాలా పనులు పెట్టుకున్నాడు కృష్ణకుమార్.

ఇవాళ ఎక్కడికైనా వెళదామా రేణూ అన్నాడు పొద్దున్నే కాఫీ తాగుతూ.

మోహిత్ కి లాస్ట్ సెమిస్టర్ దగ్గరలో ఉందిగా. వాడు బాగా బిజీ. వాడితో నేను ఉండాలి అందుకే నేను బిజీ అంది నవ్వుతూ.

సరీ పోయింది. నీకోసం నేను ముంబై నుంచి హైదరాబాద్ ట్రాన్స్ఫర్ చేయించుకుంటే నీ అపాయింట్మెంట్ దొరకటం లేదు నాకు. ఇలా అయితే నేను ముంబై వెళ్ళిపోతా అన్నాడు సరదాగా.

వెళ్ళొద్దులెండి. రెండు నెలలు ఓపిక పడితే వాడి ఎగ్జామ్స్ అవుతాయి. అప్పుడు మీరు ఎక్కడికంటే నేను అక్కడికొస్తా. సరేనా అంది అతని కళ్ళల్లోకి చూస్తూ.

ఓకే మేడం. మీరు ఎలా చెప్తే అలా. అవును నువ్వు నాతో బెంగళూరు రావొచ్చుకదా. వాడు మూడు రోజులు సర్దుకుంటాడులే. లేకుంటే మా ఫ్రెండ్స్ ఇళ్లలో ఎక్కడో ఒకచోట ఉంచుతాను అన్నాడు.

అబ్బా కుదరదండీ. ఒక్క రెండు నెలలు ఓపిక పట్టండి మహాప్రభో అంటూ రెండు చేతులు జోడించింది.

సరే సరే అన్నాడు.

మీరు ఇవాళ నాకు రెండు గంటలు టైం ఇవ్వాలి అంది రేణుక టిఫిన్ పెడుతూ.

ఎందుకో. అమ్మాయిగారికి మూడ్ వచ్చిందా అన్నాడు నవ్వుతూ.

అబ్బా. అందుకు కాదులెండి. నేను మొదలెట్టబోయే నవల థీమ్ గురించి మీతో డిస్కస్ చెయ్యాలి అంది.

ఎప్పుడు కూచుందాం అన్నాడు

మీరు ఇప్పుడు ఫ్రీ అంటే ఇప్పుడే అంది.

ఓకే డన్. హాల్లో కూర్చుందామా అన్నాడు.

ఓకే అంటూ పేపర్స్ తెచ్చుకుంది రేణుక.

మొదలు పెట్టు. నువ్వు అంతా ఎక్స్ప్లెయిన్ చెయ్యి. నేను విని నా అభిప్రాయాలు చెప్తాను అన్నాడు.

రేణుక చెప్పడం మొదలు పెట్టింది. ఇది మిడిల్ ఏజ్ ట్రయాంగల్ లవ్ స్టోరీ అండి అంటూ చెప్తోంది. అది సొంతం వింటుంటే అందులో పాత్రలు తను, రేణు, విద్యావతిని ప్రతిబింబిస్తున్నాయి. ఒక గంట సేపు ఏకబిగిన చెప్పింది. ఇప్పుడు చెప్పండి భర్త భార్య ను వదిలేసి ప్రియురాలిని చేసుకుంటాడా, లేక భార్యే తనకు

ముఖ్యమని ఆమెతోనే జీవిస్తాడా. ఇక్కడ అందరికి పిల్లలు కూడా ఉన్నారు అంది. ఒక వెరైటీ గా రాద్దామని ప్రయత్నం. ఎలా ముగింపు చెప్తే పాఠకులు ఎలా రిసీవ్ చేసుకుంటారో అని సంశయం నాకు అంది.

రేణూ, నవల కోసం అయితే ఎలా అయినా వ్రాయి నీ ఇష్టం. నా ఒపీనియన్ అయితే మన హిందూ సంస్కృతి ప్రకారం భర్త భార్యల బంధం విడదీయరానిది. నేను దానికే ఎక్కువ విలువ ఇస్తాను. ఎంత వెస్ట్రన్ కల్చర్ మనం చూస్తున్నా నాకెందుకో మన సంస్కృతే గొప్పది అని నమ్మకం. యుక్త వయసులో బాహ్య కోరికలుంటాయి. అప్పుడు ప్రేమలో పడటం అది సహజం. కానీ ఒకసారి పెళ్ళైన తరువాత పక్క చూపులు చూడటం అంటే ఎందుకో నాకు నచ్చని పని. నువ్వు నీ నవలలో ఎన్ని మలుపులు తిప్పినా చివరకు పెళ్లి బంధం గొప్పది అన్న విషయాన్ని నిరూపించు. అలా కాదు ప్రేమబంధం గొప్పది అని ప్రియురాలితో కలిపితే అది ఎందుకో నాకైతే నచ్చలేదు. మరి పాఠకులు ఎలా రియాక్ట్ అవుతారో నాకు తెలీదు. అది నీవు చెప్పే తీరు, తర్కాన్ని బట్టి ఉంటుంది. ప్రయత్నించి చూడు. నా దృష్టిలో అయితే బంధాలు గొప్పవి. అవి జీవితాంతం పెనవేసుకుని ఉంటాయి. మనం ప్రపంచంలో ఎక్కడ తిరిగినా మనకంటూ ఒక ఇల్లు, ఇల్లాలు,

పిల్లలు ఉంటె అది జీవితాన్ని సఫలం చేస్తుంది అంటూ తన వాదన వినిపించాడు కృష్ణకుమార్.

ఓహ్ మీ వాదన చాలా బాగుంది. ఆలోచిస్తాను. మీరు బెంగుళూరు నుంచి వచ్చిన తరువాత నా నిర్ణయాన్ని చెప్తాను అంది.

వెబ్ సిరీస్ వాళ్ళు నీ నవలను సీరియల్ గా తీయడం ఎంత వరకు వచ్చింది అని అడిగాడు.

నా నవల వాళ్లకు బాగా నచ్చింది. కమర్షియల్స్ గురించి డిస్కస్ చేస్తామని చెప్పారు.

ఓహ్ గుడ్. చాలా ప్రొఫెషనల్ గా మారావు నీవు. వెరీ నైస్ అని మెచ్చుకున్నాడు.

ఎదో ఒకటి ఇంట్లో నే ఉంటాను కదా నేను. నాకు కాలక్షేపం కావాలి కదా అంది.

ఈ మధ్య చాలా వెబ్సైట్ వచ్చాయండి. అవి కొన్ని భాషల్లో ఆన్లైన్ లో రచనలను పబ్లిష్ చేస్తున్నాయి. ఫ్రీ గా నే అనుకోండి. చాలా మంది రాస్తుంటారు వాటిల్లో. రాయడం ఫ్రీ నే. చదవడం ఫ్రీ నే. పాఠకులు కూడా ఎక్కువే ఉంటారు. కొంతమంది రచయితలూ రచయిత్రుల రచనలు సీరియల్స్ కు, కథలకు వాటిల్లో

బాగా డిమాండ్ ఉంది. పాఠకులు ఎక్కువ మంది చదువుతూ ఉంటారు వాళ్ళ రచనలను. అంతే కాకుండా రేటింగ్ సిస్టం, సమీక్షలు రాయడం వంటివి కూడా ఉన్నాయి. ఇది నా ఫ్రెండ్ మల్లేశ్వరి చెప్తే తెలిసింది. నేనూ రాద్దామని అనుకుంటున్నా. అందులోనే రైటింగ్ పాడ్ ఉంటుందట. ఇంగ్లీష్ లో టైపు చేస్తుంటే మనం సెలెక్ట్ చేసిన లాంగ్వేజ్ లో కన్వర్ట్ చేస్తుందట. చూడాలి. నా ఫ్రెండ్ ఇంకోటి కూడా చెప్పింది. ఎవరో పర బాషా రచయిత తెలుగు మీద ద్వేషంతో తన రచనలకి కావాలని  అన్ని రచనలకు రేటింగ్ 'ఒక' మార్క్ వేస్తున్నాడట. దాంతో తెలుగు వారు బాగుంది అని రేటింగ్ 'ఐదు' వేసినా అది నాలుగు కి పడిపోతుంది. అలాంటి మూర్ఖులు, పోకిరీలు కూడా ఉన్నారు ఇటువంటి వెబ్సైట్ లో. మా ఫ్రెండ్ చాకచక్యంగా వాళ్ళను ఐడెంటిఫై చేసి వెబ్సైట్ మేనేజ్ చేసేవాళ్లకు చెప్పిందట వాళ్ళ మీద యాక్షన్ తీసుకోమని. లేకుంటే వాళ్ళు అందరిని ఇబ్బంది పెడతారు ముఖ్యంగా ఆడవాళ్లను అల్లరిచేసేందుకు ఇదొక మార్గం. రచయిత్రులు ఎంతో కష్టపడి తమకు మిగిలే కొద్దీ టైం లో అందరినీ ఆహ్లాదపరచాలని రచనలు చేస్తుంటారు. సమాజానికి ఉపయోగపడే మంచి సీరియల్స్ రాస్తుంటారు. వారి వారి రచనా శక్తిని బట్టి వారి రచనలు ఉంటాయి. అందరూ ఆదిలోనే గొప్ప

రచయిత్రి అనిపించుకోలేరు కదా. మెచ్చుకోనక్కర్లేదు కనీసం కష్టపెట్టకుంటే అదే పదివేలు. ముఖ్యంగా రచయిత్రులను అణగదొక్కేందుకు ఇలాంటి పోకిరీలు ఫేక్ ప్రొఫైల్స్ చాటున రకరకాల నీచపు పనులు చేస్తుంటారు. అవి రచయిత్రులకు ఎంతో మనోవ్యధ కలగచేస్తుంటాయి. బాగుంటే చదివి రేటింగ్ ఇవ్వండి. అసలు చదవకుండానే కావాలని ఇలాంటి వెధవ పనులు చేసేవారికి తగిన బుద్ధి చెప్పాలి అని చెప్పింది మా ఫ్రెండ్. ఏంచేద్దాం. అలా ఉంది లోకం తీరు. అందుకే నేను మల్లేశ్వరి కి చెప్పాను. పొరపాటున కూడా తన ప్రొఫైల్ లో మెయిల్ అడ్రస్, ఫోన్ నెంబర్, అడ్రస్ లాంటివి ఇవ్వొద్దని. అలాంటి మూర్ఖులు ఇవన్నీ చూసి ఆడవాళ్లు కదా అని ఇంకేమన్నా నీచపు పనులకు పాల్పడవచ్చు . రచయిత్రులకు అది మరీ డేంజర్ కూడా అంటూ చెప్తోంది రేణుక. అలాంటి పోకిరీలు, వెధవలు వలన రచయిత్రులు ఇలాంటి వెబ్సైట్ లో రాసేందుకు కూడా భయపడతారు ముమ్ముందు అంది.

ఓహ్ ఇంత రీసెర్చ్ చేస్తున్నావా నీ రచనల కోసం అంటూ ఆశ్చర్యంగా అడిగాడు కృష్ణకుమార్. అలాంటి పోకిరీలు, వెధవలను వదిలిపెట్టకండి. వాళ్ళ ప్రొఫైల్స్

తీసుకుని పోలీస్ వారి చేత భరతం పట్టిస్తే సరి. ఇంకెవ్వరి జోలికి రారు. అప్పుడు తిక్క కుదురుతుంది అలాంటి వెధవలకి అన్నాడు కోపంగా కృష్ణకుమార్.

అవునండి. మీరు చెప్పింది ముమ్మాటికీ కరెక్ట్ . అందుకే నేను మా రచయిత్రి ఫ్రెండ్స్ తో ఎప్పుడూ టచ్ లో ఉంటాను. వాళ్ళు ఇలాంటి ముఖ్యమైన విషయాలు చెప్తుంటారు. రచయిత్రులం కదా మమ్మల్ని మేము కాపాడుకోవాలికదా అంది ఆరిందాలా.

సూపర్బ్ రా రేణూ. టైం ని చక్కగా ఉపయోగిస్తున్నావు, కొత్త కొత్త విషయాలు తెలుసుకుంటున్నావు అని మెచ్చుకున్నాడు. అది సరే కానీ నీకు చెప్పానుగా రేపు బెంగళూరు కి విద్యావతి కూడా వస్తోంది. తను మా బ్రాంచ్ లో ఆ లోన్ చూస్తోంది కాబట్టి తనని కూడా తీసుకెళ్లామన్నారు జోనల్ మేనేజర్ సహాయంగా ఉంటుందని. నేను ఆవిడకు చెప్పాను తనకి ఇబ్బంది అయితే ఇంకెవరినైనా తీసుకు వెళతానని. ఫరవాలేదు వస్తాను అంది. అక్కడ ఫైవ్ స్టార్ హోటల్ లో మీటింగ్ మరియు వసతి ఏర్పాటు చేశారు అని చెప్పాడు. రేపు సాయంత్రం నాలుగు గంటలకు ఫ్లైట్. రెండు గంటలకు నేను తనని ఇంటిదగ్గర పిక్ అప్

చేసుకుని ఎయిర్పోర్ట్ కి వెళతాను. మళ్ళీ బుధవారం సాయంత్రం ఆరుగంటల ఫ్లైట్ కి బయలుదేరి ఏడుగంటలకు హైదరాబాద్ లో ఉంటాను అన్నాడు.

అలా అయితే తనని రేపు పొద్దున్నే ఇక్కడికి రమ్మని చెప్తాను. లంచ్ చేసుకుని ఇటునుంచి డైరెక్ట్ గా ఎయిర్పోర్ట్ కి వెళ్లొచ్చు అంది రేణుక.

వాళ్ళ సిస్టర్ కూడా పైన ఉంటుంది రేణూ. పిలిచేటట్లుంటే ఇద్దరినీ పిలువు అన్నాడు.

ఓకే. తన నెంబర్ నా దగ్గర ఉంది. ఇప్పుడే వాట్సాప్ మెస్సేజ్ ఇస్తాను అంది.

ఓకే అన్నాడు కృష్ణకుమార్.

***

హైదరాబాద్ లో ఉన్నాడంటే కృష్ణకుమార్ ఇంట్లో ఉండే టైం చాలా తక్కువ. అతనికి ఫ్రెండ్స్ సర్కిల్ ఎక్కువ ఉంది. అటు చిన్నప్పటి ఫ్రెండ్స్, కాలేజీ ఫ్రెండ్స్, బ్యాంకు లో చేరిన తరువాత స్టాఫ్ ఇలా చాలా మంది హైదరాబాద్ లో నే ఉండేవాళ్లున్నారు. వీళ్లందరినీ కలుపుతూ బోలెడన్ని సాంఘిక కార్యక్రమాలు, సంఘ సేవ చేస్తుంటాడు. ఆర్ఫనేజ్ కి చందాలు, వస్తువులు కలెక్ట్ చెయ్యడం, వృద్ధాశ్రమాలకు ఇతోధికంగా హెల్ప్ చెయ్యడం ఇలాంటి పనులు చాలా ఇష్టంగా

చేస్తుంటాడు. అతని స్నేహితులు కృష్ణకుమార్ ని లైఫ్ వైర్ అని పిలుస్తారు. ఎప్పుడూ ఎదో ఒక మంచి పని చేస్తూ ఉండడం అతని నైజం. తమ బ్యాంకు కు కూడా ఎంతోమంది కస్టమర్స్ ని తీసుకొచ్చాడు. బిజినెస్ బాగా డెవలప్ చేసినందువల్ల పైవారిదగ్గర కూడా మంచి గుర్తింపు ఉంది.

రేణూ ఇంట్లో పనితో బిజీ అనడం తో శనివారం బయటే బిజీగా గడిపి రాత్రి తొమ్మిదింటికొచ్చాడు ఇంటికి.

వస్తూనే రేణుక చెప్పింది. ఆదివారం వచ్చేందుకు విద్యావతిని బలవంతంగా ఒప్పించినట్లు. ఆమె అక్క బయటికి ఎవరిళ్ళకు రాదు అని చెప్పింది.

ఓకే లే అన్నాడు కృష్ణకుమార్.

***

ఆదివారం పదకొండింటికి కారు పంపించాడు విద్యావతిని తీసుకు వచ్చేందుకు.

మామూలుగా చీరలో చూసే విద్యావతి ఆ రోజు చుడీదార్ లో దర్శనమిచ్చింది.

లగ్గేజ్ ఏదీ అని అడిగాడు.

కారులోనే ఉంచాను. చిన్న సూట్కేసు కదా. కేబిన్ లగ్గేజ్ లో పెట్టొచ్చు అంది.

ఓహ్ గుడ్. నేను కేబిన్ లగేజ్ సూట్కేసు తెచ్చుకుంటాను, కన్వేయర్ దగ్గర వెయిట్ చెయ్యక్కర్లేదు అన్నాడు కృష్ణకుమార్.

రేణూ కి విద్యావతి బాగా ఫ్రెండ్ అయ్యింది. తనని చూడగానే రేణూ మొహం విప్పారింది.

ఇక ఇద్దరూ మామూలే. కబుర్లలో పడ్డారు. అక్క అంటూ రేణు, రేణూ అంటూ విద్య చక్కగా అక్కా చెల్లెళ్లలా మాట్లాడుకుంటున్నారు. రేణూ విద్య కంటే నాలుగేళ్లు చిన్నది. ఇద్దరూ బాగా కలిసిపోయారు. రేణు కి కూడా తను ఒక్కతే కూతురు కావడంతో తోబుట్టువులు ఎవరూ లేరు. ఇలా తన అనురాగాన్ని విద్య తో పంచుకుంటోంది అనుకున్నాడు.

ఏవో ఫోన్స్ వస్తుంటే అటెండ్ అవుతున్నాడు కృష్ణకుమార్.

సూట్ కేసు సర్దుతుంటే రేణూ ని పిలిచి చెప్పాడు విద్యావతి బర్త్ డే బుధవారం అని.

బీరువాలోనుంచి తను పండక్కి కొనుక్కున్నకొత్త చీర తీసి చూపించింది ఇది పెడతాను ఆవిడకి అని.

నీ ఇష్టం అన్నాడు.

కిచెన్ లో రేణూ, విద్య ఇద్దరూ మాట్లాడుతూనే వంటలన్నీ రెడీ చేశారు.

అందరి భోజనాలు అయ్యాయి.

విద్యావతి మోహిత్ తో చాలా సేపు మాట్లాడింది అన్నం తినేప్పుడు.

ఆమె డాటర్ ఫోన్ నెంబర్, మెయిల్ అడ్రస్ ఇచ్చింది. తన డాటర్ శ్రీష కూడా ఐ టి సబ్జెక్టు లోనే ఎం ఎస్ చదువుతోంది యూనివర్సిటీ అఫ్ సిన్సినాటి లో. మోహిత్ కూడా ఐ టి లోనే ఎం ఎస్ చదివేందుకు కొద్దీ రోజుల్లో అమెరికా కు వెళతాడు. శ్రీష బాగా గైడ్ చేస్తుంది అని చెప్పింది. తను హైదరాబాద్ ఎం జి ఐ టి లో బి టెక్ చేసింది. ఆ అమ్మాయి కూడా మొదటినుంచి రాంక్ స్టూడెంట్ అట.

టైం రెండు అయ్యింది. అప్పటికే వెబ్ చెక్ ఇన్ చేసాడు ఇద్దరి టికెట్స్.

అన్ని ఒకసారి చూసుకుని ఇక బయలుదేరేందుకు రెడీ అయ్యారు.

రేణుక విద్యావతిని సోఫా లో కూర్చోబెట్టి, బొట్టుపెట్టి చీర ఇచ్చింది.

ఇప్పుడు ఇవెందుకు రేణూ అంది విద్యావతి మొహమాటపడుతూ.

ఈ చీర బుధవారం కట్టుకో. అడ్వాన్స్ హ్యాపీ బర్త్ డే విషెస్ అక్కా అంది రేణు ఆమె నుదుటిన ముద్దు పెడుతూ.

నా బర్త్ డే నీ కెలా తెలుసు రేణూ అంది ఆశ్చర్యంగా.

ఆయన చెప్పారు ఇందాక అంది.

కృష్ణకుమార్ కి ఎలా తెలిసిందో అర్థమయ్యింది విద్యావతికి. చాలా సంతోషమేసింది ఆమెకు. చాలారోజుల తరువాత మళ్ళీ అనురాగం, ఆప్యాయతలు ఆమెను ఉక్కిరిబిక్కిరి చేశాయి. కళ్ళలో కొంచెం తడి మెరిసింది కూడా .

విద్యావతి జడలో మల్లెలు తురిమింది రేణు.

ఆంటీ అడ్వాన్స్ హ్యాపీ బర్త్ డే అంటూ ఫైవ్ స్టార్ చాకోలెట్స్ ఇచ్చాడు మోహిత్.

థాంక్స్ రా అంది విద్యావతి.

నేను బెంగుళూరు లో చెప్తాను అన్నాడు కృష్ణకుమార్ తననే చూస్తున్న విద్యావతి తో.

కళ్ళతోనే ఓకే అన్నట్లు నవ్వింది.

ఇద్దరూ లిఫ్ట్ లో దిగి కారు ఎక్కారు.

డ్రైవర్ రాముకు చెప్పాడు. బుధవారం సాయంత్రం ఎయిర్పోర్ట్ కి రావాలి అని.

సరే సర్ అన్నాడు.

వచ్చే హడావిడిలో బోర్డింగ్ పాస్ ప్రింట్ చేసి తీసుకురావడం మర్చిపోయాడు.

అబ్బా క్యూలో నిలుచోవాలి దానికోసం అనుకున్నాడు.

మేడం ఈ గేట్ వైపు వెళ్ళాలి మనం అన్నాడు కృష్ణకుమార్.

ఈ మూడు రోజులన్నా విద్య అని పిలవండి అంది అతని మొహంలోకి చూస్తూ.

లేకుంటే నేను మీతో రాను అని బెదిరిస్తున్నట్లుగా.

ఆ చూపులు తట్టుకోవడం చాలా కష్టం. దానికన్నా ఆమె చెప్పినట్లు విద్య అని పిలవడం మేలు అనుకున్నాడు.

సరే విద్య. ఇటు వెళ్ళాలి విద్య అని మాటి మాటికీ విద్య విద్య అంటున్నాడు కావాలని తనని ఉడికించాలని. అతనికి పరాయి స్త్రీలని అలా పేరు పెట్టి పిలవడం అస్సలు గిట్టదు. కాలేజీ ఫ్రెండ్స్ వరకు అమ్మాయిలను చక్కగా పేరు పెట్టి పిలిచేవాడు. బ్యాంకు లో చేరిన తరువాత తన పంథా మార్చుకున్నాడు. సంబోధన ఆఫిసియల్ గా ఉండేట్లు చూసుకుంటున్నాడు.

అన్నిసార్లు విద్య లు అనక్కర్లేదు. నేనేమీ నామ జపం చేయమనలేదు మిమ్మల్ని. మేడం బదులు విద్య అనండి చాలు అంది నవ్వుతూ.

సరే అన్నాడు.

లోపలికి వెళ్లేప్పుడు చిన్న రాంప్ వుంది. తను చూసుకోలేదు. తట్టుకోబోయింది.

గట్టిగా చెయ్యి పట్టుకున్నాడు పడుతుందేమోనని. చూసుకుని నడవండి అన్నాడు.

థాంక్స్. మీరు పక్కనే ఉన్నారుగా. అందుకే చూడట్లేదు అంది.

అబ్బా ఈ చిలిపి మాటలు, కొంటె చేష్టలు మూడు రోజులు భరించాలి అనుకున్నాడు మనసులో.

హైదరాబాద్ ఎయిర్పోర్ట్ ఎప్పుడూ క్రిక్కిరిసి ఉంటుంది. అందులోనూ మధ్యాన్నం జనాలు చాలా మందే ఉన్నారు. ఆదివారం కామోసు ఇంకా ఎక్కువమంది ఉన్నారు. బోర్డింగ్ పాస్ కోసం క్యూ లో నిలుచున్నారు. తన ముందు నిలుచున్న విద్య జడలో మల్లెపూలు గుప్పు గుప్పున తన ముక్కును తాకుతున్నాయి. తన పెర్ఫ్యూమ్ అతని చుట్టూ చక్కర్లు కొడుతోంది. ఈ క్యూలో ఇంకో పది నిముషాలు పట్టేట్లుంది.

విద్యా ! నీ జడలో పూలు పడేట్లు ఉన్నాయి అన్నాడు మెల్లగా ఆమె చెవి దగ్గర చెపుతున్నట్లు.

సర్ది పెట్టండి మీరే అంది.

అబ్బా అది కూడా నేనేనా.

ఏం సర్ది పెట్టొచ్చు గా మీరు. మీ స్నేహితురాలయితే ఆ మాత్రం చెయ్యరా. నేను కూడా మీ ఫ్రెండ్ అనుకోండి అంది.

సరే సరే అంటూ సర్ది పెట్టాడు. ఆమె మృదువైన వెంట్రుకలు చేతులకు తగలడం ఏదో అనిపించింది. అందుకే ఇటువంటి వాటికి తాను దూరంగా ఉంటాడు. కానీ ఈవిడ వదలట్లేదు. చుట్టూ చూసాడు. ఎవరైనా గమనించారేమోనని. అందరూ ఎవరి బిజీ లో వాళ్ళు ఉన్నారు. హమ్మయ్య అనుకున్నాడు.

బోర్డింగ్ పాస్ ప్రింట్ చేసి ఇస్తూ హ్యాపీ జర్నీ మిస్టర్ కె అండ్ మిసెస్ వి అని అంది కౌంటర్ ఎగ్జిక్యూటివ్.

ఇదేదో బాగుంది కదా అంది విద్య.

ఏంటి అన్నాడు.

మిస్టర్ కె అండ్ మిసెస్ వి. మీరు పూర్తిగా విద్య అనకుండా షార్ట్ కట్ వి అనొచ్చు.

నేను మిమ్మల్ని కె అనొచ్చు అంది నవ్వుతూ.

కృష్ణకుమార్ ఏమీ మాట్లాడలేదు.

కాస్త నవ్వండి బాబు మీ సొమ్మేం పోదు అంది.

సరే సరే నవ్వుతాను లే  అన్నాడు. పెద్దగా నవ్వబోయాడు.

వారిస్తూ, అంతొద్దు. కొంచెం నవ్వితే చాలు అంది.

సెక్యూరిటీ చెక్ పూర్తయ్యింది. సూట్ కేసు వీల్స్ మీద లాగుతూ మెల్లగా వెళుతున్నారు అటూ ఇటూ షాప్స్ చూసుకుంటూ. బోర్డింగ్ కి ఇంకా చాలా టైం ఉంది.

హాయ్ కృష్ణ అని ఓ ఆడ గొంతు వినిపించింది వెనుక నుంచి.

ఎవర్నీ నన్నేనా అని వెనక్కు తిరిగాడు కృష్ణకుమార్.

తన డిగ్రీ క్లాసుమేట్ శైలజ. ఆ రోజుల్లో కాలేజీ బ్యూటీ తను.

ఓహ్ ! హాయ్ శైలూ అన్నాడు ఆశ్చర్యంగా. నువ్వేంటి ఇలా ! ఎక్కడికి ప్రయాణం. చాల రోజులయ్యింది నిన్ను చూసి అన్నాడు.

ముంబై వెళుతున్నాను రా కృష్ణ. మా హస్బెండ్ లండన్ లో ఉంటారు. నీకు తెలుసుగా. ముంబై లో మా అత్తగారు వాళ్ళ ఇంట్లో ఒక వారం ఉండి అటు నుంచి లండన్ వెళతాను అంది.  నువ్వేంటి సర్ప్రైజ్. నిజమే మనం కలిసి చాల ఏళ్ళు అయ్యింది. ఫేస్బుక్ లో హాయ్ అనడమే కానీ డైరెక్ట్ మాటల్లేవు గా.

వాట్సాప్ లో నువ్వెక్కువ రెస్పాన్స్ ఇవ్వవు. అందుకే వదిలేసాను అంది కోపంగా. విద్య ని చూస్తూ నీ వైఫ్ రేణుక కదా. ఎప్పుడో పదేళ్లక్రితం ఒక ఫోటో లో మీ ఇద్దరినీ చూసాను. మళ్ళీ ఇప్పుడే చూడటం. నా కంటే అందంగా ఉందిరా. అందుకే అప్పుడు నన్ను పెళ్లి చేసుకోమంటే వద్దన్నావా ఇంత అందగత్తె నీకు దొరుకుతుందని ముందే తెలుసున్నమాట.

హోల్డ్ ఆన్ శైలూ. నీ మాటల స్పీడ్ లో ఏమీ మార్పు లేదు. ఈవిడ రేణూ కాదు శైలూ. మా కల్లీగ్ విద్యావతి. మేము బ్యాంకు మీటింగ్ ఉంటె బెంగళూరు వెళుతున్నాము అన్నాడు.

ఓహ్ సారీ రా, సారీ మేడం అంది నొచ్చుకుంటూ . ఇంకా టైం ఉందిగా రా కాసేపు కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం అంది శైలజ.

అందరూ కాఫీ హౌస్ లో కూర్చున్నారు. కృష్ణకుమార్ కాఫీలు తెచ్చేందుకు వెళ్ళాడు. సెల్ఫ్ సర్వీస్ కదా.

శైలజ కబుర్ల బుట్ట. నాన్ స్టాప్ గా వాగుతూ ఉంటుంది. ఎదుటివాళ్ళు కొత్త పాతా అనే తేడా ఉండదు. విద్య తో కబుర్లు మొదలుపెట్టింది. వీడు నేను డిగ్రీ క్లాసుమేట్స్ అండి. వీడు అని ఎందుకు అంటున్నానంటే కృష్ణ నాకంటే ఒక

సంవత్సరం చిన్న. మా క్లాస్ లో అందరికంటే చిన్న వీడు. అందరం వీడిని చీటికీ మాటికీ ఆట పట్టిస్తూ ఉండేవాళ్ళం. వీడికేమో చదువు తప్పితే ఇంకో ధ్యాస ఉండేది కాదు. అప్పుడు అందరం ఎంతో సరదాగా పేర్లు పెట్టి పిలుచుకుంటూ హ్యాపీగా ఉండేవాళ్ళం. ఎవ్వరూ పరిధులు దాటేవారు కాదు. కాలేజీ పోటీల్లో కృష్ణ మిస్టర్ హ్యాండ్సమ్ గా సెలెక్ట్ అయితే నేను మిస్ బ్యూటీ గా సెలెక్ట్ అయ్యాను. అప్పుడే కృష్ణ ని అడిగాను పెళ్లిచేసుకుందాంరా అని. పై చదువులు చదవాలి, మంచి ఉద్యోగం సంపాదించాలి అంటూ సాగదీసాడు. నాకు ఓపిక పోయి మా పేరెంట్స్ తెచ్చిన సంబంధం చేసుకున్నాను. కాలం మారినా తరాలు మారినా వీడి మైండ్ సెట్ మాత్రం మారదు. కడిగిన ముత్యం కృష్ణ. అందుకే ఎప్పటికీ మా అందరి గుండెల్లో వీడు ఫేవరెట్ స్టార్. మా బ్యాచ్ వాళ్ళం ఎవరు కలిసినా ముందు వీడి గురించే మాట్లాడుకుంటాం అంది శైలజ. కాలేజీ వార్షికోత్సవాలకి వరూధినీ ప్రవరాఖ్య నాటకం వేసాం. నేను వరూధిని, కృష్ణ ప్రవరాఖ్యుడు. ప్రవరాఖ్యుడి పాత్రలో వీడు జీవించేసాడు. నేను స్టేజి పైనే బుగ్గమీద ముద్దు పెడితే ఇక పరుగో పరుగు. మళ్ళీ పట్టుకు రావాల్సి వచ్చింది. ఆ దెబ్బకు జ్వరం వచ్చి వారం రోజులు లీవ్ పెట్టాడు అని పక పకా నవ్వుతూ చెప్తోంది శైలజ.

కృష్ణకుమార్ ఇటే చూస్తున్నాడు ఏమి మాట్లాడుతోందా ఈ శైలజ అని. అతనికి భయం. కాలేజీ లో జరిగిన ఇన్సిడెంట్స్ అన్నీ చెప్పేస్తుందేమో అని. అతను అనుకున్నట్లే అయ్యింది.

రా రా కృష్ణా. మన వరూధినీ ప్రవరాఖ్య నాటకం గురించి చెప్పేసాను విద్య కి అంది.

అబ్బా అని తలపట్టుకున్నాడు కృష్ణకుమార్.

చూసావా విద్యా నేను చెప్పలేదు. ఇప్పటికీ వీడింతే. మారడు కాక మారడు.

సరేలే తల్లీ నన్ను వదిలెయ్యి. నీ సంగతులు చెప్పు. ఎంతమంది పిల్లలు. ఏమి చేస్తున్నారు అన్నాడు.

ట్విన్స్. కొంచెం లేట్ గా ప్లాన్ చేసాము. ఇద్దరూ ఇప్పుడు ప్లస్ టు లో ఉన్నారు అంది. నీ సంగతేంటి అంది.

నాకు ఒకడే అబ్బాయి. బి టెక్ ఫైనల్ ఇయర్ లో ఉన్నాడు.

ఓహ్ నైస్ రా. నీవు మీ ఆవిడ లండన్ కి రండి. హాయిగా ఒక నెల రోజులు ఉందురుగాని. అందరం ఎంచక్కా ఎంజాయ్ చెయ్యొచ్చు అంది.

తప్పకుండా. ఈసారి హైదరాబాద్ వచ్చినప్పుడు మీ వాళ్ళింటికి వెళ్లకుండా డైరెక్ట్ గా మా ఇంటికే రావాలి నువ్వు అన్నాడు.

ఒకే రా బై. అనౌన్స్మెంట్ ఇచ్చారు. నేను వెళతాను అంది శైలజ.

ఒకే బై అని లేచాడు కృష్ణ కుమార్ తమ ఫ్లైట్ కి కూడా అనౌన్స్మెంట్ ఇవ్వడంతో.

విద్య కూడా అతనితో పాటే లేచింది.

***

కృష్ణ, విద్య డిపార్చర్ ఎంట్రన్స్ గేట్ వైపు దారితీశారు.

ఒక్క నిముషం ఆగండి అంది విద్య.

ఎందుకు అన్నాడు.

జస్ట్ ఒక సెల్ఫీ. ఇక్కడ బాక్గ్రౌండ్ చాలా బాగా ఉంది.

అవునూ. ఎయిర్పోర్ట్ కి వచ్చినప్పటి నుంచి గమనిస్తున్నాను. ఫొటోస్ క్లిక్ క్లిక్ మని పిస్తున్నావు. ఒక వంద తీసావా ఇప్పటికి అన్నాడు.

ఒక పది తక్కువుండొచ్చు అంది నవ్వుతూ. ఫోటోగ్రఫీ నా హాబీ. అందుకే అలా క్లిక్ మనిపిస్తుంటాను. ఇక్కడ క్యూ పెద్దదిగా ఉంది. ఎక్కువ టైం పడుతుందేమో. అందరిని వెళ్లనీనుండి. మనం కాసేపు కూర్చుని లాస్ట్ లో వెళదాం అంది.

యాస్ యూ ప్లీజ్ అని కూర్చున్నారు ఇద్దరూ.

మీ శైలు మీ గురించి ఎన్నో మంచి విషయాలు చెప్పింది. మీకు రామ్ కుమార్ అని పేరు పెట్టి ఉండాల్సింది అంది.

అలా ఎందుకు. కృష్ణకుమార్ పేరు బాగానే ఉందిగా. దానికేమయింది.

మరి మీకు అంతమంది గోపికలు లేరుగా. ఒక్కరంటే ఒక్కరేగా అంది ఉడికిస్తూ.

ఇదేమీ రాజుల కాలం కాదుగా. అంతమంది రాణులు ఉండటానికి. నా రేణూ నాకు పదివేలగోపికల తో సమానం. తనే నా జీవన సర్వస్వము అన్నాడు.

అదృష్టవంతురాలు రేణు అంది విద్య.

అలా ఏమీ లేదు విద్య. ఒక్కో జీవితం ఒక్కో విధంగా ఉంటుంది. వారం క్రితం వరకు మన మధ్య అంత చనువు లేదు. ఈ వారంలో బోలెడు సంఘటనలు జరిగాయి. ఒకరికొకరు సహాయం చేసుకుంటే ఎన్ని సమస్యలున్నా తీర్చొచ్చు. ఒక మంచి స్నేహితుడిగా నీకు అండగా నేను, నా కుటుంబం ఎప్పుడూ ఉంటాము. ఏదికావాలన్నా అడిగే స్వేచ్ఛ నీకుంది. హ్యాపీగా ఉండు. మా ఇల్లు ఎప్పుడు నీకు స్వాగతం పలుకుతూనే ఉంటుంది. పదేళ్ల క్రితం నేను నిన్ను మొదటిసారిగా చూసినప్పుడు ఎంతో థ్రిల్ అయ్యాను. అంతలా ఆకట్టుకున్నావు

నన్ను. కానీ ఆ భావన కేవలం అభిమానించే వరకే. అంతకు మించి ఒక్క అడుగు ముందుకు నేను వెయ్యలేను. నా సిద్ధాంతాలకు నేను ఎప్పుడూ కట్టు బడి ఉంటాను. కొందరికి అది చాదస్తం అనిపించవచ్చు. అయినా నేను లెక్క చెయ్యను. నేనింతే. ఇలానే ఉంటాను ఎప్పుడూ అన్నాడు.

థాంక్యూ . మీ మనసులో మాట చెప్పారు. మీ అభిమానం పొందిన నేను చాలా అదృష్టవంతురాలిని. చాలా చాలా థాంక్స్ మీకు, రేణుకు అంది. ఇంతకూ పదేళ్ల క్రితం మిమ్మల్ని థ్రిల్ చేసిన ఆ సంగతేంటో కాస్త చెప్తారా అంది నవ్వుతూ.

ఇదే. ఈ కొంటె తనమే నీలో నాకు బాగా నచ్చేది. ఆఫ్ కోర్స్ చలాకీతనం, స్ఫురద్రూపి, చక్కటి పర్సనాలిటీ. ముఖ్యంగా ఆ పెద్ద వాలు జడలో పైనున్న ఆ స్మాల్ టెయిల్. టెక్నికల్ గా దాన్నేమంటారో నాకు తెలీదు కానీ నాకు చాలా ఇష్టం అన్నాడు.

అబ్బో చాలా కనిపెట్టారు నాలో అంది ఆశ్చర్యంగా. పైకి కనపడరు గానీ బాగా లోతైన మనిషి మీరు అంది.

నువ్వు అడిగావు కాబట్టి చెప్పాను. లేకుంటే నా ఫీలింగ్స్ నాలోనే పదిలంగా ఉండేవి. సరే ఇక వెళదాం విద్య. ఆల్రెడీ అందరూ వెళ్లారు. మనమే లాస్ట్.

మనకోసం వెయిట్ చేస్తున్నారు. ఫ్లైట్ లో ఒక గంట టైం ఉంటుంది. బోలెడు విషయాలు మాట్లాడుకోవచ్చు పద అన్నాడు.

పదండి అని ఇద్దరూ లేచారు.

ఫ్లైట్ ఎంట్రన్స్ లో ఎయిర్ హోస్టెస్ అందరికీ వెల్కమ్ చెప్తోంది చిరునవ్వుతో.

కృష్ణకుమార్ తనని గుర్తుపట్టాడు. తనూ అతన్ని గుర్తించింది.

వెల్కమ్ సర్ హౌ ఆర్ యూ అంది

హాయ్ పూనమ్ ఐ యాం ఫైన్ థాంక్యూ, హౌ ఆర్ యూ అన్నాడు లోపలి వెళుతూ.

ఇద్దరి సూట్ కేసెస్ పైనున్న లగేజ్ పాకెట్ లో పెట్టాడు. విండో సీట్ లో విద్య కూర్చుంది. తను ఆమె పక్క సీట్ లో కూర్చున్నాడు.

టు సీటర్ లైన్స్ రెండు ఉన్నాయి. ఎకానమీ ఫ్లైట్ కదా. ఫోర్ రౌస్ ఉన్నాయి సీట్స్.

ఎవరు తను అడిగింది విద్య.

ముంబై లో ఎయిర్ హోస్టెస్ ట్రైనింగ్ కి పర్సనాలిటీ డెవలప్మెంట్ క్లాసెస్ తీసుకునేవాడిని మన బ్యాంకు తరఫున. అప్పుడు ఈ అమ్మాయి ఆ ట్రైనింగ్

బ్యాచ్ లో ఉంది. పబ్లిసిటీ కోసం మన బ్యాంకు కొన్ని ట్రైనింగ్స్ స్పాన్సర్ చేసేది. మన స్టాఫ్ వెళ్లి కొన్ని క్లాస్స్ చెప్పేవాళ్ళం.

ఓహ్ నైస్ అంది.

పాటలు వింటారా అంటూ ఇయర్ ఫోన్ ఒక సైడ్ ఇచ్చింది.

అమ్మో నువ్వన్నీ ప్రేమ సాంగ్స్ పెడతావు. నాకొద్దు అన్నాడు నవ్వుతూ.

మీకేంకావాలో చెప్పండి అంది.

ఏదన్నా క్లాసికల్ ఇన్స్ట్రుమెంట్ మ్యూజిక్ పెట్టు. విందాం. అదైతే హాయిగా ఉంటుంది అన్నాడు.

తనకు ఇష్టమైన మరుగేలరా ఓ రాఘవా పాట వీణపై వాయించినది పెట్టింది తన గాలెరీ లో సెలెక్ట్ చేసి.

ఓహ్ చాలా బాగుంది అన్నాడు.

ఫ్లైట్ డోర్స్ క్లోజ్ చేశారు. అనౌన్స్మెంట్ ఫార్మాలిటీస్ జరుగుతున్నాయి.

పూనమ్ వచ్చింది. సర్ ఇవి మీకోసం అంటూ డ్రై ఫ్రూట్స్ పాకెట్స్ ఇచ్చింది కృష్ణకుమార్ కి.

తెలుగు నేర్చుకున్నావా అన్నాడు.

అవును సర్. తెలుగు, కన్నడ కూడా నేర్చుకున్నాను.

ఓహ్ గ్రేట్ . థాంక్యూ పూనమ్ నీ హాస్పిటాలిటీ కి అన్నాడు.

వెల్కమ్ సర్. నేను మళ్ళీ వస్తాను అంటూ తనూ బిజీ అయ్యింది అటూ ఇటూ తిరుగుతూ.

ఈ ఫ్లైట్ లో నువ్వొక్కదానివి మల్లెపూలు పెట్టుకున్నట్టున్నావు అన్నాడు విద్య తో.

ఏం మీకు నచ్చలేదా అంది

పూల పరిమళం మత్తు గొలుపుతోంది విద్యా. అంతకంటే ఏం లేదు.

తీసెయ్యమంటారా అంటూ జడ ముందుకేసుకుంది.

ఓహ్ వద్దు అవి ఫీల్ అవుతాయి. నన్నో విలన్ గా చూస్తాయి.

ఏవి ?

పూలు అన్నాడు ఏటో చూస్తూ.

ఇటు తిరిగి చెప్పొచ్చు. మిమ్మల్నేమీ నేను ఊరించను లెండి.

సరదాకి అన్నానులే. అప్పుడప్పుడు ఇలా మాట్లాడుతూ ఉండాలి. లేకుంటే నాకు అస్సలు రొమాంటిక్ టచ్ లేదు అనుకునే ప్రమాదం ఉంది.

మంచిదే. మీ సరదాలు నాతో కూడా పంచుకోవచ్చు అంది.

ఎకానమీ ఫ్లైట్స్ కావడంతో సీట్లు ఇరుకుగానే ఉన్నాయి. హ్యాండ్ ఆర్మ్ మీద ఇద్దరు చేతులు పెడితే ఒకరి చేతులు ఇంకొకళ్ళకి తగులుతున్నాయి. అది గమనించి విద్య తన చేతులు ఒళ్ళో పెట్టుకుంది.

ఫ్లైట్ టేక్ ఆఫ్ అయింది. ఒక గంట ప్రయాణం.

ఫ్లైట్ పైకి వెళ్లి స్టెబిలైజ్ అయ్యింది. మూవ్మెంట్ లో ఎయిర్ పాకెట్స్ ఎక్కువ ఉన్నట్లున్నాయి. చిన్న ఫ్లైట్ కావడంతో బాగా ఊగుతోంది. ఎయిర్ హోస్టెస్ లు కూడా సీట్ బెల్ట్ పెట్టుకుని వారి సీట్స్ లో కూర్చున్నారు. ఎయిర్ హోస్టెస్ అనౌన్స్మెంట్ ఇస్తోంది. ఎయిర్ పాకెట్స్ వలన కొంచెం టర్బులెన్సు ఉంది. కంగారు పడకండి అని చెప్తోంది.

టర్బులెన్సు మరీ ఎక్కువగా ఊగుతుండటంతో విద్య కంగారుపడి కృష్ణకుమార్ చెయ్యి గట్టిగాపట్టుకుని అతని భుజంపై తల వాల్చింది భయంగా ఉంది అంటూ.

ఏమి ప్రాబ్లెమ్ లేదు విద్య. డోంట్ వర్రీ అన్నాడు. అలా ఊగుతుండటంతో అతనికి కూడా కంగారుగానే ఉంది. అది పైకి కనపడనీకుండా విద్యకు ధైర్యం చెపుతున్నాడు.

తలతిప్పి పక్కకు చూస్తే తన భుజంపై వాలిన విద్య మొహం దగ్గరగా కనిపిస్తోంది. ఆమె ఊపిరి వెచ్చగా తన మెడకు తగిలి గిలిగింతలు పెడుతోంది. ఆమె ముంగురులు అతని ముఖాన్ని తాకుతూ అల్లరి చేస్తున్నాయి.

పైలట్ చెపుతున్నాడు. ఫస్ట్ టైం వాతావరణం కొంచెం గాలితో కూడి ఇబ్బందిగా ఉంది. ఎవ్వరు భయపడద్దు. సేఫ్ గానే తీసుకు వెళుతున్నాను అని హామీ ఇస్తున్నాడు.

ఉన్నట్టుండి పెద్ద కుదుపు రావడంతో కంగారులో ఆమె వైపు చూసిన కృష్ణకుమార్ మొహం వంగి అతని పెదవులు విద్య పెదవులను అద్దినట్టుగా తగిలాయి. యాదృచ్చికంగా జరగడంతో కృష్ణకుమార్ ఆ చర్యకు ఇంకా కంగారుపడి ఇటు జరగబోయాడు. భయంతో ఉన్న విద్య అతని చేతిని వదలలేదు. ఇంకా అతనివైపుకు జరిగి గట్టిగా పట్టుకుని అతని భుజం మడతలోతన తలను అలానే ఉంచింది.

కృష్ణకుమార్ కు మటుకు మనసులో కొంచెం అలజడిగానే ఉంది. తను కావాలని అలా చెయ్యకపోయినా ఆమె ఎలా ఫీల్ అయ్యిందో అనుకుంటూ ఇబ్బందిగా ఉన్నాడు.

కొంచెం సేపటి తరువాత వాతావరణం కాస్త మామూలుగా మారింది. ఫ్లైట్ ఊగడం తగ్గి నిలకడగా వెళుతోంది. పైలట్ హ్యాపీ గా అనౌన్స్ చేస్తున్నాడు. డేంజర్ నుంచి బయటపడ్డాము అని.

మెల్లగా అతని చేతుల్లోంచి తన చేతిని తీసుకుని సర్దుకుని కూర్చుంది విద్య.

కృష్ణకుమార్ ఆమె మొహం వైపు చూసేందుకు కొంచెం మొహమాటపడ్డాడు.

విద్య అతని వైపుకు వంగి చెవిలో చెప్పింది మీరు అలా చెయ్యరని తెలుసు. మీరేమీ ఇబ్బంది పడకండి అంది.

హమ్మయ్య అనుకున్నాడు. అప్పటిదాకా ఆమె ఫీలింగ్స్ ఏంటో, తనని ఎలా అనుకుందో అని తెగ మదనపడిపోయాడు.

***

ఫ్లైట్ పదినిముషాలు లేట్ అయినా లాండింగ్ మామూలుగా అవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఎలా ఉన్నావు, ఓకే నా అడిగాడు విద్యని.

నౌ ఓకే. ఇందాక చాలా కంగారు అనిపించింది.

కొన్నిసార్లు గాలి తీవ్రతకు అలా ఊగుతుంది ఫ్లైట్. పైలట్ చాలా చక్కగా మేనేజ్ చేసాడు అన్నాడు.

ఫ్లైట్ నుంచి బయటికొచ్చేప్పుడు పూనమ్ విజిటింగ్ కార్డు అడిగింది కృష్ణకుమార్ ని.

జేబులోనుంచి తీసి పూనమ్ కు ఇచ్చాడు.

మీ ఫాన్స్ మిమ్మల్ని వదలట్లేదు అంది విద్య నవ్వుతూ.

ఈ జనరేషన్ వాళ్ళు చాలా తెలివిగా ముందుకెళుతున్నారు అంటూ పూనమ్ ని మెచ్చుకున్నాడు కృష్ణకుమార్.

హోటల్ కారు డ్రైవర్ కృష్ణకుమార్ పేరుతో ప్లకార్డు పట్టుకుని ఉన్నాడు విజిటర్స్ లాంజ్లో .

అది గమనించి అటువైపు దారితీశారు ఇద్దరూ.

పదకొండవ అంతస్తులో రెండు రూమ్స్ పక్క పక్కనే అల్లాట్ చేశారు ఇద్దరికీ.

ఫార్మాలిటీస్ అయ్యాక చెక్ ఇన్ అయ్యారు.

మీటింగ్స్ కి లీడ్ బ్యాంకు తరఫున కృష్ణకుమార్ హెడ్ చేస్తాడు.

మిగతా నాలుగు బ్యాంక్స్ వాళ్లలో ఒకరు లోకల్ బ్యాంకు మేనేజర్. అతను రేపు డైరెక్ట్ గా మీటింగ్ కి వస్తాడు మిగతా ముగ్గురూ ఇంకా చెక్ ఇన్ కాలేదు.

కంపెనీ వాళ్ళు రేపు మీటింగ్ కి డైరెక్ట్ గా వస్తారు. మొదటి రోజు కంపెనీ తో అన్ని బ్యాంకులకు మీటింగ్ ఉంటుంది. రెండో రోజు బ్యాంకర్లు మాత్రమే మీటింగ్. ఆరోజు సరిపోకుంటే మూడో రోజు మీటింగ్ ఉంటుంది. నో మూడో రోజు కేవలం కుషన్ కింద పెట్టారు.

అందరిని కృష్ణకుమార్ కోఆర్డినేట్ చెయ్యాలి. తమ బ్యాంకు లీడ్ చేస్తోంది కనుక కృష్ణ కుమార్ బాగా ప్రిపేర్ అయ్యి వచ్చాడు.

విద్య కంపెనీ కి సంబంధించిన అంశాలలో హెల్ప్ చేస్తుంది. ఇబ్బందేమీ ఉండకపోవచ్చు అనుకున్నాడు. విద్య ఆ లోన్ కి సంబంధించి ఒక పెద్ద రైట్ అప్ ఇచ్చింది. అది అంతా కవర్ చేస్తుంది. ఆ రిపోర్ట్ అన్నివిధాలా సహాయపడుతుంది అనుకున్నాడు.

టైం సాయంత్రం ఆరయ్యింది. కాసేపు రేణూ తో మాట్లాడాడు.

ఏమండి ! గుడ్ న్యూస్. వెబ్ సిరీస్ వాళ్ళు అగ్రిమెంట్ పేపర్స్ పంపారు. మీరు వచ్చిన తరువాత చూద్దురుగాని. మీకు మెయిల్ కూడా చేస్తాను అంది. కథ ఎండింగ్ మీరే డిసైడ్ చెయ్యాలి అంది.

అలాగే రేణూ, రేపు పొద్దున్న పది గంటలకు మీటింగ్. కంపెనీ వాళ్ళు వస్తారు. ఈ మూడు రోజుల బాగా బిజీ. నేను వచ్చిన తరువాత తీరికగా డిస్కస్ చేద్దాం సరేనా అన్నాడు.

అవును. మీరు విద్యక్కకి బర్త్ డే ప్రెసెంటేషన్ ఏమి ఇస్తున్నారు అని అడిగింది ఉత్సాహంగా.

ఏమో ఇంకా ఏమీ డిసైడ్ చెయ్యలేదు.

తన ముక్కుకు ముక్కు పుడక చాలా బాగుంటుందండీ. అక్కడ దొరికితే అది కొనివ్వండి అంది.

అబ్బా రేణూ. అవి మీ ఆడవాళ్లు ఒకరికొకరు ఇచ్చుకునేవి. ప్లీజ్ నన్ను ఇన్వాల్వ్ చెయ్యొద్దు అన్నాడు బ్రతిమిలాడుతున్నట్లు.

మరేమిస్తారూ. పెన్సెట్ కొనిస్తారా అని హాస్యం చేసింది.

ఏదో ఒకటి. అలాంటి ఆఫిసియల్ గిఫ్ట్ ఇస్తాలే. తరువాత నువ్వేదైనా ఇచ్చుకో అక్కడ . సరేనా అన్నాడు.

సరేలెండి అని ఫోన్ పెట్టేసింది రేణు.

కొన్ని ముఖ్యమైన ఫోన్స్ మాట్లాడి రిఫ్రెష్ అయ్యి అక్కడున్న హాట్ వాటర్ మెషిన్, కాఫీ పొడి వాటితో కాఫీ కలుపుకుని తాగుతున్నాడు.

ఇంటర్కం మోగింది. ఏం చేస్తున్నారంటూ విద్య ఫోన్.

చెప్పాడు.

బోరుగా ఉంది బయటికి వెళదామా అంది.

రెడీ అవ్వు. అరగంటలో వెళదాం అన్నాడు.

రూమ్ బెల్ మోగింది. డోర్ తీసాడు. ఎదురుగా విద్య. చక్కటి చుడీదార్ లో పొడి జుట్టు కు క్లిప్ పెట్టి సహజ సౌందర్యంతో మెరిసిపోతోంది. ఒక్కసారి చూపు మరల్చుకోలేకపోయాడు. అబ్బా ఏమి అందం అనుకున్నాడు మనసులో.

నన్ను లోపలికి రానిస్తారా. అలానే చూపులతో తినేస్తారా అంది నవ్వుతూ.

రా విద్య. కూర్చో. జస్ట్ టు మినిట్స్ అన్నాడు. జోనల్ మేనేజర్ కి , జనరల్ మేనేజర్ కి ఫోన్స్ చేసి మీటింగ్ ఏర్పాట్లు వివరించి చెప్పాడు. పద ఇక వెళదాం అన్నాడు.

ఇద్దరూ లిఫ్ట్ లో కిందకి దిగారు.

చాలా బాగుంది కదా హోటల్ అంది విద్య.

అవును. ఎక్కడికెళదాం అని అడిగాడు.

సెవెన్ అయ్యింది కదా. బయటికెళ్లి చూద్దాం అంది.

రిసెప్షన్ లో కీస్ హ్యాండోవర్ చేస్తుంటే సర్ నైట్ డిన్నర్ కాంప్లిమెంటరీ అంది రిసెప్షనిస్ట్.

బయటికొచ్చి చూస్తే పక్కనే పెద్ద మాల్ కనిపించింది. మాల్ లో కాసేపు తిరుగుదామా అన్నాడు.

ఓకే అంది.

రేణూ, మోహిత్ బర్త్ డే గిఫ్ట్స్ ఇచ్చారు నీకు. నేనే ఇవ్వలేదు. ఏమిచ్చేది అన్నాడు.

నాకా అంటూ కృష్ణకుమార్ మొహం వైపు చూసి అడిగింది. ఏమిస్తారు అని.

నువ్వే చెప్పు నాకేం తెలుసు.

మీకు ఏది నచ్చితే అది ఇవ్వండి అంది. ఫ్లైట్ లో ఆల్రెడీ ఇచ్చారుగా అనబోతు ఆగింది. సరదాకన్నా తను సీరియస్ గా తీసుకుంటాడు.

రెస్టారెంట్ కనిపించింది. కాఫీ తీసుకుందాం అన్నాడు.

అబ్బా ! ఎన్నిసార్లు తాగుతారు కాఫీ అంది.

జస్ట్ ఫోర్ టైమ్స్ ఏ డే అన్నాడు నవ్వుతూ.

అవును గానీ నిన్నొకటి అడగాలి విద్యా ! నీ డెసిషన్ కరెక్టేనా విడాకుల గురించి. ఎందుకంటే జీవితంలో అతి పెద్ద నిర్ణయం కదా అది. మీ పిల్లలిద్దరూ ఏమన్నారు. అంతా హడావిడిగా జరిగింది. నేను కూడా నీతో వివరంగా డిస్కస్ చేయలేదు ఈ విషయం గురించి. జీవితంలో తోడు చాలా అవసరం. అందుకె మళ్ళీ అడుగుతున్నాను. ఏమీ అనుకోవద్దు అన్నాడు.

నా నిర్ణయం కరెక్టే. నేను అంత తొందరగా నిర్ణయానికి రాను. పెళ్ళైన మొదటి రోజు నుంచే నా కష్టాలు మొదలయ్యాయి. మా పిల్లలు కూడా చాలా నరకం అనుభవించారు అతని విషయంలో. అతనితో నా జీవితం ఒక పీడకలగానే భావిస్తాను. అంది.

ఒకే ఒకే. లీప్ ఇట్. నేను కరెక్ట్ గా చేస్తున్నానా అని చెక్ చేసుకునేందుకు అడిగాను. ఇవన్నీ పెద్ద నిర్ణయాలు కదా అందుకని.

కాఫీ తాగి ఇద్దరూ లేచి ఒక్కో షాప్ చూస్తూ వెళుతున్నారు మాట్లాడుకుంటూ.

ఎన్నో కబుర్లు, ఎన్నో జోక్స్ అలా సరదాగా రెండు గంటలు మాల్ లో తిరిగి హోటల్ కి వచ్చారు.

ఓహ్ టాబ్లెట్స్ మర్చిపోయాను అంది.

హోటల్ లోనే ఉందిగా ఫార్మసీ. ఏమి కావాలి చెప్పు నేను తీసుకొస్తాను అన్నాడు.

ఫరవాలేదు నేను తీసుకుంటానులెండి డిన్నర్ అయినతరువాత అంది కంగారుగా.

ఒకే అన్నాడు.

రెస్టారెంట్ కిందనే ఉంది. బఫె డిన్నర్ ముగించుకుని రూమ్ కి వెళుతూ పద ఫార్మసీ షాప్ కి వెళదాం నేనూ వస్తాను నీతో అన్నాడు.

మీరు వెళ్ళండి నేను తీసుకుని వస్తాను అంది.

నేనూ వస్తాను పద అన్నాడు.

స్లీపింగ్ పిల్స్ మైల్డ్ డోస్ తీసుకుంది ప్రిస్క్రిప్షన్ చూపించి.

బయటికొచ్చేప్పుడు అడిగాడు ఎందుకు ఇలాంటి టాబ్లెట్స్ వాడే అవసరం అంటూ.

రాత్రిపూట భయంగా ఉంటుంది. నిద్ర పట్టదు. అందుకే అప్పుడప్పుడు వీటి అవసరం ఉంటుంది. వచ్చేప్పుడు మర్చిపోయాను తీసుకురావడం అంది.

అవి లేకుండా మేనేజ్ చెయ్యకూడదూ.

ఊహూ నావల్ల కాదు. ఈ ముప్పై ఏళ్ళ మారిటల్ లైఫ్ లో నన్ను ఈ టాబ్లెట్స్ చాలా సార్లు ఆదుకున్నాయి. దుఃఖం బలవంతంగా ఆపుకుంది .

ఇక మాట్లాడలేదు కృష్ణకుమార్.

తన రూమ్ లోకి వెళ్ళబోతూ అడిగాడు ఒంటరిగా పడుకోగలవా. లేకుంటే నా రూమ్ లో పడుకో. ఎలాగూ సెపరేట్ బెడ్స్ ఉన్నాయి కదా అన్నాడు.

ఊహూ ఫరవాలేదు. ట్రై చేస్తాను. ఏమన్నా ఇబ్బందిగా ఉంటె మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తాను. ఏమనుకోవద్దు అంది.

నాకేం ప్రాబ్లెమ్ లేదు. నువ్వు ఎప్పుడైనా ఇంటర్కమ్ లో నాకు కాల్ చెయ్యి అన్నాడు.

థాంక్స్ అంది తన రూంలోకి వెళుతూ.

***

పొద్దున్నే ఐదింటికి లేచాడు కృష్ణకుమార్ తన రొటీన్ యోగ, ప్రాణాయామం చేసుకునేందుకు. రాత్రి ఫోన్ మోగలేదు అంటే మామూలుగానే నిద్రపోయి ఉంటుంది విద్య అనుకున్నాడు.

మొబైల్ చూస్తే రాత్రి మాల్ లో తీసిన కొన్ని ఫోటోలు వాట్సాప్ లో పెట్టింది. తను ఎర్లీ గానే లేచింది అనుకున్నాడు.

మొదటి రోజు చాలా బిజీ గా ఉంది మీటింగ్. కంపెనీ వాళ్ళు తమ రిపోర్ట్స్ చూపించి వంద కోట్లకు లోన్ డిమాండ్ చేస్తున్నారు.

మీటింగ్ పూర్తయి డిన్నర్ చేసి అందరితో మాట్లాడి రూమ్ చేరేప్పటికీ పన్నెండు. డిన్నర్ ఐన తరువాత విద్య ను రూమ్ కు వెళ్ళమన్నాడు. తను మిగతా బ్యాంకర్స్ తో మాట్లాడుతూ లౌంజ్ లో కూర్చున్నాడు. మధ్యలో విద్య నుంచి వాట్సాప్ మెస్సేజ్. మీరు రూమ్ కి వచ్చినతరువాత మెస్సేజ్ ఇవ్వండి అని.

పన్నెండప్పుడు ఎందుకులే మెస్సేజ్ ఇచ్చి డిస్టర్బ్ చెయ్యడం అని పడుకున్నాడు. మళ్ళీ మెస్సేజ్ విద్య నుంచి రూమ్ కి వచ్చారా అంటూ.

ఇప్పుడే వచ్చాను అని రిప్లై ఇచ్చాడు.

ఓకే గుడ్ నైట్ అంది.

రెండో రోజు విద్యావతి ప్రిపేర్ చేసి ఇచ్చిన పాయింట్స్ ఎక్సెలెంట్ గ పనిచేసాయి. వాటిమీదే అంతా డిస్కషన్ జరిగింది. మిగతా బ్యాంక్స్ కొన్ని డౌట్స్ అడిగాయి. విద్యావతి లీడ్ తీసుకుని అన్నిటికీ ఆన్సర్ చేసింది. సాయంత్రం ఏడింటికి మీటింగ్ పూర్తయ్యింది. అందరికీ క్లారిటీ వచ్చింది. విద్యావతి స్పెషల్ థాంక్స్ రిసీవ్ చేసుకుంది అందరి దగ్గర నుంచి. సో ఇక మూడో రోజు ఏమీ లేదు. ఖాళీగా తిరగడమే అనుకున్నాడు కృష్ణకుమార్.

రూమ్ కి వస్తూ టుడే యూ డిడ్ మార్వెలస్ జాబ్ విద్యా అన్నాడు. నాకు కూడా చాలా పాయింట్స్ మీద క్లారిటీ వచ్చింది. వందకోట్ల లోన్ కదా. అందరికీ చాలా క్లారిటీ వచ్చింది. థాంక్స్ ఏ లాట్ అన్నాడు మెచ్చుకోలుగా.

వెల్కమ్ అంది. ఫ్రెష్ అప్ అయ్యి బయటికి వెళదామా అంది.

బాడీ లో ఎదో కొంచెం తేడా గా ఉంది. ఇవాళ్టికి కాస్త రెస్ట్ తీసుకుంటాను అన్నాడు.

ఏమయ్యింది. ఎనీ ప్రాబ్లెమ్. ఫీవర్ ఏమైనా ఉందా. చెయ్యి ముట్టుకోవచ్చా అని అడిగింది.

కొంచెం ఉన్నట్లు తోస్తోంది. ఎందుకైనా మంచిది టాబ్లెట్ తెప్పించుకుంటాను అన్నాడు రూమ్ లోకి వెళుతూ.

నేను ఒక గంట తరువాత మీకు కాల్ చేస్తాను అంది విద్య తనూ రూమ్ లోకి వెళుతూ.

ఒకే అన్నాడు. రూమ్ కి వచ్చాడే కానీ బాడీ గాలిలో తేలుతున్నట్లుంది. విపరీతమైన పెయిన్స్. విద్య కు చెప్పలేదు. కంగారుపడి రేణు వాళ్లకి చెప్తే ఇంకా ప్రాబ్లెమ్ అవుతుంది. చూద్దాం రెస్ట్ తీసుకుంటే తగ్గుతుందేమో అనుకున్నాడు. టాబ్లెట్ కి చెపుదాం అనుకుంటూనే పడుకుని నిద్రలోకి జారుకున్నాడు. ముందు రోజు రాత్రి మీటింగ్కి ప్రిపేర్ అవుతూ రెండయింది. సరిగా నిద్రలేదు. విపరీతమైన అలసటగా ఉంది.

బెల్ మోగితే ఉలిక్కిపడి లేచాడు. టైం చూసుకున్నాడు. అమ్మో పదయింది. లేద్దామనుకుంటే బాడీ చాలా వీక్ గా ఉంది. మెల్లగా వెళ్లి తలుపు తీసాడు. విద్య నిలబడి ఉంది.

రండి అన్నాడు.

రెండు సార్లు ఇంటర్ కం లో ట్రై చేసాను. రిప్లై లేదు. అందుకే వచ్చాను. ఎలా ఉంది అని అడిగింది. ఇక లాభం లేదనుకుని నుదుటి మీద చెయ్యి పెట్టి చూసింది. కాలిపోతోంది. జ్వరం బాగా ఉన్నట్లుంది. తన బాగ్ లో చూసింది. జ్వరం టాబ్లెట్స్ ఉన్నాయి. వేసుకోమని ఇచ్చింది. ఏమన్నా తెప్పించేదా ? తింటారా అని అడిగింది.

అబ్బా తినే ఓపిక లేదు విద్యా అన్నాడు. నువ్వు తిన్నావా అని అడిగాడు.

ఊహూ లేదు అంది.

ఓహ్ మై గాడ్. ఉండు నీకేమన్నా తెప్పిస్తాను అంటూ రెస్టారెంట్ కి రింగ్ చేసాడు.

ఇద్దరికీ తెప్పించండి అంది.

నాకు తినాలని లేదు. ఒక చిన్న ఐటెం ట్రై చేస్తాను అని ఆర్డర్ చేసాడు.

ఏడైనా కలిపేదా కాఫీ, టీ, గ్రీన్ టీ అని అడిగింది.

గ్రీన్ టీ అన్నాడు.

ఇద్దరూ గ్రీన్ టీ తాగుతుంటే ఫుడ్ ఐటమ్స్ వచ్చాయి.

అన్నీ ఓపెన్ చేసి రెండు ప్లేట్స్ లో పెట్టింది. కృష్ణకుమార్ కొంచెం చాలు అన్నాడు.

అతనికి కొంచెం పెట్టింది ప్లేట్ లో.

అన్నీ తనే సర్వ్ చేసింది.

అస్సలు ఒపిక లేనట్లు అతని మొహమే చెప్తోంది.

ఇవాళ ఇక్కడే పడుకుంటాను అంది

ఎందుకు. నాకు బాగానే ఉంది అన్నాడు.

బాగానే ఉంది అనిపిస్తే నేను వెళతాను లెండి. అప్పటివరకు ఉంటాను అంది.

ఎందుకు విద్యా. వేళ్ళు ప్లీజ్ అన్నాడు.

ఊహూ నో అంది. మిమ్మల్ని ఇలా వదిలి నేను వెళ్ళను అని భీష్మించుకుంది.

రేణూ కి తెలిస్తే నన్ను ముందు అరుస్తుంది. మిమ్మల్ని కాదు అంది నవ్వుతూ.

సరే అని బలవంతంగా ఒప్పుకున్నాడు. కడుపులో కొంచెం ఫుడ్ పడగానే మంచి నిద్రపట్టింది కృష్ణకుమార్ కి. అందులోనూ టాబ్లెట్ కూడా వేసుకున్నాడు.

మగతగా ఉంది.

సోఫాలో చిన్న దిండు తలకింద పెట్టుకుని పడుకుంది విద్య.

***

బాగా చెమటలు పడుతున్నాయి. జ్వరం తగ్గినట్టుంది. మెలకువ వచ్చి చూస్తే టైం నాలుగయింది. తన కదలికలకి విద్య కూడా లేచింది.

హె విద్యా ! హ్యాపీ బర్త్ డే అన్నాడు అంత నీరసంలోనూ.

థాంక్యూ అంది.

ఎలా ఉంది ఇప్పుడు అని అడిగింది సోఫాలో కూర్చుంటూ.

బాగానే ఉంది. నువ్వు నిద్రపోలేదా ? వెళ్లి పడుకో. నాకు ఇక ఫరవాలేదు అన్నాడు.

దగ్గరకొచ్చి మళ్ళీ చెయ్యిపట్టుకు చూసింది. జ్వరం తగ్గినట్లనిపించింది.

సరే నేను వెళుతున్నాను. మీరు కూడా పడుకోండి. రెస్ట్ తీసుకుని కొంచెం లేట్ గా లేద్దాం. ఇవాళ పనేమీ లేదు కదా అంది.

అవును విద్యా. నేనైతే తొమ్మిదికి లేస్తాను అన్నాడు.

ఓకే బై . టేక్ రెస్ట్ అంది వెళుతూ.

తొమ్మిదన్నాడు గానీ లెచేప్పటికీ పదకొండయ్యింది.

మొబైల్ మ్యూట్ లో పెట్టున్నాడు. రేణూ నుంచి మూడు మిస్సెడ్ కాల్స్ ఉన్నాయి. ఆమ్మో కొంప మునిగింది. ఏమైంది మీకు ఎలా ఉన్నారు అని తెగ

కంగారు పడుతుంది. జ్వరం అని తెలిస్తే ఇక ఊరుకోదు. ఇప్పటికే చాలా మొక్కులు పెండింగ్ ఉన్నాయి వెంకటేశ్వర స్వామికి. ఎదో ఒకటి సర్ది చెప్పాలి అనుకున్నాడు. వాట్సాప్ లో విద్య మెస్సేజ్ కనిపించింది. మీరు లేస్తే మెస్సేజ్ ఇవ్వండి అని.

చక చక లేచి రెడీ అయ్యి రేణు కి ఫోన్ చేసి రాత్రి బాగా లేట్ అయ్యింది రా అని సర్ది చెప్పి విద్య కి మెస్సేజ్ ఇచ్చాడు తను రెడీ అని.

కిందకి వెళ్లి రెస్టారెంట్ లో బ్రేక్ఫాస్ట్ తీసుకుని లాంజ్ లో కూర్చున్నారు.

అప్పుడు గమనించాడు రేణూ ఇచ్చిన చీర కట్టుకొని ఉంది విద్య. ఓహ్ చాలా నచ్చింది తనకి. చీరకే అందం వచ్చింది. కాసేపు కన్నార్పడం మరిచిపోయాడు.

బ్రేక్ఫాస్ట్ సరిపోలేదా అంది విద్య నవ్వుతూ .

సరిపోయింది అంటూ తడబడ్డాడు.

అరే నీకు గిఫ్ట్ ఏమీ ఇవ్వలేదు విద్యా అన్నాడు ఫీల్ అవుతూ.

అబ్బా ఈ గిఫ్ట్ గోల ఆపండి బాబు. ఒక పని చెప్తా చేస్తారా అంది.

చెప్పు అన్నాడు ఉత్సాహంగా.

ఆ ఫ్లవర్ వాజ్ లో ఫ్రెష్ గులాబీలున్నాయి. ఒకటి తెచ్చి నా జడలో పెట్టండి అదే పెద్ద గిఫ్ట్ నాకు అంది.

రోజా పువ్వు తెచ్చాడు కానీ హ్యాపీ బర్త్ డే అని చేతికిచ్చాడు.

వెనక్కి తిరిగి జడ చూపించింది ఆ పూవు పెట్టండి అని.

ఇదేంటి ఇలా చిక్కుకున్నాను నేను అనుకుని మెల్లగా పెట్టాడు. అది మూడు సార్లు కింద పడింది.

ఎందుకు అంత తడబాటు. మనసులో ఏమన్నా అనుకుంటున్నారా ఏంటి కొంపదీసి అంది నవ్వుతూ.

అహహహ అదేం కాదు అని ఈసారి చక్కగా అమరేట్లు తనకిష్టమైన స్మాల్ టెయిల్ లో పెట్టాడు.

థాంక్స్ అంది. ఈ గిఫ్ట్ చాలు నాకు. మీరు ఇంకేం ఇవ్వక్కరలేదు. ఏదన్నా గుడికి తీసుకెళ్లండి. కాస్త టైం స్పెండ్ చేసి వద్దాం.

ఒకే అంటూ రిసెప్షన్ లో కనుక్కున్నాడు. క్యాబ్ బుక్ చేసి ఇద్దరూ చాముండి హిల్స్ వెళ్లారు.

విద్యతో అలా తిరగడం హాయి గొల్పినా మనసులో ఆమెపై ఎటువంటి ఆలోచనా కలగకుండా జాగ్రత్తపడ్డాడు. ఒక మంచి స్నేహితురాలిగా చూడటం, మాట్లాడటం మొదలుపెట్టాడు. అలా ఉండటం తనకు తనే ఎంతో మానసిక దృఢత్వం కలిగినట్లు అనుభూతి పొందాడు. ఇక జీవితంలో ఇలాగే ఉండాలి. తనూ, రేణూ, తన బ్యాంకు ఇవే తనకు ఆరాధ్యం. ఇంతకంటే ఈ జీవితానికి ఇంకేమీ వద్దు. లేనిపోని ఆలోచనలు మనసును కుదిపేస్తే జీవితం చిన్నాభిన్నమవుతుంది. అమ్మో ఆ ఆలోచనే భీతి కలిగిస్తోంది. ప్రశాంతత లోపించేట్లు చేస్తుంది. ఇప్పుడు తను ఎంతో సుఖంగా ఉన్నాడు.

క్యాబ్ లో వచ్చేప్పుడు రోడ్డు కిరువైపులా ప్రకృతి ఎంతో అందంగా ఆహ్లాదంగా ఉంది. మనసులో తన గురించి కేవలం ఒక స్నేహితురాలు అన్న భావంతో ఏ ఇబ్బంది లేకుండా ఎంతో చక్కగా మాట్లాడుతూ విద్యతో ఎంజాయ్ చేసాడు తన కాలేజ్ రోజుల్లోలా. విద్య కూడా ఎన్నో విషయాలు షేర్ చేసుకుంది అరమరికలు లేకుండా. ఆ మాటల్లో ఆమె గొప్ప వ్యక్తిత్వం కనిపించింది కృష్ణకుమార్ కి. కృష్ణకుమార్ కి దేశభక్తి చాలా ఎక్కువ. జాతీయగీతం పాడేప్పుడు పూనకం

వస్తుంది. అంతలా లీనమవుతాడు. మన దేశమన్నా, ఆడవారన్నా చాలా చాలా గౌరవం అతనికి.

లంచ్ టైం కి హోటల్ కి వచ్చేసారు. ఈ మూడు రోజుల్లో ఇద్దరి మధ్య ఎన్నో కబుర్లు దొర్లాయి. చిన్నప్పటి సంగతులు, జోక్స్, కాలేజీ విశేషాలు అలా ఎన్నో. విద్య కి చాలా రోజుల తరువాత మనసు తెరిపి గా అనిపించింది. జీవితంలో ఒక మంచి స్నేహితుడు దొరికాడు. ఏ సమస్య వచ్చినా నేనున్నాను అంటూ ఆదుకునేవాడు. నిజంగా కృష్ణుడే. మంచి మనసు, అంతకు మంచి ఎదుటివారి కష్టాలు తన కష్టాలుగా భావించేవాడు.

లంచ్ కాగానే జోనల్ మేనేజర్ కి ఫోన్ చేసి మీటింగ్ విశేషాలు అంతా డీటెయిల్ గా చెప్పాడు . ఆయన చాలా సంతోషించాడు. అంత పెద్ద సమస్యని అంత చక్కగా డీల్ చేసినందుకు కృష్ణకుమార్ ని అభినందించాడు. మీటింగ్ లో విద్యావతి పాత్ర గురించి చెప్తూ బాగా పొగిడాడు కృష్ణకుమార్ ఆమెని. పక్కనే కూర్చుని వింటున్న విద్యకి కృష్ణకుమార్ అలా పొగడటం చాలా ఆనందం, కొంత ఇబ్బంది కలిగించింది. జోనల్ మేనేజర్ ఫోన్ లో ఇద్దరినీ బాగా మెచ్చుకున్నాడు.

ఫోన్ పెట్టేసిన తరువాత విద్య వైపు తిరిగి చెప్పాడు చూసారా మన జోనల్ మేనేజర్ గారు బాగా ఎక్సైట్ అయ్యారు. ఆయన ఈ మీటింగ్ గురించి చాలా భయంగా ఉన్నాడు ఎలా జరుగుతుందా అని. ఇప్పుడు హాపీగా రిలాక్స్ అయ్యారు. మీటింగ్ సక్సెస్ అయినందుకు విద్య కి చాలా థాంక్స్ చెప్పాడు. ఈ క్రెడిట్ మీకే దక్కుతుంది అన్నాడు నిజాయితీగా.

విద్య సిగ్గుపడుతూ అంది నేను చేసింది చాలా తక్కువ సర్. అంతా మీరే గా సారధ్యం వహించి కొత్త కొత్త ఆలోచనలతో అందరిని మెప్పించి శభాష్ అనిపించారు.

ఉండొచ్చు కానీ స్ఫూర్తి నిచ్చింది మాత్రం మీరే అంటూ విద్య వైపు తిరిగి అన్నాడు.

పొగడ్తలు చాలు బాబు ఇక పదండి. రూముకెళ్ళి సర్దుకుని రెడీ కావాలి అంది విద్య.

మూడు గంటలకి చెక్ అవుట్ చేసి ఎయిర్పోర్ట్ కి వెళ్లారు. ఆరుగంటలకి హైదరాబాద్ ఫ్లైట్.

సీట్ బెల్ట్ పెట్టుకున్నాక మనసులో గట్టిగా అనుకున్నాడు ఈ ప్రయాణంలో లాస్ట్ టైం లా ఎటువంటి కుదుపులు రాకుండా చూడమని. అలా వచ్చి మళ్ళీ విద్య తనపై వాలడం, లేనిపోని ఆలోచనలు కలగడం అవేమీ లేకుండా ప్రశాంతంగా ల్యాండ్ అయ్యేట్లు చూడమని తను అమితంగా పూజించే ఆంజనేయస్వామికి చెప్పుకున్నాడు.

తన మనసులో మాట అర్ధమైనట్లు విద్య తనవైపు చూసి కొంటెగా నవ్వుతూ అంది కంగారుపడకండి బాస్ ఈ సారి మీపై వాలను లెండి. మీకెటువంటి ఛాన్స్ ఇవ్వను అంది.

బాగా సిగ్గుపడ్డాడు కృష్ణకుమార్. చాలా స్ఫురద్రూపి ఈ విద్య అని మనసులో మెచ్చుకున్నాడు.

ఎనిమిదికల్లా విద్య ని ఇంటిదగ్గర డ్రాప్ చేసి తనూ ఇల్లు చేరాడు.

రేణూ ని చూడగానే అబ్బా అని మొహం చేతుల్లోకి తీసుకున్నాడు ఆప్యాయంగా.

మూడు రోజులకే అంత మిస్ అయ్యారా నన్ను అంది రేణూ అతని తల నిమురుతూ.

మరి. నువ్వొచ్చిఉంటే ఎంతో హ్యాపీ గా తిరిగేవాళ్ళం అన్నాడు.

సారీ అండి. మన బుజ్జిగాడు అమెరికా కి వెళ్తే నేను మీతో ఎక్కడికంటే అక్కడికి వస్తాను. సరేనా అంది గారాలు పోతూ.

డిన్నర్ చేసేప్పుడు చెప్పింది రేణూ నా మిడిల్ ఏజ్ లవ్ స్టోరీ కి అద్భుతమైన ముగింపు దొరికిందండి అని సంబరపడిపోతూ.

అలెర్ట్ అయ్యాడు కృష్ణకుమార్. ఏంటి చెప్పు అన్నాడు కంగారుపడిపోతూ.

మీరు చెప్పినట్లు కాకుండా హీరో కి ఇద్దరుభార్యలు అన్న కథతో ముగింపు ఉంటుంది.

ఇదేం ట్విస్ట్. బాగుండదేమో రేణూ ! ఇంకోసారి ఆలోచించు అన్నాడు బ్రతిమిలాడుతున్నట్లుగా.

వెబ్ సిరీస్ వాళ్లకి కూడా అలానే ముగింపు కావాలన్నారు. నేను చెప్పింది వాళ్లకి ఎంతో నచ్చింది అంది.

ఏమో నీ ఇష్టం రా అన్నాడు అన్యమనస్కంగా.

తమ మధ్య నవల ముగింపు విషయంలో జరిగిన సుదీర్ఘ చర్చ అతని మదిలో బోలెడు సంశయాలకు చోటిచ్చింది. రేణూ చెప్పే ముగింపు తన జీవితానికో అర్థం కానుందా అన్న మీమాంసలో పడ్డాడు. ఎందుకో అతనికి ప్రశాంతంగా

సాగుతున్న తన జీవితంలో కొత్త మార్పులు తలెత్తి కొత్త సమస్యలకు దారితీసేట్లు పదే పదే అనిపిస్తోంది. కానీ ఏమి చెయ్యగలడు. మనమంతా విధి చేతిలో కీలుబొమ్మలం కదా ! అది ఎలా ఆడిస్తే అలా ఆడాల్సిందే. తెలిసి తప్పు చెయ్యకూడదు అనేది అతని సిద్ధాంతం. అందుకే విద్యావతి విషయంలో మనసును చాలా అదుపులో ఉంచాడు. ఇంకా భద్రంగా ఉండాలని ఆంజనేయస్వామి మూర్తిని తన బంగారు గొలుసులో ఉంచి మెళ్ళో వేసుకున్నాడు ఇక తన మనసు బ్యాంకు లాకర్ లో ఉన్నట్లే అని ధీమాగా అనుకున్నాడు.

***

కాలం ఎవరికోసం ఆగదు. రోజులు చాలా వేగంగా పరుగెత్తుతున్నాయి . ఓ ఏడాది గడిచింది. ఈ ఏడాది అందరి జీవితాలలో ఎన్నో మార్పులు తెచ్చింది.

అనుకున్న సమయానికి విద్యావతి కి విడాకులు మంజూరు చేసింది కోర్ట్. ఆ విషయంలో కిరణ్ ఎంతో సహాయం చేసాడు. కోర్ట్ లో విద్యావతి కి ఏ ఇబ్బంది కలగకుండా శాస్త్రి ని పోలీసుల ద్వారా కంట్రోల్ లో ఉంచి హాజరు పరిచారు ఇద్దరినీ.

కిరణ్ హామీ ఇచ్చినట్లు రెండే రెండు సార్లు విద్యావతి కోర్ట్ కి అటెండ్ అయ్యింది. జడ్జి గారి ఎదుట తామిద్దరం పరస్పర అంగీకారంతోనే విడిపోతున్నట్లు విద్య, శాస్త్రి చెప్పారు. అందుకు తగినట్లు సంతకం చేశారు. అంతటితో వారి వివాహ జీవితం ముగిసింది.

విద్య శాస్త్రి వైపు కన్నెత్తి కూడా చూడలేదు. అతను పెట్టిన హింస గుర్తుకు వచ్చి మనసులోనే కుమిలిపోయింది. తన అవస్థ ఏ స్త్రీకి రాకూడదని ప్రార్థించింది. పరస్పర అంగీకారం తో విడాకులు కాబట్టి కోర్ట్ వారికి ఏ అభ్యంతరము లేకపోయింది. సంవత్సరంలోపే విడాకులు మంజూరయ్యాయి.

జెడ్జిమెంట్ కాపీ కిరణ్ బ్రాంచ్ కె తెచ్చి ఇచ్చాడు విద్య కి. విద్య కోర్ట్ కి అటెండ్ అయ్యే రెండు సార్లు కృష్ణకుమార్ తన కారులోనే పంపించాడు. డ్రైవర్ రాము కు, కిరణ్ కి మరీ మరీ చెప్పాడు ఆమె భద్రత ముఖ్యం అని. కిరణ్ పోలీస్ వారి సహాయం కూడా తీసుకున్నాడు శాస్త్రి మళ్ళీ తన విశ్వరూపం చూపించకుండా. దానితో అంత సజావుగా సాగింది.

శాస్త్రి లో ఏమైనా మార్పు వచ్చి అద్భుతం ఏదన్నా జరుగుతుందేమోనని ఎదురు చూసాడు కృష్ణకుమార్. విడాకులు మంజూరయ్యేంతవరకు వాళ్ళ బ్యాంకు లో తెలిసిన వాళ్ళ ద్వారా వాకబు చేస్తూనే ఉన్నాడు.

అతనిలో తను అనుకున్న మార్పు వస్తే విద్య ని ఒప్పించి విడాకులు ఆపొచ్చు. కానీ శాస్త్రి లో ఏ మార్పూ రాకపోగా అతని చెడు అలవాట్లు ఇంకా ఎక్కువై లివర్ డామేజ్ వరకు వెళ్ళింది. అంతదూరం వచ్చాక ఇక తన ప్రయత్నాలకు ఫుల్ స్టాప్ పెట్టాడు కృష్ణకుమార్. విద్యకు విడాకులే సరి అయిన మార్గం అని అతనికి తోచింది.

ఒక వైపు విద్య ఇవన్నీ గమనిస్తూనే ఉంది. కృష్ణకుమార్ చేస్తున్న సహాయానికి ఆమె మనసులోనే అతనికి వేల కృతజ్ఞతలు అర్పించింది. అతనికి సహాయం చెయ్యడమే తెలుసు కానీ ఇలా ఇన్నిసార్లు థాంక్స్ తీసుకోవడమంటే అస్సలు నచ్చదు.

కిరణ్ జెడ్జిమెంట్ కాపీ ఇచ్చినప్పుడు మాత్రం కృష్ణకుమార్ కేబిన్ లో ఇద్దరికీ కలిపి థాంక్స్ చెప్తూ నమస్కరించింది విద్య.

విడాకులు మంజూరు ఐన పది రోజులకు శాస్త్రి తన అలవాటు ప్రకారం తప్ప తాగి టు వీలర్ పై వెళ్తూ రోడ్ ఆక్సిడెంట్ లో లారీని ఢీకొని మరణించాడు. గుర్తుపట్టలేనంత గా చితికిపోయింది అతని శరీరం.

తప్పు శాస్త్రి దే కావడంతో కృష్ణ కుమార్ ఏమీ చెయ్యలేకపోయాడు. శాస్త్రి శవాన్ని తన వైపు వారు కూడా ఎవరూ తీసుకెళ్లడానికి ముందుకు రాలేదు. విద్య కొడుకు శ్రీకాంత్ ఆఫీస్ పని మీద కెనడా వెళ్లి ఉన్నాడు. అతను రాలేని పరిస్థితి. శాస్త్రి శవం పోస్టుమార్టం చేయించి కృష్ణకుమార్ తనే పూనుకుని దగ్గరుండి దహనక్రియలు జరిపించాడు.

ఇవన్నీ చెప్తే బాధపడుతుందని విద్య కి ఏ విషయం చెప్పలేదు. కానీ ఆమెకు అన్నీ తెలుస్తూనే ఉన్నాయి. శాస్త్రి మరణం ఆమెకు చాలా దుఃఖం కలిగించింది. ఆ రోజు కొడుకు కూతురితో చెప్పి వెక్కి వెక్కి ఏడ్చింది. కెనడా లో ఉన్న శ్రీకాంత్, అమెరికా లో ఉన్న శ్రీష తల్లిని ఓదార్చే ప్రయత్నం చేశారు.

విద్య దుఃఖం చూడలేక రేణూ ఆమెని ఓ వారం తమ ఇంట్లోనే ఉంచి ఓదార్చింది.

బాగా అప్పులు చేసున్న శాస్త్రి కి బ్యాంకు లో అప్పులు అన్నీ పోను రెండు లక్షలు మిగిలాయి.

వాటికోసం అతని అక్క కృష్ణకుమార్ ఇంటికి వచ్చింది. విద్య గదినుంచి బయటకి కూడా రాలేదు ఆమెను చూడడానికి. ఎందుకంటే తన భర్తని ప్రేరేపించి తనను హింసించడంలో ఆమే ప్రధాన పాత్రధారి. అందుకే ఆమె మొహం చూడటం ఇష్టం లేదు విద్యకి .

రెండు లక్షలు కృష్ణకుమార్ ద్వారా శాస్త్రి అక్కకి ఇచ్చింది. ఆమె దుఃఖం నటిస్తూ డబ్బు చేతిలో పడంగానే వెళ్ళిపోయింది. రేణూ చాలా బాధపడింది ఆ సంఘటనకి. మనుషుల్లో ఇంత మానవత్వం లేనివాళ్లు కూడా ఉంటారా అని భర్త దగ్గర వాపోయింది కూడా.

అన్ని దుఃఖాలు తోడవడంతో విద్యావతి ఇక ఉద్యోగం చేయడం తన వల్ల కాదనుకుంది. రేణూ చెప్పి చూసింది నేనున్నాను గా నీకేంటి నేను చూసుకుంటాను అన్నీ అంది. అందుకు విద్య ఒప్పుకోలేదు. తను ఒకరికి భారం కాకూడదు అనుకుంది.

ఎలాగూ పెన్షన్ వస్తుంది కదా అనుకుని వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుని తన కొడుకు శ్రీకాంత్ దగ్గరికి వెళ్ళింది ముంబై కి. వెళ్లే ముందు రోజు కృష్ణకుమార్ ని

తన ఇంటికి రమ్మని కోరింది. రేణూ నేను ఇద్దరం వస్తున్నాం అని చెప్పాడు కృష్ణకుమార్. వద్దు ప్లీజ్ మీరొక్కరే రండి అని బ్రతిమాలింది.

కృష్ణకుమార్ కి అలా ఆమె ఇంటికి ఒంటరిగా వెళ్లడం ఇష్టం లేకపోయినా ఫర్లేదులే ఐదు నిముషాలు ఉండి వచ్చేస్తాను అని వెళ్ళాడు.

నేనేమీ మిమ్మల్ని ఇబ్బంది పెట్టను లెండి. మీరేం వర్రీ వద్దు అని నవ్వుతూ ఆహ్వానించింది. ఓ మంచి కాఫీ తన స్టైల్ లో పెట్టి ఇచ్చింది.

లోపలి నుంచి చక్కగా ఫ్రేమ్ చేయించిన రేఖా చిత్రం తెచ్చి అతని చేతికిచ్చింది.

అందులో ఇప్పటి కృష్ణకుమార్ పోలికలతో అద్భుతంగా గీసిన చిత్రం, అతని పాదాల దగ్గర పువ్వులేస్తూ విద్య చిత్రం గీసి ఉన్నాయి. చాలా చక్కగా గీసింది విద్య.

మీరు ఇప్పటి పోలికలతో మీ చిత్రం గీయమన్నారు గా వచ్చిన కొత్తల్లో . అందుకే కొంచెం టైం తీసుకుని మీ చిత్రాన్ని నా శాయశక్తులా గీసాను. మీరు నాకు ఎంతో మేలు చేశారు. అందుకు కృతజ్ఞతలు చెప్తే సరిపోదు. అందుకే అలా నా చిత్రం కూడా గీసాను. మీరు చేసిన సహాయానికి మీకు జీవితాంతం రుణపడి ఉంటాను అంది విద్య గద్గద స్వరంతో.

ఓహ్ థాంక్స్ విద్యా. చాలా బాగుంది ఈ చిత్రం. ఇక సహాయానికొస్తే అంత పెద్ద మాటలు ఎక్కువేమో అనిపిస్తుంది నాకు. నీ మిత్రుడి గా నాకు చేతనయినంత నేను చేసాను. అంతకంటే ఎక్కువేమీ లేదు. అందువల్ల ఈ రుణాలు అలాంటి పెద్ద పెద్ద మాటలు వద్దు ప్లీజ్. జీవితంలో నీకు ఎప్పుడైనా ఎలాంటి సహాయమైనా నేనుంటాను నీ పక్కనే. అది గుర్తుంచుకో చాలు. నీకు అంతా మేలే జరగాలి అని నా కోరిక. ఎక్కడున్నా హ్యాపీగా ఉండు. రేణూ మాత్రం జీవితాంతం నిన్ను వదలదు . అంతగా ఆమె నిన్ను ప్రేమిస్తోంది. తన తోబుట్టువు లానే నిన్ను భావిస్తోంది. మరి ఉంటాను అని బయలుదేరాడు కృష్ణకుమార్.

ఈ ఒక్క మారన్నా మీ పాదాలు తాకొచ్చా అంది విద్య.

నీ ఇష్టం అన్నాడు కృష్ణకుమార్.

కృష్ణకుమార్ ఇంటికి వెళ్ళగానే రేణూకి విద్య ఇచ్చిన రేఖా చిత్రం ఫ్రేమ్ ఇచ్చాడు. రేణూ అది చూసి చాలా సంబరపడింది. ఎంతో బాగుంది కదండీ అని ఆనందం వెలిబుచ్చింది. రేణూది చాలా మంచి మనసు. కృష్ణకుమార్ ఆమె దగ్గర తన విషయాలేమీ దాచడు. అన్నీ దాపరికంలేకుండా చెప్పేస్తుంటాడు

చిన్నపిల్లాడిలా. రేణూకి అది ఎంతో నచ్చుతుంది. అందుకే ఇద్దరికీ ఒకరంటే ఒకరికి ఎంతో ప్రాణం.

ముంబై వెళ్లే రోజు విద్య, ఆమె అక్కని రేణూ మధ్యాన్నం భోజనానికి పిలిచింది. కృష్ణకుమార్ కి పదే పదే చెప్పింది రేణూ వాళ్ళిద్దరిని భోజనానికి పిలుస్తున్నాను మీరు తప్పకుండా రండి ఒక గంట సేపు అంది. పలుమార్లు ఫోన్ లు కూడా చేసింది. బ్యాంకు లో బాగా బిజీ గా ఉండటంతో ఇంటికి వెళ్లలేకపోయాడు కృష్ణకుమార్. విద్య కి, ఆమె అక్కకి చీరలు పెట్టింది. రేణూ ఎయిర్పోర్ట్ కి వెళ్లి విద్య కి సెండ్ ఆఫ్ ఇచ్చి వచ్చింది.

సాయంత్రం కృష్ణకుమార్ ఇంటికి రాగానే అన్ని కబుర్లు పూసగుచ్చినట్లు చెప్పింది రేణూ. విద్య వెళ్లినందుకు ఆమె మోహంలో దుఃఖం కనిపించింది.

***

మోహిత్ తను అనుకున్నది సాధించాడు. బి టెక్ లో జె యెన్ టి యు ఫస్ట్ రాంక్ తెచ్చుకున్నాడు. చాలా మంచి మార్క్స్ వచ్చాయి. జి ఆర్ ఈ, టోఫెల్ లో చాలా మంచి మార్క్స్ తెచ్చుకున్నాడు.

తను ప్లాన్ చేసుకున్న సిన్సినాటి యూనివర్సిటీ లో ఎం ఎస్ లో చేరాడు. అప్లై చేయడం నుంచి అక్కడ అకామడేషన్ వరకు విద్య కూతురు శ్రీష చాలా హెల్ప్ చేసింది. ఆ అమ్మాయి రెండో సంవత్సరం చదువుతోంది ఆ యూనివర్సిటీ లో.

మోహిత్ కూడా అక్కా అక్కా అంటూ తనతో బాగా క్లోజ్ అయ్యాడు. మోహిత్ తో పాటు రేణూ కు కూడా శ్రీషతో బాగా చనువు ఏర్పడింది.

మోహిత్ యూనివర్సిటీలో జాయిన్ అయినపుడు శ్రీష తనే రిసీవ్ చేసుకుని అన్ని ఏర్పాట్లూ చేసింది. దాంతో రేణూకి శ్రీష మీద ప్రేమ పెరిగిపోయింది. విద్య తో కూడా రేణూ రోజు వాట్సాప్ లో వీడియో కాల్స్ మాట్లాడు కుంటోంది. అవన్నీ కృష్ణకుమార్ విన్నా వినకపోయినా రాత్రి ఏకరువుపెడుతూ ఉంటుంది. అతను అన్యమనస్కంగానే వింటుంటాడు.

కోటి బ్రాంచ్ లో టార్గెట్స్ రీచ్ అయ్యి అద్భుతమైన పెర్ఫార్మన్స్ కనబరిచినందుకు ఏటా ఇచ్చే ప్రమోషన్లో కృష్ణకుమార్ కి డిప్యూటీ జనరల్ మేనేజర్ గా ప్రమోషన్ ఇచ్చి ముంబై కి జోనల్ మేనేజర్ గా వేశారు బ్యాంకు వారు. ముంబై అనేప్పటికీ రేణూ ఎగిరిగంతేసినంత పని చేసింది. ఇంకేముంది విద్యక్క ను తరచూ కలుస్తూ ఉండొచ్చు అని హ్యాపీగా ఫీల్ అయ్యింది.

కృష్ణకుమార్ కు ఇచ్చిన బ్యాంకు క్వార్టర్స్ కు దగ్గరలోనే విద్య ఉండే అపార్ట్మెంట్స్.

***

విద్యావతి రేణూ మధ్య వాట్సాప్ హాట్ లైన్ గా మారి రోజంతా బిజీ గా ఉంటున్నారు కబుర్లతో. తరచూ వారానికి రెండు సార్లు కలవడం మొదలుపెట్టారు విద్య, రేణూ. అప్పుడప్పుడు కృష్ణకుమార్ ఇంటికి వచ్చేప్పటికి విద్య ఎదురవుతోంది. వారిద్దరి మధ్య బ్యాంకు విషయాలు తప్ప మాటలు ముందుకుపోవడంలేదు.

రేణు విద్య ల మధ్య రాకపోకలు బాగా ఎక్కువయ్యాయి. కృష్ణకుమార్ వర్క్ లో బాగా బిజీ కాబట్టి అవి పట్టించుకోవడం మానేసాడు. విద్య వాట్సాప్ మెస్సేజిస్ కూడా ముఖ్యం అనుకుంటే స్పందించేవాడు. లేకుంటే అసలు చూసేవాడు కాదు.

రేణూకి తన రచనల గురించి చర్చించేందుకు ఇప్పుడు విద్య ఫుల్ టైం శ్రోత గా దొరికింది. అమ్మయ్య అనుకున్నాడు కృష్ణకుమార్ తనకు ఆ బాధ్యత

తప్పించినందుకు. విద్య కూడా ఓపిగ్గా రేణూ కథలన్నీ విని తన ఆలోచనలను చెప్తుంది. అది రేణూకి ఎంతో నచ్చింది కూడా.

రేణు సీరియల్ వెబ్ సిరీస్ లో సూపర్ డూపర్ సక్సెస్ అయ్యింది.

ఆ విషయంలో మాత్రం చాలా అసంతృప్తి కలిగింది కృష్ణకుమార్ కి . ఆ సీరియల్ అంతా చూసాడు కానీ ముగింపు మాత్రం చూడకుండా చాలా సార్లు తప్పించుకున్నాడు. ఎందుకంటే రేణూ హీరో కి ఇద్దరు హీరోయిన్లతో ముడిపెడుతుంది చివరలో. ఆ ఒక్కటి కృష్ణకుమార్ అభిప్రాయానికి వ్యతిరేకం. అందుకే ముగింపు చూడటం చాలా సార్లు దాటవేశాడు. అయినా పెద్దగా పట్టించుకోలేదు రేణూ ఆ విషయం.

తానొకటి తలిస్తే దైవం ఒకటి తలుస్తుంది అనేది సామెతేకాదు యదార్థం కూడా.

విధి చేయు వింతలన్నీ మతిలేని చేష్టలెనని అని ఒక కవిగారు తన సినిమా పాటలో అన్నట్లు ఒక్కోసారి విధి తమాషాలు చేస్తుంటుంది తన తడాఖా ఏంటో మనుషులకు చూపించేందుకు.

అలాంటి ఒక తమాషా కృష్ణకుమార్ జీవితంలో అనూహ్యంగా జరిగింది. అతని జీవితాన్నే మలుపు తిప్పింది.

***

కాలం మౌనంగా తన పని తను చేసుకుపోతున్న తరుణంలో ఓ రోజు

.................

రేణూ ఫోన్ చేసి కృష్ణ కుమార్ ని ఇంటికి త్వరగా రమ్మని చెప్పింది.

ఎంత తెమిలినా ఆరు గంటలకు ఇల్లు చేరగలిగాడు. మరి జోనల్ మేనేజర్ కదా.

బ్యాంకు లో బిజీ బిజీ గా ఉంటాడు అతను.

ఇంటికి రాగానే అతనికి ఇష్టమైన ఆనియన్ పకోడీ టిఫిన్ పెట్టి వేడి వేడి ఫిల్టర్ కాఫీ ఇచ్చింది రేణు.

ఏంటబ్బా ఈ స్పెషల్ ఎఫెక్ట్స్ అనుకున్నాడు. తను ఎప్పుడూ చీరలు, బంగారం లాంటివి కోరదు. అసలు తమ వైవాహిక జీవితంలో అలాంటి పేచీలు ఎప్పుడూ లేవు ఇద్దరి మధ్య.

మిమ్మల్ని ఒకటి అడుగుతానండి అంది గోముగా.

అడుగు అన్నాడు ఏమైఉంటుందా అని ఒకవైపు ఆలోచిస్తూ.

నాకు ఒక్కతే ఇంట్లో బోర్ కొడుతోందండి అంది ఇండైరెక్టుగా.

పనమ్మాయిని కాస్త నేను వచ్చేవరకు ఉండమను. కబుర్లు చెపుతుంటుంది. నీకు హిందీ బాగా వచ్చుగా. తను కూడా బోలెడన్ని కథలు చెప్తుంది. అవి నీ సీరియల్స్ కి బాగా పనికొస్తాయి అన్నాడు నవ్వుతూ.

ఊహూ అది కాదు అంటూ మూతి సున్నాలా చుట్టింది.

అలా చేస్తే అది ఆమె ప్రయోగించే బ్రహ్మాస్త్రం అన్నమాట. ఎవరెస్టు లాంటి కృష్ణకుమార్ ఆ అస్త్రానికి ఆసాంతం కరిగిపోతాడు. ఆ విషయం ఆవిడకి బాగా తెలుసు.

చెప్పరా రేణు నీకేం కావాలిరా బుజ్జి అని దగ్గరికి తీసుకున్నాడు రేణూ ని. ఆ సమయంలో మాట్లాడేప్పుడు అతని వాయిస్ లో మంచు కురుస్తుంటుంది . భార్య ని కోపగించుకున్న దాఖలాలు అతని డైరీ లో అసలు లేవు. కసురుకోవడం కూడా అసలే లేదు ఇప్పటివరకు. ఆవిడకు ఎంతో మర్యాద ఇస్తాడు. అది అతని నైజం.

నేను అడిగితే మీరు నో అనకూడదు అంది గారాలు పోతూ.

ఇక తట్టుకోవడం కష్టమయ్యింది కృష్ణకుమార్ కి. అదేదో చెప్తే కదా బేబీ అన్నాడు.

వెబ్ సిరీస్ లో నా సీరియల్ ఎండింగ్ మీకు బాగా నచ్చింది కదా అంది అతని మొహంలోకి కొంటెగా చూస్తూ.

మింగలేక కక్కలేక పొలమారినట్లు ఏదో అనబోయాడు కీచు గొంతుతో.

నాకు తెలుసు లెండి. ఆ ఇద్దరు భార్యల అంశం మీకు బాగా నచ్చింది. అవునా అంది.

ఏదో పనున్నట్లు లేవబోయాడు.

రేణూ వదల్లేదు. విద్యక్క ను మీరు పెళ్లిచేసుకోవాలి అంది ఇక నాన్చకుండా.

పక్కలో బాంబు పడ్డట్లు ఉలిక్కిపడ్డాడు. నిశ్చలమైన సరస్సులాంటి అతని జీవితంలో ఒక పెద్ద కొండ రాయి పైనుంచి దొర్లి దభాలున పడ్డట్లు ఫీలింగ్. ఇక తను నోరు విప్పకపోతే పెద్ద ప్రమాదంలో పడేట్లున్నాడు.

రేణూ . నువ్వేం మాట్లాడుతున్నావో నీకు అర్ధమవుతోందా. ఇలాంటివి నిజ జీవితాల్లో ఎక్కడా జరగవు. అసలు నీకీ ఆలోచన ఎందుకొచ్చింది. ఇది చాలా ప్రమాదం రా రేణూ. ప్లీజ్. అలాంటి ఆలోచనలు మానుకో. ఇప్పుడు తనకేం బాగానే ఉంది కదా కొడుకు దగ్గర. మీరిద్దరూ వారంలో మూడు రోజులు కలుస్తున్నారు. ఇంకేం కావాలి. ఇలాంటి నిర్ణయం వలన నాకెంత ప్రమాదమో

ఆలోచించావా. వద్దు రేణూ ప్లీజ్. ఇలాంటివి మనకొద్దు. ఇలా అయితే నేను వేరే ఊరికి ట్రాన్స్ఫర్ చేయించుకుంటాను అన్నాడు గట్టిగా. ఎంత గట్టిగా అన్నా కోపం మాత్రం లేదు అతని స్వరంలో. అతని బలహీనత రేణూ కి బాగా తెలుసు. భార్య మాటను త్రోసిపుచ్చలేడు కృష్ణకుమార్. ఎందుకంటే ఆమెను తనకంటే ఎక్కువగా ప్రేమిస్తాడు కనుక.

***

ఆ రోజు నుంచి ఇంట్లో ముభావంగా ఉండటం మొదలు పెట్టాడు. అలాగైనా రేణు తన మనసు మార్చుకుంటుందేమోనని.

తన సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలీలేదు కృష్ణకుమార్ కి. ఇదొక వింత సమస్య. ఎవరైనా వింటే నవ్వుతారు. ఎవరితో చెప్పినా తనకు అభాసుపాలు తప్పదు. లోకమంతా తనవైపే చూసి నవ్వుతున్న ఫీలింగ్.

ఒక నెల అతి భారంగా గడిచింది. ఈ నెల రోజుల్లో ఇంటికి ఆలస్యంగా రావడం. పొద్దున తొందరగా వెళ్లడం చేస్తున్నాడు.

అంతా గమనిస్తూనే ఉంది రేణు. ఆమెకు మటుకు తన మాట నెగ్గుతుందన్న నమ్మకం ఉంది . అందుకే తనూ బెట్టుగా ఉంది ఏమీ పట్టించుకోనట్లు.

కృష్ణకుమార్ ఒక్కో రోజు కరిగిపోదామని మనసులో అనుకున్నా భవిష్యత్తు తలచుకుని ఇద్దరి భార్యల నడుమ తనని ఊహించుకుని మనసు గట్టి చేసుకునేవాడు. ఈ విషయంలో ఏదైనా అద్భుతం జరిగి రేణూ మనసు మారితే అని కనిపించిన దేవుళ్ళకి, దేవతలకి భారీగా మొక్కు కున్నాడు. అటు వైపు రేణూ కూడా అలానే మొక్కుకుంది.

ఇంకో రెండు నెలలు గడిచాయి. రేణూ లో ఏ మార్పూ లేదు. తన పాటికి తను వండి టేబుల్ పైన పెట్టేది. కృష్ణ కుమార్ వడ్డించుకుని తినేవాడు. రచనల్లో బిజీ గా ఉండటం ప్రాక్టీస్ చేస్తోంది ఓ కంట భర్తని గమనిస్తూ.

భార్య రచనలంటే భయం పట్టుకుంది కృష్ణకుమార్ కి . ఇలాంటి కొత్త కొత్త వింత వింత ఆలోచనలు వచ్చి అవి రచనలు గా మారి జనాలమీదకు వైరస్ లా విరుచుకు పడితే పాఠక లోకానికి దిక్కెవరు అన్న దిగులు పట్టుకుంది. అందులో ఇలాంటి రచనలకి వాక్సిన్ కూడా ఉండదు.

చూస్తుండగానే ఆరు నెలలు గడిచాయి. రేణు మాత్రం వీసమెత్తైనా కరగడం లేదు. రోజు రోజుకు గట్టిపడుతోంది.

ఇక తప్పలేదు కృష్ణకుమార్ కి. సరే తనే మాట్లాడి చూద్దాం అని ఆరోజు ఇంటికి తొందరగా వచ్చాడు. తగ్గితే తప్పేముంది అనుకున్నాడు. అందులోనూ తను అమితంగా ప్రేమించే తన భార్య దగ్గర. ఏమీ తప్పులేదు అని మనసు పదే పదే చెప్పింది.

ఇంటి గుమ్మంలో అడుగుపెడుతూనే రేణూ, విద్య మాటలు బిగ్గరగా వినిపిస్తున్నాయి. ఏవో జోక్స్ వేసుకుంటున్నారు. పెద్దగా నవ్వుతున్నారు. ఓహ్ ఇద్దరూ ఇక్కడే ఉన్నారు. ఇవాళ ఇక తాడో పేడో తేల్చుకోవాలి అనుకుని ఫుల్ హాండ్స్ పైకి మడుచుకున్నాడు.

రేణూ అని గట్టిగా అరవబోయి అలవాటులేక రేణూ అని మార్దవ స్వరంలోనే అభ్యర్థిస్తున్నట్లు పిలిచాడు.

పిలిచింది తడవుగా రేణూ వచ్చింది అతని పిలుపు కోసం ఎంతగానో వేచి చూస్తున్నట్లు, పరితపిస్తున్నట్లు. మోహంలో మాత్రం ఆ బిగువుతనం తగ్గించలేదు.

అదే రేణూ. ప్లీజ్ నీ మనసు మారినట్లేగా అన్నాడు అమాయకంగా అడుగుతూ.

ఊహూ లేదు . ఇవాళ అక్కని కూడా పిలిచాను. తన ముందే తేల్చేస్తాను అంది మనసులో ఒకవైపు నవ్వుకుంటూ.

వీళ్ళ మాటలు వింటూ హాల్లోకొచ్చింది విద్యావతి.

ఆమెను చూడాలంటేనే ఇబ్బంది పడ్డాడు కృష్ణకుమార్. దీనికంతటికీ తనే మూల కారణం. ఏమీ ఎరుగని నంగనాచిలా ఎలా చూస్తోందో చూడు అనుకున్నాడు మనసులో. చాలా కోపంగా ఉంది ఆమెమీద.

రేణూ కూడా ఎత్తుకు పై ఎత్తు ఆలోచిస్తోంది. ఇక లాభంలేదనుకుని అతని కాళ్లపై పడింది. సినిమా స్టైల్ లో ప్రాధేయపడింది. నేను మన వివాహ జీవితంలో ఈ ఒక్క కొరికే కదండీ కోరింది. అదీ కూడా మీరు తీర్చకుంటే ఎలా అంది ముక్కు గట్టిగా చీదుతూ.

అయోమయంలో పడ్డాడు కృష్ణకుమార్. ఎందుకు తనకే ఇలా ఇంత పెద్ద సమస్య. దీన్ని ఎలా ఎదుర్కోవడం. తప్పించుకు తిరిగేకంటే ధైర్యంగా ఎదుర్కొని మాట్లాడటం మేలు అనుకున్నాడు. ధైర్యాన్ని కూడగట్టుకున్నాడు.

ఇద్దరినీ కూర్చోమన్నాడు. విద్యావతి వైపు సూటిగా చూస్తూ, భయపెడుతున్నట్లు మొహం పెట్టి నన్ను పెళ్లిచేసుకోవడం నీకు ఇష్టమేనా అని

అడిగాడు. కనుబొమ్మలు పైకెత్తి విలన్లా చూడాలనుకున్నాడు కానీ అవి సహకరించలేదు. మనసులో ఇష్టంలేదు అని చెప్పాలని తన ఇష్టదేవతలందరిని ఆరునొక్క రాగంలో ప్రార్థించాడు. కానీ అతని రాగంలో ఎక్కడో ఏదో లోపం వినిపించింది దేవతలకి.

అతని అభీష్టానికి వ్యతిరేకంగా విద్యావతి చక్కగా తలూపింది. ఆమె వాలుజడలో మల్లెపూలు కూడా నవ్వుతూ పలకరించాయి. చాలా ఇష్టం అని నోటితో కూడా చెప్పింది అదేదో చిన్నపిల్లలు పిప్పరమింట్ అంటే చాలా ఇష్టం అని చెప్పినట్లు.

భగవంతుడా ఇక నాకేంటి దిక్కు అని దిక్కులు పిక్కటిల్లేలా మనసులోనే అరిచాడు. అంతులేని అతని వేదన అరణ్య రోదనే అయ్యింది. అయిపోయింది. అంతా అయిపొయింది. తను ఒంటరిగా మిగిలిపోయాడు. తన జీవన నావ ముక్కలైపోయింది అనుకున్నాడు.

రేణు వారంలోనే తన బలాన్ని కూడగట్టుకుంది. సైన్యాన్ని మోహరించింది. ఒకవైపు రేణు పేరెంట్స్ చెప్పారు కృష్ణకుమార్ కి విద్యావతిని పెళ్లి చేసుకోమని. కృష్ణ కుమార్ పేరెంట్స్ నుంచి కూడా వత్తిడి వచ్చింది చేసుకోరా అబ్బాయి రేణూ చెప్పినట్లు అని. ఇక చిన్న పిల్లలు మోహిత్, శ్రీకాంత్, శ్రీష వాళ్ళకు వచ్చిన

భాషలో వాళ్ళూ చెప్పారు. లోకమంతా ఒకవైపు, తానొక్కడే ఇంకోవైపు ఉన్నట్లు ఫీల్ అయ్యాడు. మరీ సాగదీస్తే రేణూ తన మీద ఇంకో నవల రాసి పాఠక లోకాన్ని కూడా తనకి సపోర్ట్ తెచ్చుకునేట్లుంది. అన్ని విధాలా ఆలోచించాడు. ఇప్పటికిప్పుడు మాయమై సన్యాసం తీసుకుని కనిపించకుండా హిమాలయాలకి వెళ్ళిపోతే అన్న ఆలోచన కూడా వచ్చింది. అమ్మో తల్లి లాంటి నా బ్యాంకు ను వదిలి వెళ్లిపోవడమే. ఆ ఆలోచన భరించలేకపోయాడు. తన బ్యాంకు కు చేయాల్సింది ఎంతో ఉంది. తల్లి ఋణం తీర్చుకోకుండా ఎక్కడికీ వెళ్ళకూడదు అని నిశ్చయించుకున్నాడు. ఏదైతే అది అవుతుంది. ఇప్పటివరకూ జీవితంలో మంచే జరిగింది. ఇకముందు కూడా అలానే జరుగుతుందిలే అన్న నమ్మకం తనకుంది.

రేణూ పట్టుబట్టినట్లు రేపు విద్య తో తన పెళ్లి జరిగితే అన్న ఆలోచన అతన్ని ప్రశాంతంగా నిద్రపోనీడంలేదు. దీనితో కృష్ణకుమార్ మనసుకు తగిలిన గాయాలు తీవ్రం కావడంతో ఒక వారం సెలవు పెట్టి తన రూమ్ కి పరిమితమయ్యాడు. ఎప్పుడూ ట్రిమ్ గా ఉండే అతను గడ్డాలు పెంచేసాడు గుర్తుపట్టలేనట్లుగా.

ఇలా ఎంత కాలం. ఏమైతే అది అయ్యింది అని తెగించి ఒక నిర్ణయానికి వచ్చేసాడు.

రేణూ ని పిలిచి చెప్పేసాడు ఇక నీ ఇష్టం అంటూ. కండిషన్ ఏంటంటే పెళ్లి ఎవరికీ తెలీకుండా, తన పరువు పోకుండా సీదా సాదాగా జనం అంతగా రాని గుడిలో జరగాలని నివేదించుకున్నాడు. ఇలాంటి పెళ్లి, ఈ వయసులో జనం చూస్తే ఎంత తలవంపు తనకు అనుకున్నాడు.

విద్యతో పెళ్ళికి కృష్ణకుమార్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో యురేకా అని ఎగిరి గంతేసింది రేణు.

అనుకున్నదే తడవు వారంలో దగ్గరివారి నడుమ సీదా సాదాగా కృష్ణకుమార్ విద్యావతి పెళ్లి జరిగిపోయింది.

కృష్ణకుమార్ కి ఎదో జరుగుతోందని తెలుస్తోంది కానీ ఇది కలా నిజమా అన్న మీమాంస అతన్ని ఇంకా వదల్లేదు. ఈ వయసులో నాకు పెళ్లేంటి దేవుడా అని మాటి మాటికీ పైకి చూస్తున్నాడు అక్కడ దేవుడు కనపడతాడేమోనని. రేణూ కాళ్ళు పట్టుకున్నంత పనిచేశాడు కేవలం దండలు మార్చుకుంటాంరా రేణూ అంటూ. ఈ వయసులో ఇంత పెళ్లి తతంగం అవసరంలేదని మరీ మరీ చెప్పాడు.

అతనికి చాలా ఇబ్బందిగా ఉంది ఇదంతా. రేణూ కి కృష్ణకుమార్ బలహీనత తెలుసుగా ! అతని చుబుకం పట్టుకుని మా తండ్రివి కదూ, మా బుజ్జివి కదూ ఈ ఒక్కసారికి నేను చెప్పినట్లు చెయ్యండి అని లాలనగా అడిగింది. ఇక మాటలు పెంచలేక పోయాడు. మనసును తన బ్యాంకు లో వదిలేసి శరీరాన్ని రేణూ కి అప్పగించాడు నువ్వేం చెప్తే అలా చేస్తా అంటూ. అతనికి వాదనలు పెద్దగా నచ్చవు అందులోనూ తన ముద్దుల భార్య రేణూ తో. అలా రేణు ఇరుపక్షాలకి పెళ్లి పెద్దగా వ్యవహరించింది.

గుళ్లో పెళ్లి జరిగినా బయట ఒక చిన్న బ్యానర్ కట్టించింది రేణు. విద్య వెడ్స్ కృష్ణ అని. అందులో కృష్ణకుమార్ విద్య ల యుక్త వయసు ఫోటోలు ప్రింట్ చేయించింది. ఎలా ఉంది అని అడిగింది కృష్ణకుమార్ ని ఆ బ్యానర్ చూపించి. ఏడవలేక నవ్వాడు బాగుంది అన్నట్లు.

పెళ్లి జరిపించిన పురోహితుడికి మంత్రాలు చదువుతున్నంతసేపూ బోలెడు సందేహాలొచ్చాయి. రేణూ అటూ ఇటూ తిరుగుతూ తనే అంతా హడావిడి చేస్తుంటే ఉండబట్టలేక కృష్ణకుమార్ ని అడిగాడు ఎవరండీ ఆవిడ మీ చెల్లెలుగారా అని.

అంత దుఃఖం లోనూ చెప్పాడు కృష్ణకుమార్ ఆమె తన మొదటి భార్యని.

ఆ ! అని మూర్ఛపోయినంత పని చేసాడు పురోహితుడు. ఎంత అదృష్టవంతుడవయ్యా నువ్వు. ఇలా దగ్గరుండి పెళ్లి చేసే భార్య దొరకడం నభూతో నభవిష్యతి అన్నాడు. ఏదీ నీ చెయ్యి చూపించు ఇంకా ఎన్ని యోగాలున్నాయో చూస్తాను అన్నాడు. మీ తల్లితండ్రులు పెట్టిన పేరును సార్ధకంచేస్తున్నావన్నమాట శుభం అని దీవించాడు.

అసలే మనసులో మండుతున్న కృష్ణకుమార్ పురోహితుడిపై చిరాకుపడ్డాడు. పక్కనే ఉన్న విద్యావతి అతన్నే చూస్తూ అంతా గమనిస్తూ నవ్వుకుంటోంది పెదాల చాటున. రేణూ ఊరుకోకుండా వెబ్కాస్టింగ్ కూడా పెట్టించింది పెళ్ళితంతుని. అమెరికాలో ఉన్న తన కొడుకు మోహిత్, విద్య కూతురు శ్రీష ఆద్యంతం పరికిస్తూ పెళ్ళికొడుకు పెళ్ళికూతుర్ని హుషారు చేస్తున్నారు. శ్రీష కూడా కృష్ణకుమార్ ని డాడీ అని పిలవడం మొదలుపెట్టింది అప్పుడే. విద్య కొడుకు శ్రీకాంత్ పెళ్లి పనుల్లో రేణూకి కుడి ఎడమ రెండూ భుజాలూ తానే అయి చక చక పనులు చేస్తున్నాడు. మధ్య మధ్యలో డాడీ అంటూ కృష్ణకుమార్ ని పిలుస్తున్నాడు. అప్పటికి ఇంకా విద్య మెడలో తాళి కట్టనేలేదు.

మధ్య మధ్యలో ఏమండీ ఇలా చెయ్యండి అలా చెయ్యండి అంటూ విద్య చెప్తోంది పురోహితుడు చెయ్యమన్నవి. యాంత్రికంగా చేస్తున్నాడు. విధి ఎందుకో నాపై పగబట్టింది అని మాత్రం మనసులో పదే పదే అనుకుంటున్నాడు.

విద్య కు పెళ్లికూతురు అలంకారం చాలా స్పెషల్ గా చేయించింది రేణూ దగ్గరుండి. అంతే కాదు, సంపెంగ లాంటి విద్య ముక్కుకి మరింత అందం వచ్చేలా రవ్వల ముక్కు పుడక అలంకరించి రేణూ తన కోరిక తీర్చుకుంది. ఓ బుట్టెడు మల్లెపూలు జడలో తురిమింది అక్కా నీ జడ బాగుంటుంది అంటూ. పెళ్లి పీటలపై విద్య పక్కనే కూర్చున్న కృష్ణకుమార్ విద్యని అంత అందంలో చూసి ఆమెనుంచి చూపు మరల్చుకోలేక పోతున్నాడు.

ఏదైనా వింత జరిగి ఈ పెళ్లి ఆగిపోతుందేమో అని మాటి మాటికీ అటూ ఇటూ చూస్తున్నాడు కృష్ణకుమార్. అతను అలా చూడటం గమనించిన పురోహితుడు ఏం నాయనా ఇంకా ఎవరన్నా గర్ల్ ఫ్రెండ్స్ రావాల్నా అని సందేహంగా అడిగాడు. అతనికి ఈ పెళ్లి ఓ తమాషా గా ఉంది. మంత్రాలు చదువుతూ కృష్ణకుమార్ వైపు చూస్తూ ఆద్యంతం ఎంజాయ్ చేస్తున్నాడు. ఇక ముహూర్తం దగ్గరపడింది. తాళి తీసుకుని కట్టు నాయనా అన్నాడు పురోహితుడు కృష్ణకుమార్ ఎంతకూ

తీసుకుపోయేసరికి. రేణూ ప్రేమగా గదమాయించింది తాళి తీసుకుని అక్క మెడలో కట్టండి అంటూ. ఇక తప్పలేదు. విద్య మెడలో మూడు ముళ్ళు వేసేప్పుడు కొరకొరా చూసాడు ఆమెని. అఫ్ కోర్స్ ఆమె తన వైపు చూడనప్పుడు అనుకోండి.

ఎంత తెలీకూడదు అనుకున్నా అందరికి ఇట్టే తెలిసిపోతాయి ఇలాంటి విషయాలు. అలా కృష్ణకుమార్ పెళ్లి విషయం క్షణాల్లో వైరల్ అయ్యింది. యూట్యూబ్ లో వీడియో పెట్టుంటే వన్ మిలియన్ వ్యూస్ వచ్చేవి.

పెళ్లి వరకే రేణూ ఆగలేదు. ఆ తరువాతి కార్యక్రమాలకి కూడా నడుంకట్టింది దగ్గరుండి.

వద్దు వద్దు అంటున్నా కృష్ణకుమార్ శోభనం రూమ్ లోకి బలవంతంగా తొయ్యబడ్డాడు. లోపలికెళ్ళగానే కళ్ళు తిరిగాయి అతనికి. తమ బెడ్ రూమ్ ని మొత్తం మల్లెపూలతో నింపేసింది రేణూ. తెల్ల చీరలో, గుప్పెడు మల్లెలు సిగలో పెట్టుకుని, పెళ్లి శోభతో మంచంపై కూర్చున్న విద్య అపరంజి బొమ్మలా వెలిగిపోతోంది. ఒక్క క్షణం కన్నార్పడం మర్చిపోయాడు. అంతలోనే సర్దుకున్నాడు. పెళ్ళైతే చేసింది కానీ రేణూ ఇది తన చేతుల్లోనేగా ఉంది

అనుకుంటూ విద్య వైపు చూడకుండా అక్కడే ఉన్న కుర్చీలో కూర్చుని బ్యాంకు గురించి ఆలోచించడం మొదలుపెట్టాడు మనసును ఎలాగైనా మరల్చాలని.

ఇదిగోండి మీకిష్టమైన స్వీట్ అంటూ ఇచ్చింది విద్య. అటువైపు చూడలేదు. చూస్తే ఏం జరుగుతుందో అతనికి తెలుసు.

ఏంటి కోపమా నా మీద అంటూ కృష్ణకుమార్ ని అడిగింది.

నీమీదేం కోపం లేదు అన్నాడు.

మరి ఎందుకు ఆ బింకం. మీకిష్టం లేకుండా ఏదీ తీసుకోను మీ దగ్గరనుంచి సరేనా అంది బేలగా. ఈ విషయంలో నా తప్పేమన్నా ఉంటే మన్నించండి నన్ను అంది అతని పాదాలు తాకుతూ.

ఇంకేముంది. కరిగిపోయాడు కృష్ణకుమార్. ఆమెను దగ్గరికి తీసుకున్నాడు. నీమీదేం కోపం లేదు రా విద్దూ అన్నాడు.

ఆ విద్దూ అన్న లాలింపు పిలుపు విద్యకి ఎంతో హాయిగా అనిపించింది. తనని దగ్గరకి తీసుకున్న అతని పెదాలపై తన పెదాలనద్దింది పరవశంగా.

వివశుడైపోయాడు కృష్ణకుమార్. ఇక ఆగలేదు అతను. ఆమెను ఆసాంతం ఆక్రమించుకుని ఆనందపుటంచులకి తీసుకెళ్లాడు.

మొదటి రాత్రే కాదు  మూడు రాత్రులు మూడు నిముషాల్లా కరిగిపోయాయి వారిద్దరి మధ్యా.

పదేళ్ల క్రితం తన హృదయాన్ని లాలిత్యంగా స్పృశించి మౌనంగా నిదురిస్తున్న విద్య నేడు తన అర్ధాంగి. విద్య తో పెళ్లి విషయంలో  రేణూ మీద బాగా కోపం వచ్చినా విద్య తో గడిపిన మూడు రాత్రుల మధుర క్షణాలలో కృష్ణకుమార్ శాంతించాడు.

విద్దూ తో  పుష్పకవిమానంలో స్వర్గాన్ని వేల సార్లు చుట్టేశాడు ఆ కొద్దిగంటల్లోనే.

తనకిష్టమైన విద్య వాలుజడతో చాలాసార్లు ఆడుకున్నాడు చిలిపిగా.

వాళ్లిద్దరి ఏకాంతానికి ఏ మాత్రం భంగం కలగకూడదని, వాళ్ళు బయటికి రాకుండా రేణూ టిఫిన్స్, కాఫీ,  భోజనం అన్నీ గది లోపలికే పంపించింది.  మరి రేణూ రచయిత్రి కదా. అన్నీ సునిశితంగా అలోచించి చేస్తుంది కదా !

ఎలా తెలిసిందో కృష్ణకుమార్ ఫ్రెండ్స్ అందరికీ తెలిసింది విద్య తో అతని పెళ్లి విషయం. ముఖ్యంగా శైలజకి తెలిసింది.

గంట గంటకీ లండన్ నుంచి ఫోన్ చేసి ఆటపట్టించింది. ఏంట్రా ఇప్పటిదాకా నువ్వు రామ్ కుమార్ అనుకుంటే నిజంగానే కృష్ణ కుమార్ అయ్యావు అని ఒకటే

ఇక ఇకలు పక పకలు. శైలజ హాస్యాన్ని ఓపికగా భరించాడు తప్పదన్నట్లు. తన రేణూ కోసమే కదా ఇదంతా అని సర్ది చెప్పుకున్నాడు మనసులో. అంతకంటే ఇంకేం చెయ్యగలడు పాపం.

ఇద్దరు భార్యల ముద్దు మురిపాలు బాగా ఎక్కువై అంత ప్రేమను ఒడిసిపట్టడం కష్టమవుతోంది కృష్ణకుమార్ కి. వాళ్ళ అనురాగం, ఆప్యాయతల నడుమ ఊపిరాడటం లేదు. ఉక్కిరిబిక్కిరవుతున్నాడు.

***

ఓ వారం తరువాత ఏకాంతంలో విద్యావతి అసలు విషయం చెప్పింది కృష్ణకుమార్ కి.

రేణు కి కాన్సర్ డిటెక్ట్ అయ్యింది. థర్డ్ స్టేజి లో ఉంది. బ్రతికేది కొద్దికాలమే అని రిపోర్ట్స్ చెప్పాయి. ఆవిడ డాక్టర్స్ ని కూడా అప్రోచ్ కాలేదు. ఎక్కడ వాళ్ళు ట్రీట్మెంట్ మొదలు పెట్టేస్తారో అని. మన పెళ్ళైతే కానీ ట్రీట్మెంట్ చేయించుకోనూ అని అందరితో ఖరాఖండిగా చెప్పింది. మీకు ఈ విషయం చెప్పొద్దని మా అందరిచేత వట్టేయించుకుంది కూడా. అందుకే మీకు ఎవ్వరం చెప్పలేదు అంది.

విద్య చెప్పిన ఆ వార్తకి తన కింద భూమి కుంగిపోయి తాను అందులో పడిపోయినట్లు కృంగిపోయాడు కృష్ణకుమార్. అతని బాధ వర్ణనాతీతం. తన కోసం ఇంత చేసిందా రేణూ. అంతా దాచిపెట్టి తన జీవితం బాగుండాలని తన అనారోగ్యాన్ని కూడా చెప్పలేదా. అయ్యో రేణూ అనుకున్నాడు.

ఎలాగైనా తన రేణూని కాపాడుకోవాలి అని ఆమె టెస్ట్ చేయించుకున్న హాస్పిటల్ కి వెళ్ళాడు ఒక్కడే ఎవరికీ చెప్పకుండా.

పేరు, వివరాలు చెప్పాడు రిసెప్షన్ లో. రిసెప్షనిస్ట్ రికార్డ్స్ అన్నీ వెరిఫై చేసింది కంప్యూటర్ లో.

సారీ సర్. మేమే మీకు ఫోన్ చేద్దామనుకుంటున్నాము. రేణూ మేడం గారి ఫోన్ నెంబర్ మా రికార్డ్స్ లో మిస్ అయ్యింది. అందుకే చెప్పలేకపోయాం. నిజానికి ఆ రోజు ఇద్దరు రేణుక పేర్లు ఉండేవాళ్ళు వచ్చారు టెస్ట్ కోసం. మీ మిసెస్ పేరు ఎం రేణుక. కానీ కాన్సర్ డిటెక్ట్ అయ్యింది యెస్ రేణుక కి. మీ మిసెస్ కి ఏ ఇబ్బందీ లేదు. ఆవిడ ఆరోగ్యం నార్మల్ గానే ఉంది. ఉయ్ ఆర్ రియల్లీ సారీ సర్. ఇలాంటి పొరపాట్లు ఎప్పుడో గానీ మా హాస్పిటల్ లో జరగవు అంది.

హమ్మయ్య అనుకుంటూ ఒకసారి పైకి చూసి భగవంతునికి మనసులోనే నమస్కారం చేసాడు రేణూ కి ఏ ప్రమాదమూ లేదని తెలిసిన తరువాత. అతనికి ఇప్పుడు ఎంతో హాయిగా ఉంది ఆమెకి ఏ ఆరోగ్య సమస్య లేదని తెలుస్తూనే.

మితిమీరిన ప్రేమ ఎంతకు దారితీస్తుందో అర్థమయ్యింది కృష్ణకుమార్ కి.

ఒక ఫాల్స్ రిపోర్ట్ తమ జీవితాలనే మార్చేసింది.

రేణూ తనకేదో జరుగుతుంది, తన జీవితం ముగిసిపోతుంది, తన భర్త ఏమై పోతాడో అని తను ఉండగానే విద్య తో తన పెళ్లి జరిపించి తనని సుఖంగా ఉంచాలని ఆశపడింది. రేణూకి తన పై ఉన్న ప్రేమకి కళ్ల లో నీళ్లు చిప్పిల్లాయి. ఎవరూ చూడకుండా కర్చీఫ్ తో కళ్ళు తుడుచుకుని హాస్పిటల్ నుంచి బయటికొచ్చాడు ఆనందంగా.

ఇక తదుపరి కర్తవ్యం ఏమిటా అని ఆలోచించాడు. రెండు కేజీల స్వీట్స్ ప్యాక్ చేయించి, ఇరవై మూరేల మల్లెపూలు కొని ఇంటికెళ్ళాడు.

ఇంట్లో కాలుపెడుతూనే రేణూ, విద్య ఇద్దరూ ఎదురొచ్చారు.

రేణూ కి కూడా రోజు మల్లెపూలు పెట్టుకోవడం అలవాటు చేసింది విద్య.

కృష్ణకుమార్ కి ఒక మల్లెపూలతోనే తట్టుకోవడానికి కష్టంగా ఉంది. ఇప్పుడు రెండూ అంటే ఆమ్మో అనుకున్నాడు భవిష్యత్తు తలచుకుని.

ఎక్కడికెళ్లారండి ఆదివారంపూట కూడా ఇంతసేపయింది అని కంగారు పడుతూ అతని చేతిలోని స్వీట్స్, మల్లెపూలు అందుకుంది రేణూ ఎందుకు ఇవన్నీ తెచ్చారు ఇప్పుడు అంటూ.

చెప్తా చెప్తా తీరిగ్గా చెప్తా అన్నాడు కృష్ణకుమార్ వాళ్ళిద్దరినీ ఉత్కంఠలోకి నెట్టేస్తూ.

విద్యని పిలిచి రాత్రి ఎనిమిది గంటలకి రేణూ పేరెంట్స్ ని, తన పేరెంట్స్ ని, పిల్లల్ని, అతి ముఖ్యంగా శైలజ ని జూమ్ లో వీడియో కాన్ఫరెన్స్ కి పిలవమన్నాడు.

రేణూ, విద్య లకి అర్థం కాలేదు ఎందుకబ్బా ఈ వీడియో కాన్ఫరెన్స్ అని. అందరికీ వాట్సాప్ లో మెస్సేజ్ ఇచ్చారు. అందరూ అడిగారు ఎందుకు ఎందుకు అని. ఏమో తెలీదు ఆయన సస్పెన్స్ లో ఉంచారు అన్నారు.

శైలజ ఆగే రకం కాదుగా. ఒరేయ్ కృష్ణా ఎందుకురా వీడియో కాన్ఫరెన్స్ అని వాట్సాప్ లో బోలెడు మెస్సేజీలు పెట్టింది అప్పటికే. చెప్తా వెయిట్ చెయ్యి అప్పటివరకు అని రిప్లై ఇచ్చాడు.

కాలం భారంగా గడుస్తోంది విద్య, రేణూ ఇద్దరికీ.

అంతా మౌనంగా, అర్ధంకానట్లు, ఏమి జరుగుతుందో అన్నట్లు ఊపిరి బిగబట్టి ఉన్నారు సాయంత్రం ఎనిమిదివరకు.

పిల్లలు కూడా తల్లులని సతాయించారు వాట్సాప్ లో ఏంటి మమ్మీ ఎందుకూ అంటూ. ఏమోరా తెలీదు అని రిప్లై ఇచ్చారు ఇద్దరు తమ పిల్లలకి.

కృష్ణకుమార్ మాత్రం ఏ టెన్షన్ లేకుండా భార్యలిద్దరూ వడ్డిస్తుంటే చక్కగా భోజనం చేసి ఏ టెన్షన్ లేకుండా తన రూమ్ లో ప్రశాంతం గా నిద్రపోయి ఏడింటికి లేచి ఫ్రెష్ అప్ అయ్యి , కాఫీ తాగి ఎనిమిదిగంటలకి హాల్ లోకి వచ్చాడు.

అప్పటికే లాప్ టాప్ ఆన్ లో ఉంచి అతని కోసం ఎదురు చూస్తున్నారు భార్యామణులిద్దరూ.

వీడియో కాన్ఫెరెస్ లో అందరూ కనెక్ట్ అయ్యున్నారు అప్పటికే. ఎవ్వరూ మాట్లాడటల్లేదు. వాగుడు కాయ శైలజ కూడా మూగదానిలా మాటలుడిగినట్లు చూస్తోంది ఎందుకు తనని కూడా ఇందులో పిలిచినట్లూ అని.

కృష్ణకుమార్ వచ్చి సోఫాలో రేణూ, విద్య ఇద్దరిమధ్య కూర్చున్నాడు. పెద్దలు, పిల్లలు కూడా వెయిట్ చేస్తున్నారు ఏం చెప్తాడా అని.

గొంతు సవరించుకున్నాడు కృష్ణకుమార్. అటు ఇటు ఇద్దరి భార్యలని చూసాడు.

బిల్డ్ అప్ చాలురా బాబు. ఇద్దరూ నీ భార్యలేలే. ఇక మొదలు పెట్టు. టెన్షన్ తో చస్తున్నాం పొద్దుటినుంచి అంది శైలజ. మొదటి సారి ఆమెకు కూడా ఎదో సస్పెన్స్ సినిమా చూస్తున్న ఫీలింగ్ కలిగింది.

చెప్పడం మొదలుపెట్టాడు కృష్ణకుమార్. మొదటగా రేణూ కాన్సర్ థర్డ్ స్టేజి విషయం చెప్పాడు.

పిల్లలకి అప్పటిదాకా ఆ విషయం తెలీదు. అతను చెప్పిన తరువాత అందరూ భోరున ఏడవడం మొదలు పెట్టారు. మోహిత్ మమ్మీ అని ఏడుస్తూ అరుస్తున్నాడు అమెరికా నుంచి. అందరూ దుఃఖసాగరంలో మునిగిపోయున్నారు.

ఎప్పుడూ జోక్స్ వేసే శైలజ  కూడా సారీ రా కృష్ణా ఎంత కష్టమొచ్చింది నీకు అంటోంది దిగులుగా .

విద్య కళ్ళలోంచి నీళ్లు బొట బొట కారుతున్నాయి. తుడుచుకో అక్కా అంటూ తన కొంగు ఇచ్చింది రేణు.

అందరూ ఏడవడం అయిపోయిందా. ఇంకా ఎవరన్నా మిగిలున్నారా అన్నాడు కృష్ణకుమార్ తాపీగా.

తల్లితండ్రులు కోప్పడ్డారు కొడుకు మీద. మేము ఇంత ఏడుస్తుంటే నీకు అంతా వేళాకోళంగా ఉందా అని అరిచి కొట్టినంత పని చేశారు వీడియో లో .

శైలజ కూడా తిట్టింది స్టుపిడ్ అంటూ.

విద్య ఏంటి ఇతను అని గాభరాగా భర్త వైపు చూస్తోంది.

రేణు అప్పుడు మొదలుపెట్టింది ఆరునొక్క రాగం తనకున్న జబ్బు గుర్తుకొచ్చి.

ఇక అందరూ ఆపి నేను చెప్పేది శ్రద్ధగా వినండి అంటూ జరిగిందంతా పూసగుచ్చినట్లు చెప్పాడు.

మొదటగా రియాక్ట్ అయింది రేణు. అంటే నాకు కాన్సర్ లేదా అంది ఆనందంగా.

రచయిత్రులకు ఎక్కడన్నా అలాంటివి వస్తాయా చెప్పు రేణూ. మిమ్మల్ని చూసి ఏ రోగమైనా పారిపోదూ అన్నాడు నవ్వుతూ కృష్ణకుమార్. నీ మితిమీరిన ప్రేమ చూడు ఎంత దూరం తెచ్చిందో. నీకేదో జరిగిపోతుంది అన్న తొందరలో నా పెళ్లి చేసేసావు. ఇప్పుడు చూడు అంటూ తన పక్కన అటూ ఇటూ కూర్చున్న ఇద్దరు భార్యల వైపు చూసాడు. విద్య, రేణూ ఇద్దరూ సిగ్గుపడ్డారు అతని మాటలకి.

రేణూ ఆరోగ్యానికి ఏ సమస్యా లేదని కృష్ణకుమార్ చెప్పిన విషయానికి పెద్దవాళ్లంతా ఎంతో సంతోషపడ్డారు.

మంచి వార్త చెప్పావురా అని తల్లితండ్రులు కృష్ణకుమార్ ని ఆశీర్వదించారు ఇద్దరు భార్యలతో శ్రీకృష్ణుడిలా సుఖంగా ఉండమని. ఈసారి కృష్ణకుమార్ సిగ్గుపడ్డాడు.

రేణూ తల్లి తండ్రులు కూడా తమ కూతురికి ఏ ప్రమాదమూ లేదని తెలుసుకుని చాలా ఆనందపడ్డారు. విద్య కూడా తమ కూతురే అని చెప్పారు. అల్లుడిని, భార్యలిద్దరిని దీవించారు.

ఇక పిల్లలైతే డాన్స్ చెయ్యడం మొదలుపెట్టారు ఆనందంతో.

ఏమైనా నువ్వు లక్కీరా కృష్ణా అంది శైలజ పెద్దగా నవ్వుతూ. ఇంకో వేకెన్సీ ఏమైనా ఉందా నీ దగ్గర అని జోక్ చేసింది కృష్ణకుమార్ తో. తనకీ ఏమన్నా ఛాన్స్ ఉంటుందేమోనని. మరి షెడ్యూల్ ఎలారా అంది ఆందోళనగా. ఇద్దరికీ ఎలా టైం అల్లాట్ చేస్తున్నావ్ అంటూ జోక్ చేసింది.

ఓ గంట సేపు అందరూ ఆనందంగా కబుర్లు చెప్పుకున్నారు.

ఇక చాల్లే రా. ఇప్పటికే బోలెడు టైం అయ్యింది. ఇప్పుడు నీకు ఇద్దరు భార్యలు కదా. టైం సరిపోదు అంటూ పెద్దవాళ్ళు సెలవుతీసుకున్నారు.

వీడియో కాన్ఫరెన్స్ కాగానే రేణూ ని దగ్గరికి తీసుకున్నాడు కృష్ణకుమార్ మా బుజ్జి బంగారం అంటూ. ఇంకో బుజ్జి బంగారం కూడా ఉంది మీకు ఇప్పుడు అంటూ అక్క వైపు చూపించింది. విద్యని కూడా దగ్గరికి తీసుకున్నాడు.

అక్కాచెల్లెళ్ళిద్దరికి సందేహం వచ్చి అడిగారు మరి ఈ రెండు కేజీల స్వీట్స్, అన్ని మల్లెపూలు ఎవరికీ అని.

ఒక వారం విద్యకి , ఒక వారం రేణూకి అన్నాడు కన్నుగీటి ఇద్దరివైపు చూస్తూ.

ఇద్దరూ సిగ్గుతో ముడుచుకుపోయారు.

హాల్ లో ఉన్న ఆంజనేయస్వామి ఫోటో పక్కన శ్రీకృష్ణుడి ఫోటో కూడా పెట్టాడు కృష్ణకుమార్ విద్యతో పెళ్ళైన తరువాత, వ్రతభంగం అయిందన్న కోపంతో.

ఎదురుగా చూస్తే శ్రీకృష్ణుడు నవ్వుతూ తన చేతిలో పిల్లనగ్రోవితో 'నారీ నారీ నడుమ మురారి' అన్నట్లు అభయహస్తమిస్తూ కనిపించాడు గోపికల నడుమ.

(సమాప్తం)

